29-12Pg1exHMNWJQE 1 ONG_29-12Pg1exHMNWJQE.qxd 29/Dec/25 12:31 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు

: fb.com/vaartha Digital

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 328 పేజీలు: 12 వెల: 6.50

# నరసాపురం 'అల్లిక' జిగిబిగి

జిఐ ట్యాగ్ ఉన్న లేస్ అది..

తయారీలో లక్షమంది మహిళలు నిమగ్నం

మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ





**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** ప్రధాని మోడీ ఆదివారం మన్‌కీ బాత్ ప్రసంగంలో ఏపీలోని నరసాపురం ప్రస్తావన తీసుకొచ్చారు. దేశంలోని సంప్రదాయ కళల అంశంపై మాట్లాడుతూ లేస్(అల్లికలు) గురించి ప్రస్తావించారు. ఈ కళ తరతరాలుగా మహిళల చేతుల్లో ఉందని చెప్పారు. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ ఉందని తెలిపారు.కాగా సుమారు 500 రకాల ఉత్పత్తుల తయారీలో లక్షమంది మహిళలు భాగమవుతున్నారు. హ్యాంగింగ్స్, డోర్ కర్టెన్లు, సోఫా కవర్లు, కిడ్స్‌వేర్‌లో ఈ లేస్‌ను వినియోగిస్తారు. ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'మన సాంప్రదాయ కళలు సమాజాన్ని బలోపేతం చేస్తున్నాయి. ప్రజల ఆర్థిక ప్రగతికి ఒక ప్రధాన సాధనంగా మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం జిల్లాకు చెందిన లేస్(అల్లికలు) కళ దేశ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ లేస్‌కళ తరతరాలుగా మహిళలచేతుల్లోనే ఉంది. దేశంలోని మహిళలు >>2

## పట్టణాల తరహాలో గ్రామాల అభివృద్ధి

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, డిసెంబరు 28 ప్రభాతవార్త:** పట్టణాలకు ధీటుగా ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, చేసి చూపిస్తున్నామని, ప్రతీ గ్రామం 'సుందరగ్రామమే' కూటమి ధ్యేయమని కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నియోజకవర్గ గార మండలం బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ 15 ఫైనాన్స్ కమీషన్ నుండి 50 లక్షల విలువ గల వైద్యశాలను, శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేపిహెచ్‌విబి నుండి 260 లక్షల విలువ గల బాలికల హాస్టల్, శ్రీకాకుళం స్థానిక ఎల్‌బిఎస్ కాలనీ, పద్మావతినగర్‌లో, హెచ్‌ఎంసియే, మున్సిపల్ కార్పొరేషన్ నుండి సుమారు 19 లక్షల సిసి రోడ్డు, ఎంపిడివో కార్యాలయం సుమారు 34 లక్షల సిసి రోడ్‌లను, నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్‌తో కలసి ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ బాబు సహకారాలతో రాష్ట్రాన్ని >>2




2లో

ఆదివారం కర్ణాటకలోని కార్వార్ నావల్ హార్బర్‌లో జలాంతర్గామి ఎక్కిన రాష్ట్రపతి ముర్ము

## నేవీ ఏ సవాళ్లకైనా రెడీ

ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో రాష్ట్రపతి ముర్ము

జలాంతర్గామిలో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగా రికార్డు

## పెదమైనవాని లంక డ్రోన్ శిక్షణలో టాప్

ఎఐ టెక్నాలజీలో దూసుకుపోతున్న గ్రామం

నేను దత్తత తీసుకోవడం కాదు.. ఈ గ్రామ ప్రజలే నన్ను దత్తత తీసుకొన్నారు: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



**నరసాపురం, డిసెంబరు 28, ప్రభాతవార్త:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జిల్లా పర్యటన సందర్భంగా ఆదివారం పెదమైనవాని లంక గ్రామంలో డిజిటల్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ఆర్థికమంత్రితో పాటు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కూటమి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంశా పత్రాలు, మెమ్మెంటోలు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ పిఎం లంక గ్రామం అభివృద్ధి గ్రామ మహిళల మద్దతుతోనే సాధ్యమైంది అన్నారు. ఆంధ్ర కోడలు పెదమైనవానలంక కూతురిగా ఇక్కడ వారికి ఎప్పుడు సుపరిచితమేనన్నారు. పీఎం లంకలో నిర్మించిన సైక్లోన్ భవనం అన్ని విధాలుగా ఉపయోగపడడం సంతోషకరమన్నారు. పియం లంక మహిళల మద్దతు వల్లే సైక్లోన్ భవనం డిజిటల్ భవనంగా మారిందని, డ్రోన్లు నడిపేవారు ఉన్నారన్నారు. కానీ వాటిని ఎలా తయారు చేయాలి, మరమత్తు వస్తే ఏం చేయాలి అసలు డ్రోన్ అంటే ఏంటి ఎలా ఉపయోగించాలి దానిపై ఆంధ్రాలో మొట్ట మొదటిసారిగా పిఎం లంకలో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ >>2



ఆదివారం అయోధ్య రామయ్యను సందర్శించి ప్రణమిల్లుతున్న సిఎం చంద్రబాబు

## సుపరిపాలనకు కొలమానం రామరాజ్యమే

దేశ సంస్కృతి, సంప్రదాయాలకు అయోధ్య ప్రతిబింబం

అయోధ్యరాముని దర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** సుపరిపాలనకు రామరాజ్యమే బెంచ్ మార్క్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంచి పరిపాలనను రామరాజ్యంతోనే పోల్చుకుంటామని అన్నారు. ఆదివారం అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహిత్‌లు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సింధూరం దిద్ది. సంప్రదాయక పద్ధతుల్లో ఆయనను సత్కరించారు.ఆలయ మర్యాదలను అనుసరించి రామ మాలతో చంద్రబాబును అలంకరించి స్వస్తి పలికారు. దర్శనం అనంతరం ఆలయ నిర్వాహకులు చంద్రబాబుకు ఆలయ నిర్మాణ శైలి, ఇతర విశేషాలను వివరించారు. ఆయన ఆసక్తిగా ఆలయ విశేషాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ పర్యటన తనకు ఎంతో ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. అత్యుత్తమ పాలనకు రాముడి పాలనే కొలమానంగా తీసుకుంటామని అన్నారు. అయోధ్యలో నిర్మించిన రామమందిరం మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఎన్నో వివాదాల అనంతరం ఆలయం నిర్మితమై దేశప్రజల కల సాకార >>2

## పూర్తి సాయం చేస్తాం

సిఎం చంద్రబాబుకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హామీ

బ్యాంకుల నిర్మాణ పురోగతిని వివరించిన సిఎం




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ, డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అనుహ్యంగా అభివృద్ధి సాధిస్తుంది.మరింత ప్రగతిని సాధించడానికి కేంద్రం అండగా ఉంటుంది అని సెంట్రల్ ఫైనాన్ మినిష్టర్ నిర్మలా సీతారామన్ అన్నారు.ఆదివారం రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రితో విజయవాడ(గన్నవరం) విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా సమావేశం అయిన సీఎం చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగించుకుని వచ్చిన కేంద్ర మంత్రితో కొద్దిసేపు సమావేశం సీఎం మయ్యారు. సీఎం చంద్రబాబు ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో శ్రీబాలరాముని దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సాయంత్రం ఆయన విజయవాడ తిరిగి వచ్చిన సందర్భంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బేటీ అయ్యారు.ఆమెకు చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. అమరావతి రాజధాని అభివృద్ధిని గురించి నిధులు కోరారు.ఇటీవల నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేసిన జాతీయ సంస్థలు,బ్యాంకులు నిర్మాణ పనుల పురోగతిని సీఎం వివరించారు.ఏపీ నిర్దిష్ట కాలంలో మీ నాయకత్వం అతివేగంగా వృద్ధి చెందుతుందనే ధీమాను నిర్మలా సీతారామన్ వ్యక్తం చేసారు.అంతకు ముందు నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవాని >>2

## ఇక రాష్ట్రంలో రెవెన్యూ క్లినిక్‌లు


**విజయవాడ,డిసెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసి సత్ఫలితాలనిచ్చిన రెవెన్యూ క్లినిక్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కొత్త విధానం ప్రకారం, రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో ఖిప్రత్యేక రెవెన్యూ డెస్క్ఖి (రెవెన్యూ క్లినిక్) ఏర్పాటు చేస్తారు. ఇకపై భూ సమస్యలపై అర్జీ ఇవ్వడానికి వచ్చే పౌరులకు కేవలం రసీదు మాత్రమే కాకుండా, వారి సమస్యను ఎవరు, ఎప్పటిలోగా పరిష్కరిస్తారో స్పష్టంగా పేర్కొంటూ ఒక ఖిసర్టిఫైడ్ యాక్షన్ ప్లాన్ఖి (కార్యాచరణ పత్రం) అందిస్తారు. ఈ పత్రంపై డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి సంతకం ఉంటుంది. దీంతో తమ పని పురోగతి గురించి తెలుసుకునేందుకు ప్రజలు పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తమ జిల్లాలో అమలు చేస్తున్న ఖిరెవెన్యూ క్లినిక్ఖి విధానం విజయవంతమైన తీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానం ద్వారా అర్జీల పునరావృతం >>2

## రేషన్ దుకాణాలలో రూ.20కే కిలో గోధుమ పిండి

సంక్రాంతి నుంచి అమలు

**విజయవాడ,డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** నూతన సంవత్సరంలో,సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, జొన్నలతో పాటు గోధుమ పిండి(హోల్ వీట్ ఆటా) పంపిణీ చేసేందుకు ఏపీ పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. బహిరంగ మార్కెట్లో హోల్ వీట్ ఆటా కిలో ధర రూ.40కి పైగా ఉంది. దీనిని సగం ధర రూ.20కే కిలో చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి స్టాక్ కేటాయింపులు జరిగాయి. గుంటూరు జిల్లాలో గోధుమపిండి వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనిని >>2

## మార్చిలోగా కోటి మందికి స్వమిత్వ యాజమాన్య హక్కు పత్రాలు



డిసిఎం పవన్ కళ్యాణ్

**విజయవాడ,డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పించే స్వమిత్వ పథకం ద్వారా వచ్చే మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి ప్రాపర్టీ కార్డులు అందజేసే విధంగా ముందుకు అడుగులు వేస్తున్నట్లు ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు.ఈ మేరకు డీసీఎంవో ఓ ప్రకటన విడుదల చేసింది.స్వమిత్వ మొదటి విడత కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 613 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 5.18 లక్షల మందికి యాజమాన్య పత్రాలు అందించేందుకు సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. రెండో విడత మరో 5,847 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి ఈ నెలాఖరుకి మరో 45.66 లక్షల మందికి వారి యాజమాన్య హక్కు పత్రాలు సిద్ధం చేస్తాం. డిసెంబర్ నుంచి మూడో విడత ప్రారంభించి మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు నిర్ధేశించాం. అందుకోసం సర్వే విభాగం గ్రామ సర్వేయర్ల సేవలను >>2

## ప్రైవేట్ పిఆర్‌ఒలదే 'కొండ' పెత్తనం!



రేపు ఆగమోక్తంగా తెరచుకోనున్న వైకుంఠ ద్వారాలు 3లో

వసతి నుంచి దర్శనాల దాకా వారిదే హవా

డయల్ యువర్ ఇఒకు ఫిర్యాదు అందినా ప్రయోజనం శూన్యం

పట్టించుకోని విజిలెన్స్ యంత్రాంగం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమలకొండపై ప్రైవేట్ పిఆర్‌ఒలదే అంతటా పెత్తనంగా మారింది. వసతి కల్పించే ముఖ్యమైన విచారణ కార్యాలయాల నుండి దర్శనాలు చేయించడం వరకు సర్వం వాళ్ళ కనుసైగల్లోనే టిటిడి యంత్రాంగంనడుస్తోందంటే ఆశ్చర్యపోవలసిన విషయం లేదు.అసలు వీళ్ళంతా ఎవరు, పలుచోట్ల పెత్తనం చేస్తున్నా ఎందుకు కట్టడిచేయలేకపోతురన్నారు ,వీరిని ఎవరు నియమించారనే సమాచారం కూడా టిటిడి అధికారుల వద్ద ఉండకపోవడం విస్మయం కలిగిస్తుంది. చిన్నాచితకా విషయాలకు సామాన్యభక్తులను భయభ్రాంతులకు గురిచేసే టిటిడి విజిలెన్స్ అధికారులు ప్రైవేట్ పిఆర్ఒ వ్యక్తులు చేస్తున్న అజమాయిషీ పెత్తనంపై నిఘా పెట్టలేకపోతుండటం వెనుక అసలు విషయం దేవుడికే ఎరుక అని పలువురు టిటిడి సిబ్బంది బాహాటంగా ఆరోపణలు. పిఆర్ఒల పేరుతో చలామణి అవుతున్న వ్యక్తులకు పద్మావతి విచారణ కార్యాలయం,ఎంబిసి విచారణ కార్యాలయాల వద్ద కొందరు అధికారులు,క్రిందిస్థాయి ఆఫీస్ సబార్డినేట్‌లు వారికి గేట్లు తెరిచి రాచమర్యాదలు చేయడంలో ఆంతర్యమేమిటనేది ప్రశ్నార్థకమే. మరీ ఏకంగా వాళ్ళు అడిగిన చోట గదులు కేటాయించడం వెనుక కూడా ఉన్న మతలబు ఏంటనేది టిటిడి విజిలెన్స్ వర్గాలకు తెలిసిన సత్యమే. అయినా కట్టడిచేయడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీలకు సంబంధించి ఎంపిలు, ఎమ్మెల్సీలు, మంత్రులు,ఎమ్మెల్యేలు తిరుమలలో వసతి, దర్శనాలకు సంబంధించి సేవలకు తమకు అనుకూలురైన వారిని కొంతమందిని నియమించుకుని పనిచే యించుకుంటున్నారు. మంత్రులు వారికి సంబంధించి శాఖల ప్రోటోకాల్ చూడటానికి తిరుపతి, చిత్తూరుజిల్లాల్లో ఆయాశాఖలకు చెందిన >>2

29-12pg2exHMNWJQE 2_29-12pg2exHMNWJQE.qxd 29/Dec/25 12:33 AM Page 1





ఆదివారం ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామి సిబ్బందితో రాష్ట్రపతి ముర్ము

# నేవీ ఏ సవాళ్లకైనా రెడీ

**బెంగళూరు, డిసెంబరు 28:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమ సముద్ర తీరంలో ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామిలో ప్రయాణించారు. నావికాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి కూడా ప్రయాణించారు. ఆదివారం కర్ణాటకలోని కార్వార్ నావల్ హార్బర్‌లో జలాంతర్గామిని ఎక్కారు. రెండు గంటలకు పైగా ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో ప్రయాణించారు. కల్వరి-క్లాస్ సబ్‌మెరైన్ అయిన ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో జలాంతర్గామి సిబ్బందితో సంభాషించారు. నావికాదళ కార్యాచరణ ప్రదర్శనలను వీక్షించారు. స్వదేశీ కల్వరి-క్లాస్ జలాంతర్గామిలో ఈ తొలి ఎంబార్కింగ్ సుప్రీం కమాండర్ సాయుధ దళాలతో కార్యాచరణ సెట్టింగ్‌లలో నిరంతరం అప్రమత్తత ప్రతిబింబిస్తున్నదని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. 2024 నవంబర్ ప్రారంభంలో స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో భారత నావికాదళం చేసిన ఆపరేషనల్ డెమోన్‌స్ట్రేషన్‌ను రాష్ట్రపతి వీక్షించారు. తరువాత సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి తన అనుభవాలను వ్యక్తం చేస్తూ సంక్షిప్తంగా రాశారు. "ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో మా నావికులు, అధికారులతో ప్రయాణించడం, డైవ్ చేయడం, సమయం గడపడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభవం. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ నిర్వహించిన బహుళ విజయవంతమైన కసరత్తులు, సవాలుతో కూడిన కార్యకలాపాలు 'వీర్య వర్ధస్వ విజయ' అనే దాని నినాదానికి అనుగుణంగా సిబ్బంది అసాధారణ సంసిద్ధత, అంకితభావాన్ని ప్రదర్శిస్తాయి. వాఘ్‌షీర్ సిబ్బంది క్రమశిక్షణ, విశ్వాసం ఉత్సాహాన్ని చూడటంవల్ల మన జలాంతర్గాములు, భారత నావికాదళం ఏదైనా ముప్పును, అన్ని పరిస్థితులలోనూ పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని నా హృదయం..." అని సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి రాసుకొచ్చారు. జలాంతర్గామిలో సముద్రంలోకి వెళ్లిన రెండో రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. అంతకు ముందు 2006లో జలాంతర్గామిలో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం నిలిచారు.

**చరిత్ర సృష్టించిన రాష్ట్రపతి:** భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్ అయిన రాష్ట్రపతి నావికాదళ యూనిఫాం ధరించి, సబ్‌మెరైన్‌లోకి ప్రవేశించారు. "కార్వార్ నావల్ బేస్‌లో ఇండియన్ నేవీ స్వదేశీ కల్వరి క్లాస్ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాణించారు" అని రాష్ట్రపతి కార్యాలయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. పి75 స్కార్పీన్ ప్రాజెక్ట్‌లో ఆరవదైన జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌ను జనవరిలో భారత నావికాదళంలోకి ప్రవేశపెట్టారు. నేవీ అధికారులు దీనిని ప్రపంచంలోనే అత్యంత నిశ్శబ్దమైన డీజిల్- ఎలక్ట్రిక్ జలాంతర్గాములలో ఒకటిగా అభివర్ణిస్తున్నారు. ఈ జలాంతర్గామిని అనేక రకాల మిషన్లను నిర్వహించడానికి రూపకల్పన చేశారు. శత్రువుల ఉపరితలనౌకలు (యాంటీ-సర్ఫేస్ వార్‌ఫేర్),శత్రు జలాంతర్గాములపై పోరాటం (యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్),గూఢచార సమాచారసేకరణ, ప్రత్యేక ఆపరేషన్లు, నిఘాకు ఉపయోగించబడుతుంది. ఇదివైర్-గైడెడ్‌టార్పెడోలు,యాంటీ-షిప్‌క్షిపణులు, ఆధునిక సోనార్ వ్యవస్థలతో ఆయుధీకరించబడింది.

## స్వమిత్వ యాజమాన్య హక్కు పత్రాలు

>> పంచాయతీరాజ్ శాఖకు కేటాయించే ఏర్పాటు చేయాలి. పంచాయతీరాజ్ శాఖ, సర్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు స్వమిత్వ సర్వేను నిరంతరం పర్యవేక్షించాలి. క్షేత్ర స్థాయి పర్యటనలకు భాగంగా స్వమిత్వ పథకం కింద నిర్వహిస్తున్న సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల అభిప్రాయం సేకరిస్తాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వే, గత ముఖ్యమంత్రి ఫోటోతో కూడిన పాసు పుస్తకాల కారణంగా ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. మన ప్రభుత్వంలో అలాంటి తప్పులకు తావులేదు. రీ సర్వే తర్వాత ఎవరి భూములు వారికి అప్పగిస్తూ ప్రాపర్టీ కార్డులు ఇస్తాం. రాజ ముద్రతో కూడిన కార్డులు అందిస్తాం. ఈ ప్రాపర్టీ కార్డులు వచ్చిన తర్వాత ఆయా స్థలాలు అమ్ముకునేందుకు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించుకునేందుకు అవకాశం లభిస్తుంది"న్నారు. గిరిజన గ్రామాల్లో చేపట్టిన అడవి తల్లిబాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనబడటం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పక్కా ప్రణాళికతో అన్నింటిని అధిగమించాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం జన్మన్ పథకం కింద వచ్చే నిధులతోపాటు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సాయం మొత్తం కలిపి రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించాం. అడవి తల్లిబాట పనులను వేగవంతం చేయండి. ఎక్కడైనా అటవీ శాఖతోగానీ, ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించుకుంటూ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోండి. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఏదైనా సమస్య ఉంటే దాన్ని తక్షణం పరిష్కరించి పనులు ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలి. పండగ 2.0ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. రూ.2,123 కోట్ల సాస్కీ నిధులతో పల్లెల్లో 4007 కిలోమీటర్ల మేర రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. పల్లెల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ పనులు ముందుకు తీసుకువెళ్తున్నాం. ప్రస్తుతం చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలి. నీటి నాణ్యత పక్కాగా ఉండాలి. అదే అందరి ప్రథమ ప్రాధాన్యత కావాలన్నారు.ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న మంచి నీటి సరఫరా వ్యవస్థల వద్ద నీటి నాణ్యతను స్వయంగా పరిశీలన చేస్తారు. గ్రామీణ ప్రజలకు అందించే మౌలిక వసతుల్లో రోడ్లు, మంచి నీటికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నాం.



పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

## పట్టణాల తరహాలో గ్రామాల అభివృద్ధి

>> సుపరిపాలన దిశగా, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ శ్రీకాకుళాన్ని ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ ప్రజాసేవకునిగా నిరంతరం శ్రమిస్తూ నగర ప్రజలకే పరిమితం కాకుండా, జిల్లా వ్యాప్తంగా కుటుంబ సభ్యునిగా మారిపోయారని, ఆయన చేస్తున్న సేవలు, అభివృద్ధితోనే ఈ స్థాయికి చేరుకున్నారన్నారు. అనంతరం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తుందంటే ముఖ్య కారకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, రాష్ట్ర మంత్రి లోకేష్ బాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి, శ్రీకాకుళం ముద్దు బిడ్డ కింజరాపు రామ్మోహన్ నాయుడుల సహకారాలని, కార్యకర్తలకు, బడుగు, బలహీన వర్గాలని తేడా లేకుండా, ప్రతీ ఒక్కరినీ కలుపుకుంటూ, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న పార్టీ టీడీపీ అని, అందరినీ సమన్వయం చేసుకుంటూ, అందరికీ అందుబాటులో ఉంటూ, ప్రతీ సమస్యకు సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా వైద్యాశాఖాధికారి అనిత, మండల, నగర టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, మండల, నగర పరిధి ప్రజలు, మహిళా నాయకులు, వైద్య, సచివాలయ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామరాజ్యమే

>> మైందన్నారు. భారత్‌లో ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య రామాలయం మారిందని అన్నారు. ఆలయ నిర్మాణంతో పాటు యూపీలో సుపరిపాలన అందిస్తున్న యోగీ ఆదిత్య నాథ్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. దేశంలోని ఇతర దేవాలయాలకు అయోధ్య రామాలయం మార్గదర్శకంగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. సాంకేతికంగా ముందుడుగు వేస్తున్న భారత్‌ను ఎవరూ నిలువరించలేరని స్పష్టం చేశారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంలో యూపీ, బీహార్‌లు కూడా కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈరోజు అయోధ్యలోని దివ్యమైన, అద్భుతమైన శ్రీరామ జన్మభూమి మందిరంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసుకునే భాగ్యం కలిగింది. మరోసారి ఇక్కడికి రావడం ఎంతో శాంతియుతంగా, ఆధ్యాత్మికంగా అనిపించింది. శ్రీరాముడి విలువలు, ఆదర్శాలు మనందరికీ శాశ్వతమైన పాఠాలు. అవి మనకు ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తూ, స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అంతకుముందు, బాలరాముడి దర్శనార్థం అయోధ్య చేరుకున్న చంద్రబాబుకు దేవాలయ అధికారులు, ఉత్తరప్రదేశ్ ఎన్డీఏ నాయకులు ఘన స్వాగతం పలికారు.శ్రీరాముడి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ సామాజిక మాధ్యమం వేదికగాను స్పందించారు. శ్రీరాముడు పాటించిన విలువలు కాలానికి అతీతంగా ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంటాయి. రాముడు పాటించిన విలువలు సుపరిపాలనకు నిరంతరం మార్గదర్శంగా నిలుస్తాయి. అయోధ్యలో శ్రీరామ దర్శనం నాకు నూతన శక్తిని ఇచ్చింద్ది అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ప్రైవేట్ పిఆర్‌ఒలదే 'కొండ' పెత్తనం!

>> కొందరు మాటతీరు, చక్కటి వ్యవహారశైలి కలిగిన ఉద్యో గులు ప్రోటోకాల్ చూసేందుకు ప్రత్యేకంగా కేటాయించబడుతారు. ఆయా మంత్రుల నుండి సిఫార్సు లేఖలు వీరికి అందితే ప్రోటోకాల్‌కు నియమించబడ్డ ఉద్యోగులు ఆ లేఖలను తిరుమలలో అదనపు ఇఒ కార్యాలయంలోసమర్పిస్తుంటారు. అక్కడ కొందరు ఉద్యోగులు తగిన విధంగా దర్శనాలు, వసతి సౌకర్యం మంజూ రుచేస్తారు. ఇక ప్రముఖంగా న్యాయశాఖ, జిల్లా కలెక్టర్ కార్యాల యం, రెవెన్యూ విభాగం, మున్సిపల్ కార్పొరేషన్, కొన్ని ప్రభుత్వశాఖల్లో ఐఎఎస్, ఐపిఎస్ హోదాల అధికారుల ప్రోటోకాల్ చూడటానికి ఆయా శాఖల నుండి తగిన గుర్తింపుకార్డులతో సిఫా ర్సు లేఖలు తీసుకువస్తుంటారు.కానీ ఎటువంటి గుర్తింపు కార్డుగానీ, అధికారికంగా తగిన ఆధారాలు లేకపోయినా ప్రైవేట్ పిఆర్‌ఒలు పెత్తనం మాత్రం తిరుమలలో పెరిగిపోయింది. దాదాపు యాభైఅరవైమంది వరకు ప్రైవేట్ పిఆర్‌ఒల పేరుతో పెత్తనం చేస్తున్నా విజిలెన్స్ కంటికి మాత్రం కనిపించరా అనేది ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది. రెండునెలల క్రిందట నవంబర్‌నెలలో జరిగిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో కూడా ఓ భక్తుడు ప్రైవేట్ పిఆర్‌ఒ పేరుతో జరిగిన దందాపై ఫిర్యాదు చేయడం ఇందుకు నిదర్శనం.అయితే ఇఒ కూడా తనదైన శైలిలో వసతి,దర్శనాలకు కొండపై భక్తులు దళారులను ఆశ్రయించవద్దని,మాయమాటలు వినవద్దని,సామాన్యభక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. అయినా అలా ప్రైవేట్ పిఆర్‌ఒల పేరుతో చలామణి అవుతున్న వ్యక్తులు ఎవరనేది ఇప్పటివరకు విజిలెన్స్ ఆరా తీయకపోవడం కొసమెరుపు.

**ప్రైవేటు పిఆర్‌వోల కట్టడి ఏదీ?:** రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తిరుమలలో బిఆర్‌నాయుడుబోర్డు ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి టిటిడి ఇఒ , అదనపు ఇఒ అధికారులు పారదర్శకంగా సామాన్యభక్తులకు వసతి, దర్శనం చేయించేలా మార్పులు తీసుకువచ్చారు. గదులు దొరకని సామాన్యభక్తులకు యాత్రికుల వసతి సముదాయాల్లో సౌకర్యాలు అందుతూన్నాయి. కొంతకాలం క్రిందట సామాన్య భక్తుడు కనీసం గదిని కూడా పొందలేకపోయాడంటే ఆశ్చర్యం లేదు. ఆ విధానంలో ప్రస్తుత అధికారులు పూర్తిమార్పులు తీసుకువచ్చారు. అయినా అడపాదడపా పలు రకాలుగా సామాన్యభక్తులను మోసంచేయడానికి దళారులు ప్రయత్నాలు చేస్తున్నారనేది టిటిడికి ఫిర్యాదులు అందుతున్నాయి. తిరుమలలో ప్రైవేటు పిఆర్‌ఒల పేరుతో కొనసాగిస్తున్న పెత్తనాలకు మాత్రం బ్రేక్ వేయలేకపోతున్నారంటే ఏమిటనేది అర్థం చేసుకోవచ్చు. మూడునాలుగునెలల క్రిందట తిరుమలలో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో చేపట్టిన తనిఖీలు కొంతవరకు ఫలితాన్నిచ్చినా ఎక్కువగా ప్రజాప్రతినిధుల లేఖలతో ఉన్న వారెవరనేది మాత్రం సైలెంట్.



సముద్రపు కోతకు గురి కాకుండా నిర్మిస్తున్న కరకట్టను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి నిర్మల

## పెదమైనవాని లంక డ్రోన్ శిక్షణలో టాప్

>> పొందిన యువత దేశ విదేశాల్లో మంచి స్థానంలో ఉన్నారని , వారంతా తమ అభిప్రాయాలను పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విశ్వకర్మ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ జరిగిందని, శిక్షణ ఎలా ఉంది, ఎలా జరిగింది అని దేశవ్యా ప్తంగా సర్వే చేయగా జమ్మూ కాశ్మీర్ మొదటి స్థానంలో ఉండగా రెండో స్థానంలో పిఎం లంక ఉండడం ఎంతో ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. రైతులు, మహిళలు డ్రోన్లు వినియోగించే స్థాయికి చేరుకోవాలన్నారు. పదేళ్ల కిందట ఇదే ప్రాంతంలో పెద్ద కొబ్బరి తోట ఉండేదని, అది సముద్రపు అలల కోతకు సముద్రంలో కలిసి పోయింద న్నారు. అలల తాకిడిని ఆపేందుకు అధునాతన టెక్నాలజీతో అడ్డుకట్ట నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. పదేళ్ల తర్వాత ఇక్కడ ఎంతో మార్పు వచ్చిందని సైక్లోన్ వస్తే ఈ ప్రాంతాన్ని ఎలా రక్షి ంచాలని ఆలోచన నుంచి ఏఐ శిక్షణ వరకు అభివృద్ధి చెందిందన్నారు. పీఎం లంక వాసులకు పీఎం ఆవాస్ యోజన కింద 146 మందికి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, అవి రాబోయే 12 నెలలలో పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మత్స్యకారులకు బోట్లు అందించేందుకు ధరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అవి కూడా ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ సూచించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ దేశ ప్రగతికి, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ క్రియాశీలక పాత్ర నిర్వహిస్తున్నారన్నారు. 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ నాలుగో స్థానానికి తీసుకురావడంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక మంత్రిగా తీసుకున్న సంస్కరణలతో సాధ్యమైందన్నారు. పీఎం లంక, తూర్పు తాళ్ల గ్రామాలలో ఇంటింటా మరుగుదొడ్లు, స్కూలు భవనాల నిర్మాణాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పీఎం లంక సముద్రపు కోతకు గురి కాకుండా రక్షణ గోడకు 13.50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం త్వరలో పూర్తికానున్నట్లు తెలిపారు. పెదవైనవాని లంకలో డిజిటల్ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవడం, వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యావంతులకు ఉపాధి కలుగుతుంది అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ బొమ్మిడి నాయకర్, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అనంతరం పీఎం లంక సముద్ర తీరాన సముద్రపు కోతకు గురి కాకుండా సిఎస్ ఆర్ నిధులు రూ.13.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అడ్డుకట్ట నిర్మాణం పనులను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి స్వయంగా పరిశీలించి, ప్రాజెక్ట్ చేపట్టిన ఎలైట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలను తెలుసుకుని, పనుల నిర్మాణం ప్రజెంటేషన్ ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అంతకుముందు అక్కడే ఉన్న శివాలయాన్ని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనాలను తీసుకున్నారు.

# పూర్తి సాయం చేస్తాం

>> లంకలో పర్యటించారు.ఈ గ్రామంలో నిర్మించిన సైక్లోన్ భవనం అనేక విధాలుగా ఉపయోగపడటం సంతోషాన్నిస్తోందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఇక పెదమైనవానిలంకల గ్రామ పర్యటనలో భాగంగా అక్కడ ఆమె మాట్లాడుతూ తాను గ్రామాన్ని దత్తత తీసుకోవడం కాదు, గ్రామమే తనను దత్తత తీసుకుందని ఉద్వేగానికి లోనయ్యారు. గ్రామ మహిళల మద్దతులో సైక్లోన్ భవనం డిజిటల్ భవనంగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన అనేక మంది దేశ, విదేశాల్లో మంచి స్థానంలో ఉన్నారని గుర్తుచేశారు. శిక్షణపై సర్వేలో పెదవానిలంక దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. డ్రోన్ల వినియోగంపై ఏపీలో తొలిసారి పీఎం (పెదమైనవానిలంక)లో శిక్షణ ఇస్తున్నారని నిర్మల అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు పెదవానిలంకలో నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో నిర్మల పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని డిజిటల్ భవన్‌ను సందర్శించారు.శిక్షణ కేంద్రాలకు సంబంధించిన వివరాలను అధికారులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, తీరప్రాంత యువత ఉన్నత చదువులు చదివి దేశానికి, రాష్ట్రానికి మంచి సేవలు అందించాలని కోరారు.





# 'అల్లిక'జిగిబిగి

>> దీనిని ఎంతో ఓపికతో, నిశితమైన శ్రద్ధతో పరిరక్షించారు. నేడు ఈ సంప్రదాయం ఒక కొత్త కోణంలో ముందుకు తీసుకెళ్లబడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డ్ సంయుక్తంగా కళాకారులకు కొత్త డిజైన్లను నేర్పిస్తూ, మెరుగైన నైపుణ్య శిక్షణను అందిస్తూ, వారిని కొత్త మార్కెట్లతో అనుసంధానం చేస్తున్నాయి.నరసాపురం లేస్‌కు జిఐ ట్యాగ్ కూడా లభించింది. నేడు, దీని నుండి 500 కంటే ఎక్కువ ఉత్పత్తులు తయారు చేయబడుతున్నాయి. 250కి పైగా గ్రామాలలో సుమారు లక్ష మంది మహిళలు దీని ద్వారా ఉపాధి పొందుతున్నారు' అని మోడీ ఈ సందర్భంగా వివరించారు.

## ఇక రాష్ట్రంలో రెవెన్యూ క్లినిక్‌లు

>> చిన సీఎం చంద్రబాబు, దీనిని తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సీసీఎల్‌ఏను ఆదేశించారు. ఈ నిర్ణయంపై కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "జిల్లాలో మేం ప్రవేశపెట్టిన విధానాన్ని ప్రభుత్వం గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా వినియోగిస్తున్నారు. అర్జీ నమోదు చేసిన వెంటనే, సమస్య పరిష్కారానికి పట్టే సమయం, బాధ్యతగల అధికారి వివరాలతో యాక్షన్ ప్లాన్ జనరేట్ అవుతుంది. అంతేకాకుండా, గడువు ముగిశాక ఐవీఆర్ఎస్ (1జులిలీ) ద్వారా అర్జీదారునికి ఆటోమేటెడ్ కాల్ వెళ్లి, సమస్య పరిష్కారమైందో లేదో ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. ఈ నూతన విధానంతో రెవెన్యూ యంత్రాంగంలో జవాబుదారీతనం పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## రూ.20కే కిలో గోధుమ పిండి

>> పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. 2,68,709 కేజీల ప్యాకెట్లను సివిల్ సప్లైస్ గోదాములలో నిల్వ ఉంచుతుంది.బాపట్ల జిల్లాకు 58,718 కేజీ ప్యాకెట్లు, పల్నాడు జిల్లాకు 1,19,677 ప్యాకెట్లను కేటాయించింది. గోధుమ పిండికి డీలర్ల నుంచి ముందుగానే నగదు చెల్లించుకుని సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి గోధుమపిండి ప్యాకెట్లను నెలాఖరులోగా రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి డీలర్లు రేషన్ సరుకుల్లో గోధుమ పిండి పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. డీలర్లకు ఇచ్చే రూ.1 కమీషన్‌నూ రూ.20 ధరలోనే చేర్చారు. దీని వల్ల అదనంగా ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరాదని రేషన్ డీలర్లకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కార్డుదారులు జనవరి నెల రేషన్ సరకుల కోసం డిపోలకు వెళ్లినప్పుడు డీలర్లను అడిగి బియ్యం, చక్కెర, జొన్నలు, గోధుమపిండి ప్యాకెట్ తీసుకోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం సబ్సిడీలను భరించి కార్డుదారుల కోసం ప్రత్యేకంగా జొన్నలు, గోధుమ పిండి కొనుగోలు చేసింది. వీటిని కార్డుదారులు సొంతానికి వినియోగించుకోవాలి. ఆయా సరకులను ఇతరులకు అమ్మడం నేరం. కార్డు దారులు ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు డీఎస్ఓ కోమలి పద్మ హెచ్చరించారు. గత నెలలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం బియ్యంతో పాటు జొన్నల పంపిణీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందుకోసం గుంటూరు జిల్లాకు 17,70,982 కిలోలు, పల్నాడుకు 18,99,399 కిలోలను కేటాయిస్తోంది. ఒక్కో కార్డుదారులు 3 కేజీల వరకు జొన్నల్ని తీసుకునే వెసులుబాటు కల్పించింది ప్రభుత్వం. అయితే.. అంతకు సమానంగా బియ్యం కోటాను తగ్గిస్తారు.

## త్రివిధ లక్ష్యాలతో సుపరిపాలన

### రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారానే నిర్ణయాలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** "దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సీఎం చంద్రబాబునాయుడు అన్ని ప్రభుత్వరంగ కీలకశాఖలకు ఆదేశాలను జారీ చేసారు. ప్రభుత్వ పనితీరు అత్యంత ప్రయోజనాత్మకంగా ఉందనే సంతృప్తి ప్రజలకు కలగచేయాలన్నారు.సీఎంవో కార్యాలయం ద్వారా ఈ సమాచారం వెల్ల నెలవారీ, త్రైమాసికాల వారీగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలి. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉంది. ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తాం. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నాం. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే అధికారులు, ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత కావాలి. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్ధవంతంగా ఆ విభాగాన్ని వినియోగించుకోవాలి. ఇటీవల వచ్చిన తుఫాన్ సమయంలో టెక్నాలజీ వినియోగించుకుని అంతా కలిసి కట్టుగా పని చేశాం. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగాం. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారింది. గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వన్ విజన్‌వన్ డైరెక్షన్ ఇదే ప్రభుత్వ విధానమని.. దీనికి అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ దిశగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. సత్వర నిర్ణయాలు ఏ విధంగా తీసుకోవచ్చు...? డేటా ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు ఏ విధంగా అందించవచ్చనే అంశాలపై సీఎం చంద్రబాబు అధికారులకు పలు సూచనలు చంద్రబాబు చేసారు. ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోంది. సిటిజెన్ డేటా అంతా క్రోడీకరించామన్నారు.

## వారం - వర్జ్యం

**29-12-2025, సోమవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, పుష్యమాసం, దక్షిణాయణం**
**హేమంత ఋతువు, శుక్లపక్షం**
నవమి ఉ.10.10, పూర్వాషాఢ కార్తె
అశ్వని ఉ.6.04
వర్జ్యం : రా.2.20-రా.3.50
దు.ము.12.33-1.18
2) మ.2.46-3.32
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రజలతో సంబంధాలు మెరుగు పరచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. కీళ్ళ బాధలు ఇబ్బంది పెడతాయి.

**వృషభం:** స్త్రీల వలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. ఫలితాలు మాత్రం వెను వెంటనే రావు.క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మిథునం:** శత్రువర్గంలోని అనైక్యతను గుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభపడతారు. ఆకస్మిక ప్రయాణాలు.

**కర్కాటకం:**ఎవ్వరినీ నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు.

**సింహం:**పని వత్తిడి అధికమవటం వలన క్షణం తీరికలేకుండా శ్రమిస్తారు. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు పాటించండి.

**కన్య :** పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

**తుల :** పై అధికారులతో మెలుకవగా వ్యవహరించండి. అకాల భోజనం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృశ్చికం:**బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. కళారంగంలోని వారికి విదేశీ పర్యటనలు.

**ధనుస్సు:** కుటుంబసభ్యులతో కలిసి దేవాలయ సందర్శనం చేసుకుంటారు. సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు.

**మకరం:** సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. వాహన సౌఖ్యం.

**కుంభం:** మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండటమే శ్రేయోదాయకం.

**మీనం :** సంఘంలో ఉన్నతమైన వారు మీకు అనుకూలంగా వ్యవహరించడం కొంత ఊరట కలిగించే అంశమవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

29-12P g3exHMNWJQEKCTPL 3 VO_29-12P g3exHMNWJQEKCTPL.qxd 28/Dec/25 10:51 PM Page 1



# రేపు ఆగమోక్తంగా తెరచుకోనున్న వైకుంఠద్వారాలు!




## తెల్లవారుజామున 5 గంటల నుండి టోకెన్ భక్తులకు దర్శనం

తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: సాక్షాత్తు వైకుంఠంలో శ్రీమహా విష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామికి ఆవిర్భవించి భక్తులకు దర్శనం ఇస్తున్నాడనేది పురాణాల కథనం. కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి(రేపు), ద్వాదశి (ఎల్లుండి) ఘడియల సందర్భంగా వైకుంఠవాకిలి ద్వారాలు మంగళవారం వేకువజామున (రేపు) 1.35-1.40 గంటలకు తెరచుకోనున్నాయి. వైఖానస ఆగమోక్తంగా విశేష పూజాదికార్యక్రమాలు, కైంకర్యాలు నిర్వహించిన అనంతరం శ్రీవారి ఆలయ అర్చకులు, అధికారులు తెల్లవారుజామున బంగారువాకిలికి సమీపంలో ఉన్న వైకుంఠద్వారాలను తెరవనున్నారు. ఆ తరువాత ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి కైంకర్యాలు ముగించిన తరువాత రేపు తెల్లవారుజామున 2గంటల నుండి తిరుమలకు చేరుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఐఏఎస్, ఐపిఎస్‌లు, టిటిడి బోర్డు సభ్యులు వారివారి కుటుంబాలతో వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం హారతి లేని లఘుదర్శనం కల్పిస్తారు. 3గంటల్లోపే ప్రముఖుల దర్శనాలు ముగించి ఉదయం 5గంటలకు ఇడిప్‌లో ఆన్‌లైన్ టోకెన్లు కలిగిన భక్తులను క్యూలైన్‌లలో వదలి లోపలకు అనుమతించనున్నారు. ఇప్పటికే తిరుమలలో ఆలయం పరిసరాలు సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం ముందు రంగనాథ మండపం సెట్టింగ్ ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నేటి సాయంత్రానికి తిరుమలకు చేరుకునే ప్రముఖులకు పద్మావతి విచారణ కార్యాలయం సమీపంలోని వెంకటకళానిలయం వద్ద న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు వసతి, దర్శన టిక్కెట్లు మంజూరు కౌంటర్లు ఏర్పాటుచేశారు. వీరికి పద్మావతి ఏరియాలోనే గదులను కేటాయిస్తారు. ఇతరరాష్ట్రాల ప్రజాప్రతినిధులకు, సిఎం కార్యాలయం లేఖలకు నారాయణగిరి విశ్రాంతి గృహాల్లో వసతి కల్పిస్తారు. ఐఏఎస్, ఐపిఎస్ లేఖలకు నందకం, వకుళమాత విశ్రాంతి గృహాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణలో డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, సత్రానాయక్, సూపరింటెండెంట్‌లకు బాధ్యతలు అప్పగించారు.

**రేపు స్వర్ణరథం:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు స్వర్ణరథం ఆలయ మాఢవీధుల్లో జరగనుంది. విశేష అలంకరణలో మలయప్పస్వామి స్వర్ణరథాన్ని అధిరోహించి మాఢవీదుల్లో భక్తులను కటాక్షించనున్నారు. ఆలయ మాఢవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

## విద్యుత్ సమస్యలపై నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



తిరుపతి, డిసెంబరు 28 ప్రభాత వార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిదిలోని తొమ్మిది జిల్లాల్లో వినియోగదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిం చేందుకు నేటి ఉదయం "డయల్ యువర్ ఎస్పి డిసిఎల్ సిఎండి" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిఆర్‌ఓ మధుసూదన తెలిపారు. తొమ్మిది జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సిఎండి శివశంకర్ లోతేటికి నేరుగా ఫోన్ ద్వారా 89777 16661నంబర్‌కు తెలియ జేయాలని తెలిపారు. విని యోగదారులు తమ విద్యుత్ సర్వీస్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని టి.మధుసూదన తెలిపారు. విద్యుత్ సమస్యలను విన్నవించాలని కోరారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మధుసూదన వివరించారు.

### టోకెన్ కలిగిన భక్తులకు అసౌకర్యం లేకుండా

# వైకుంఠ దర్శనాలు

### పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు

**తిరుమల సమాచారం**



తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో రేపటి నుండి జనవరి 8వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను భక్తులకు సౌకర్యవంతంగా కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ముఖ్యంగా తొలి మూడు రోజులు (30, 31, జనవరి 1)రేపు, ఎల్లుండి, గురువారం వరకు ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుకున్న భక్తులను మాత్రమే ఆయా రోజుల్లో స్లాట్ సమయానికి ముందు క్యూలైన్లలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు అన్ని శాఖల అదికారులు, ఉద్యోగులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో తొలి మూడురోజులు టోకెన్లు పొందిన 1.75లక్షల మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, అదనపు సౌకర్యాలు కల్పించడంలో టిటిడి విజిలెన్స్, టిటిడి ఉద్యోగులు, పోలీసులతో సమన్వయం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది భక్తులకు అదనంగా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించేలా స్థలాలను సిద్ధంచేయడం జరిగిందన్నారు. ఈ మూడురోజులు టోకెన్ కలిగిన భక్తులను క్యూలైన్లలోనికి నిర్ధేశిత సమయం ప్రకారం ఆయా రోజుల్లోనే అనుమతించేలా ఆదేశాలిచ్చామన్నారు. జనవరి 2నుండి 8వరకు ముక్తిద్వారం కోసం తరలివచ్చే భక్తులకు సురక్షిత దర్శనం, ప్రశాంత వాతావరణం కల్పించడంలో పోలీసులు, విజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తారని అదనపు ఇఒ చౌదరి పేర్కొన్నారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. టోకెన్లతో మూడురోజులు దర్శనం కోసం వచ్చిన భక్తులకు సాఫీగా క్యూలైన్ల నిర్వహణ, రద్దీ ప్రాంతాల్లో భక్తుల భద్రతకు అదనపు సిబ్బంది నియామకం, భక్తుల రద్దీ చేరినా తగినట్లు సామరస్యంగా వ్యవహరించి నియంత్రించడం జరుగుతుందన్నారు. టోకెన్ లేని భక్తులను తిరుమలపైకి అనుమతించినా ఆలయం ముందు వరకే, అఖిలాండం వరకే పరిమితం చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టామన్నారు. ఈ పదిరోజులు ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది అంకితభావంతో నిబ్ధదతో సేవలందిస్తారని ఆయన తెలిపారు. ఆలయంలో భక్తులకు మహాలఘు దర్శనంలో వైకుంఠవాకిలి దర్శనం చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.



ఆన్‌లైన్‌లో సామాన్యభక్తులకు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం 1.20లక్షలు టిక్కెట్లు, శ్రీవాణి విఐపి బ్రేక్ దర్శనాలను వారంరోజులకు ఏడువేల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేయడం జరిగిందన్నారు.

వైకుంఠద్వారం తెరచి ఉంచే పదిరోజులు సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదని టిటిడి ప్రకటించింది. తదనుగుణంగా సామాన్యభక్తులకు దర్శనాలు చేయించేలా చూస్తారు.

### జనవరి 3న మొగలిచెర్ల

## దత్తమందిరంలో సుదర్శనహోమం

తిరుపతి, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: వేదశాస్త్రాల ప్రకారం పుష్యమాసంలో నిర్వహించే సుదర్శనహోమం ద్వారా శ్రీమహావిష్ణువు సుదర్శనచక్ర శక్తి సక్రియమై, గ్రహదోషాలు, శత్రుబాధలు నివృత్తి అవుతాయని వేదపండితుల వాక్కు. జనవరి 3వ తేదీ పుష్యమాస పౌర్ణమి ఘడియల్లో నెల్లూరు జిల్లా లింగసముద్రం మొగలిచెర్ల గ్రామంలోని దత్తాత్రేయ మందిరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కన్వీనర్ పవని విష్ణుకౌశిక్ తెలిపారు. ఈ హోమంలో ప్రత్యక్షంగా పాల్గొనే భక్తులు 3వ తేదీ ఉదయం 8గంటలకు మందిరం వద్దకు చేరుకోవాలని కోరారు. పరోక్షంగా పాల్గొనే భక్తులు గోత్రనామాలతో 99089 73699, 91828 82632 నంబర్లకు సంప్రదించాలని కోరారు.





### శ్రీవారి మెట్లమార్గంలో

## ప్రాథమిక చికిత్స కేంద్రం

తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి గోవింద నామస్మరణతో భక్తితో తిరుమలకు నడచుకుని వచ్చే యాత్రికుల సౌకర్యార్థం అలిపిరి నడకమార్గంలో ఏడోమైలు వద్ద ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని టిటిడి ఏర్పాటుచేసింది. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ కేంద్రాన్ని ఆదివారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రారంభించారు. నడకదారి భక్తుల సౌకర్యార్థం ఇక్కడ ప్రాథమిక చికిత్సా కేంద్రం నెలకొల్పడంతో అత్యవసర పరిస్థితుల్లో భక్తులు ఈ కేంద్రం వద్ద వైద్యసేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఇప్పటికే శ్రీవారి మెట్టు మార్గంలో కూడా ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ తిరుమలలో వైద్యసౌకర్యాలను విస్తృతం చేయడంలో భాగంగా అలిపిరి నడకమార్గంలో ఆధునిక సౌకర్యాలతో ప్రాథమిక చికిత్సా కేంద్రం భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో 30వేల వరకు భక్తులు నడుచుకుంటూ వస్తారని తెలిపారు. వారికి ఏదేని అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కేంద్రంలో వైద్యసహాయం పొందవచ్చని చౌదరి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, టిటిడి సిఎంఒ డాక్టర్ బి.కుసుమకుమారి, మెడికల్ అధికారిణి డాక్టర్ ఎస్.కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

### పిపిపి పేరిట ప్రైవేటు వ్యక్తులకు

## ప్రభుత్వ ఆస్తులు

### సిఎంకు సిపిఐ రామకృష్ణ బహిరంగ లేఖ

విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి: మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని విరమించుకోవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. పీపీపీ పేరుతో ఏపీలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే యోచనను విరమించుకోవాలని సూచించారు. మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ముఖ్యమంత్రి అత్యుత్సాహం చూపిస్తూ, మొండిగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఏపీలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు అందరూ ముక్తకంఠంతో రాష్ట్ర ప్రభుత్వ పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించడంతోపాటు, రెండేళ్ల పాటు సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవటం తగదని అన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునేందుకు మాత్రమే ప్రైవేటుకు అవకాశం కల్పించడం విచారకరమని తెలిపారు.

## తిరుపతి జిల్లా గంజాయి, డ్రగ్స్ రహితమే లక్ష్యం



# భద్రతకే తొలి ప్రాధాన్యత

### - వార్షిక నివేదికలో తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: యాత్రాస్థలం, ప్రసిద్ధపుణ్యక్షేత్రంకు నిలయమైన తిరుపతి జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడమే ముందున్న లక్ష్యమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఉద్ఘాటించారు. జిల్లా ప్రజలకు, నిత్యం ప్రపంచంనలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తులకు భద్రత కల్పించడం తొలి ప్రాధాన్యత అన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు పలు రకాలుగా నేరాలకు పాల్పడిన పలువురు నేరస్తులపై పిడియాక్టు నమోదు చేశామన్నారు. మొత్తం 16మందిపై నమోదు చేసి కేంద్ర కర్మాగారానికి తరలించామన్నారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా నూతన పోలీస్ కార్యాలయంలో 2025 వార్షిక నివేదిక వెల్లడించారు. తిరుపతి జిల్లా అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, నాగభూషణం, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ, సిఐ విక్రమ్‌తో కలసి వివరాలు తెలిపారు. పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి జిల్లాను ప్రశాంత వాతారణంలో చూడటమే ముఖ్యమన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో డిజిపి హరీశ్‌కుమార్ గుప్త సూచనలతో తిరుపతి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడంతో పాటు తిరుమలకు వచ్చే ప్రముఖులకు భద్రతలో రాజీపడకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అధునాతక సాంకేతికతను వినియోగించుకుని పలు రకాల నేరాలను నియంత్రించడం చేస్తున్నామన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 2024లో జిల్లాలో 9,118 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 9,253 కేసులు నమోదయ్యాయన్నారు. 0.71శాతం కేసులు స్వల్పంగా పెరిగాయి. 2025లో సైబర్ కేసుల్లో 14,45,13,864 రూపాయలు నగదును సైబర్ నేరస్తులు దోచుకోగా 3,53,01,114 రూపాయలు తిరిగి స్వాధీనం చేసుకోవడం, బాధితులకు నేరుగా రీఫండ్ చేయించారు. 2,485 మొబైల్‌ఫోన్లను రికవరీ చేశారు. పటిష్టమైన కోర్టు మానిటరింగ్ వ్యవస్థతో నేరాల పై విచారణలను ప్రత్యక్షంగా పర్యవేక్షించి ముద్దాయిలకు శిక్షపడేలా చూశారు. జిల్లాలో 10వరకు ఫోక్సో కేసులు నమోదయ్యాయి. 9 హత్య కేసులు, హత్యాయత్నం 3కేసులు నమోదుచేశారు. గంజాయి నిర్మూలనకు, మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 258 మందిపై వివిధ రకాల షీట్లు తెరిచారు. సాంకేతికతను వినియోగించి సంచలన కేసులను శోధించామని ఎస్పీ వివరించారు.



హోంమంత్రి అనితను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

## నేర నియంత్రణలో మరింత పట్టుదలతో వ్యవహరించాలి

### - పోలీసులకు హోంమంత్రి అనిత ఆదేశం

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: నేర నియంత్రణలో పోలీసు మరింత పట్టుదలతో వ్యవహరించాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గత 18 నెలల కూటమి పాలన క్రైమ్ నేరాలను అదుపుచేసిన పోలీసుకు ఆమె అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో సైబర్ నేరస్తులను గుర్తించి. అరెస్ట్ చేస్తున్న క్రైమ్ విభాగాన్ని ప్రశంసించారు. తాడేపల్లిలో రాష్ట్ర స్థాయి క్రైమ్ రివ్యూ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తుత ఏడాదిలో నమోదైన నేరాలు, వాటిపై విధించిన శిక్షలు, కేసుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణ, కేసుల త్వరిత పరిష్కారం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సైబర్ క్రైమ్, క్రిప్టో కరెన్సీ దుర్వినియోగం, బ్లాక్ చైన్ టెక్నాలజీ, డీప్ ఫేక్ టెక్నాలజీ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన నివారణ చర్యలపై మంత్రి అనిత అధికారులతో చర్చించారు. సమావేశంలో భాగంగా నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మంది అధికారులను సన్మానించారు. వారి సేవలను ప్రశంసిస్తూ, ఇతరులకు ప్రేరణగా నిలవాలని సూచించారు. నూతన సంవత్సరంలో కేసుల పరిష్కారానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి అనిత ఆదేశించారు. మంత్రి అనితను పోలీసు అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, నిపుణులైన ప్రొఫెసర్లు పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు. సిఐడి డిజి డాక్టర్ రవిశంకర్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు, సిఐడి ఎస్పీలు పాల్గొన్నారు.

## సుంకిలో ఏనుగులు విధ్వంసం

గరుగుబిల్లి (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబరు 28, ప్రభాతవార్త: పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండల పరిధిలోని సుంకి గ్రామపంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం సంబంధిం చిన పోల్స్ను శుక్రవారం ఏనుగులు ధ్వంసం చేశాయి. సుంకి గ్రామ పరిసరాల్లోకి ప్రవేశించిన ఏనుగులు గుంపు గ్రామ సమీపంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం చుట్టూ ఏర్పాటుచేసిన స్తంభాలను ధ్వంసం చేశాయని పంచాయతీ సర్పంచ్ కరణం రవీంద్ర తెలిపారు.

కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో సంచరిస్తున్న గజరాజులు సుంకి గ్రామ పరిసరాల్లోకి ప్రవేశించాయి. దీంతో సుంకి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుంకి గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరి స్తుండటంతో పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతం నుంచి ఏనుగులు గుంపును తరలించేం దుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## పిపిపిపై తీవ్ర ప్రజా వ్యతిరేకత

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పీపీపీ విధానంలో చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై తొలి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా అధికార పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మరింత పెరిగింది. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలకు ప్రభుత్వం నిర్వహించిన టెండర్లకు మిశ్రమ స్పందన రావడానికి వైసీపీ నేతలే కారణమని అధికార పార్టీ నాయకులు విమర్శిస్తుంటే వారికి వైసీపీ శ్రేణులు అదే స్థాయిలో స్ట్రాంగ్ కౌంటర్లు ఇస్తున్నారు. అంతేకాదు మెడికల్ కాలేజీలను ప్రవేటీకరణ చేయొద్దని, ప్రభుత్వమే నిర్మించి పేదలకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. తాజాగా సైతం విరుచుకుపడ్డారు. వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేయాలని సర్కార్ చూస్తోందని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ వ్యక్తులు వాయపారం మాత్రమే చేస్తారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను చంద్రబాబుకు పట్టడం లేదని విమర్శించారు. 'పీపీపీ, పీ4తో ఎవరు బాగుపడ్డారో వారికే తెలియాలి.90 పైసలకే 50 కోట్ల విలువైన భూములు కట్టబెడుతున్నారు. గూగుల్, టిసిఎస్ ఇంత చౌకగా ఎక్కడైనా భూములు తీసుకుందా? పెద్దోళ్ళ పేరుతో భూములు దోచుకుంటున్నారు. రాజధాని రైతులను సిఆర్డీఏ పట్టించుకోవడం లేదు' అని పేర్ని నాని ఆరోపించారు.

### ధార్మిక కేంద్రాలను రాజకీయాలకు

# వాడుకోవద్దు

### రాష్ట్ర ప్రభుత్వంపై వైసిపి నేతల మండిపాటు

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వ పాలనలో ధార్మిక సంస్థలపై దాడులు జరుగుతున్నాయని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. హిందువుల మనోభావాలతో ప్రస్తుత ప్రభుత్వం ఆటలాడుతోందని విమరి ్శంచారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం, పరకామణిలో చోరీ కేసులతో టీటీడీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం జరుగు తోందన్నారు. కేవలం వైసిపిపై బురదజల్లేందుకు ప్రభుత్వంలోని కొందరు పనిగట్టు కుని దేవాలయాలను మాధ్యమాలుగా వాడుకోవడాన్ని తప్పుబట్టారు. ధార్మిక కేంద్రాలను రాజకీయాలకు ఆయుధాలుగా వాడుకోవద్దన్నారు. ప్రఖ్యాతి గాంచిన విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేవాలయానికి ఆదాయం వస్తున్నా ఇటువంటి పరిస్థితి నెలకొనడం పట్ల విస్మయానికి గురయ్యారు. హిందువులకు అన్యాయం చేస్తున్నవారు హిందూ ధర్మ పరిరక్షణ విషయంపై వైసీపీ విమర్శించే అర్హత కల్గిఉండరని స్పష్టం చేశారు. పేదల ఇళ్ళపై సిఎం చంద్రబాబు నాయుడు దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ కీకల నేత మాజీ మంత్రి కాకాని గోవర్దన్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ హయాంలో కట్టిన ఇళ్ళను కూటమి ప్రభుత్వ హయాంలో నిర్మించామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందన్నారు. అమరావతిలో ప్యాలెస్ కట్టుకునే ఆలోచన తప్ప పేదల ఇళ్ళపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇళ్ళ నిర్మాణంలో అవినీతి జరిగిందనే అనుమానాలున్నాయని, వాటిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైసీపీ కార్యకర్తలు రప్పా రప్పా అంటే జైలుకు పంపిస్తున్నారని టిడిపి శ్రేణులు చేసిన దాడులపై చర్యలెందుకు లేవని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జైళ్ళు, కేసులకు వైసిపి శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.



## సోషల్ మీడియాలో ప్రకాష్‌రాజ్ వర్సెస్ విష్ణువర్దన్‌రెడ్డి

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: సామాజిక మాధ్యమం వేదికగా సినీ నటుడు ప్రకాష్‌రాజ్, బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి నడుమ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి ఈ మధ్యన ఓ మీడియా సమావేశంలో ప్రకాష్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం మావోయిస్టులను హతమార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం పాపం చేశారని అలా చంపేస్తున్నారని ప్రశ్నించారు. వాళ్లు కూడ ప్రజలే కదా... జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని అడగాలి కానీ చంపడం ఏంటి అని ప్రశ్నించారు. కాగా ఆ వీడియోను విష్ణువర్దన్‌రెడ్డి షేర్ చేస్తూ ప్రకాష్ రాజ్‌కు కౌంటర్ ఇచ్చారు. మావోయిస్టులు ఎంతో మంది అమాయకులను చంపారు. అందులో ఎక్కువ మంది గిరిజనులు కూడా ఉన్నారని పోలీసులు, రాజకీయ నేతలు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఏ కారణంతో చంపినా అసలు చంపే హక్కు ఉందని ఎప్పుడైనా మీరు ప్రశ్నించారా? అని అడిగారు. నేడు జనజీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టు నేతలే అడవిలో ఉన్న తోటివారి తుపాకులు హింసను ఆపమంటున్నారని పేర్కొన్నారు. ఇక తాజాగా విష్ణువర్దన్‌రెడ్డి ట్వీట్‌పై ప్రకాష్‌రాజ్ స్పందించారు. వెంటనే రియాక్ట్ అయ్యారు కాలిందా? జస్ట్ ఆస్కింగ్ అంటూ ట్వీట్ చేశారు. దీంతో విష్ణువర్దన్‌రాజు ఎలాంటి రిప్లై ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

లోకంలో నిన్ను గురించి భూషిస్తున్నారా? దూషిస్తున్నారా? అనేది ముఖ్యం కాదు. చర్చిస్తున్నారా? లేదా అనేది ముఖ్యం.

-చర్చిల్

# ఆరావళీ! ఇదేమి కేళి!


రేపోమాపో మాయమవుతాయనుకున్న ఆరావళీ పర్వత పంక్తులకు ఇప్పుడు బోలెడంత రక్షణ దొరుకుతోంది. గుట్టలు తవ్వడమంటే మామూలే. పర్వతాలను కూడా తవ్వేసుకునే తిమింగళాలున్నాయంటే కాస్త సరిపెట్టుకోవచ్చు. అవి చదునైతే జీవ జాతులు బతుకుతాయనీ సర్దేసుకోవచ్చు. గుట్టలు మింగే బకాసురుల వలన ప్రభుత్వ ఖజానాకు ఎంతో నష్టం వాటిల్లుతుంది. వాటిని ఏలిన వారు చూసుకుంటారులే అని సరిపెట్టుకునేలా విషయం లేదు. ఇప్పుడా ఏలిన వారి నుంచే చరిత్ర ప్రసిద్ధి కలిగిన ఆరావళీ పర్వతాలకు ముప్పు ఏర్పడింది. గగ్గోలు పెట్టాక కేంద్రమే కాస్త తగ్గి ఇకపై ఆరావళీ పర్వతాలు తవ్వుకునేందుకు అనుమతించబోమని గద్గద స్వరంతో ప్రజలకు ఓవిజ్ఞప్తిని జారీచేశారు. గతంలోనే వాటిని యథేచ్ఛగా కాకపోయినా కొంత ప్రాంతాన్ని మైనింగ్‌కిచ్చేసింది. ఇది మునుపటి మాట. చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఆరావళీ పర్వతాలు ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు దాదాపు 700 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. వాటికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తొలుత కొత్త నిర్వచనాన్ని చెప్పగా విపక్షాలు వ్యతిరేకించాయి. కేవలంవంద మీటర్ల ఎత్తు ఉన్నవి మాత్రమే ఆరావళీ పర్వతపంక్తుల లోకి వస్తాయని కేంద్రం ప్రకటించింది. దేశవ్యాప్తంగా కేంద్రం ఇచ్చిన ఈ నిర్వచనాన్ని జనం ఎండగట్టారు. నిజానికి అక్కడ విచ్చలవిడిగా జరుగుతున్న మైనింగ్, రియాల్టీ కార్యకలాపాల కారణంగా ఆ పర్వతాల ఉనికికే భంగం వాటిల్లింది. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ఆ ప్రాచీన పర్వతాల శ్రేణులను విశ్లేషించి నిర్వచించిందో కానీ దాదాపు ఆ పర్వతశ్రేణులు ఎప్పటికైనా కనుమరుగవుతాయని, వాటివల్ల పర్యావరణం బాగా దెబ్బ తింటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. మైనింగ్ అక్రమాలను అడ్డుకోవాల్సిన కేంద్రప్రభుత్వం తన బాధ్యతను మరచిపోయిందో ఏమోకానీ ఆరావళీ పర్వతాల భౌగోళిక స్వరూపాన్నే మార్చచూసింది. దాంతో పర్యావరణవేత్తలు, కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ ఆఖరికి కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ కూడా ప్రభుత్వం అలా చేయకుండా ఉండాల్సిందంటూ నిరసన వ్యక్తంచేశారు. ఆరావళీ నిలువునా అడవులు, నీటివనరులు ప్రఖ్యాతి చెందిన రాజస్థాన్‌ల శిధిలాలు, చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలున్నాయి. అంతే ప్రాధాన్యత ఉన్న అరుదైన ఖనిజాలు కూడా ఈ పర్వతాల మాటున దాగి ఉన్నాయి. రాగి, జింక్, జిప్సమ్, క్వార్ట్జ్, పాలరాయి, రాక్‌సల్ఫేట్ వంటి వన్నీ ఇందులో దాగిఉన్నాయి. దీన్ని హస్తగతం చేసుకోవాలని ఎదురు చూస్తున్న మైనింగ్ మాఫియాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం కదిలిరాలేదు. పైగా ఆరావళీ పర్వతాలను పరిధిని కుదిస్తూ కేంద్ర పర్యావరణ శాఖ సుప్రీంకోర్టుకు ఓ నివేదిక సమర్పించింది. దాని ప్రకారం 100 మీటర్లకంటే లోపు ఎత్తు ఉన్న పర్వతాలను ఆరావళీ పరిధి నుంచి మినహాయింపు కోరింది. ఈ లేఖ సారాంశంపైసుప్రీంకోర్టు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ ఈ ప్రతిపాదన ఆమోదించ లేదు. ఇదే నిర్ణయాన్ని నివేదిక రూపంలో సుప్రీంకోర్టుకు దాఖలుపరచగా దాదాపు ఆమోదించింది. అయితే సైంటిఫిక్ మ్యాపింగ్ పూర్తయ్యేదాక ఎటువంటి కొత్త లీజులు ఇవ్వరాదని షరతుపెట్టింది. ఫారెస్టుసర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం ఆరావళిలోని మొత్తం 12,081 పర్వతాల్లో 1,048 పర్వతాలు మాత్రమే 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులోఉన్నాయి. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను బట్టి ఆరావళీ పర్వతశ్రేణుల్లో 90 శాతం మైనింగ్‌కు అనుకూల పరిధిలోకి మారతాయి. దాంతో ఆ పర్వతాలు పిండవుతాయి. బోలెడంత ఖనిజ సంపద దళారుల పాలవుతుంది. ఈవిధమైన అంచనాలతో పర్వతాలలో పది శాతం మాత్రమే పర్వతాలుగా పనికివస్తాయి. గతంలో 1975-2019 వరకు జరిగిన అక్రమ మైనింగ్ వలన ఇప్పటికే 8శాతం మేరకు ఆరావళీ మైనింగ్ తరలి వెళ్లిపోయింది. దాదాపు కనుమరుగైనట్లే. తాజాగా కేంద్రం ఇచ్చిన ప్రతిపాదనలలో ఆరావళీ మరింత కుదించుకుపోతాయి. అంతేకాదు ఈ పర్వతశ్రేణుల వైశాల్యం తగ్గిపోయే కొద్దీ ఢిల్లీ, తదితర మహానగరాలకు నష్టం కలుగుతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక తుఫానులు ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల వైపు పయనించకుండా ఆరావళీ పర్వతాలే రక్షణ గోడలుగా కాపాడుతున్నాయి. అందుకే ఢిల్లీ (ఎన్‌సిఆర్) వంటి జనాభా ఎక్కువగా ఉన్న నగరాలకు ఇసుక రేణువులు తోడైతే అక్కడ ఆప్రాంతంలో బతికే పరిస్థితి మృగ్యమవుతోంది. ఈ పర్వతాలను స్వచ్ఛమైన గాలిని అందించే ఊపిరితిత్తులుగా 'గ్రీన్ లంగ్స్'గా పిలవడం కద్దు. ఈ పర్వతాలపై ఉండే దట్టమైన అడవులు రాళ్లు, భూగర్భ జలాల పెంపుతోపాటు వరదలను ఆపగలుగుతున్నాయి. ఈ కారణం గురుగ్రామ్, ఫరీదాబాద్, దక్షిణ ఢిల్లీ, అల్వార్ జైపూర్‌లకు ఇంతదాకా వరద తాకిడి లేదు. ఆరావళీ అనగానే అరుదైన వృక్ష జంతు జాతులకునెలవు. కాగాకేంద్రం ఇటీవల తీసుకున్న నిర్ణయం పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తుందన్న భయాందోళనలు తలెత్తాయి. భౌగోళిక పరిస్థితులు, వాటికి ప్రయోజనాలు కలిగించే అంశాలపై అధ్యయనం చేయకుండానే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, దానిని దేశ అత్యున్నత ధర్మాసనం కాకతాళీ యంగా ఆమోదించడమూ జరిగిపోయాయి. ఆందోళనలను ఎదుర్కొనే క్రమంలో మళ్లీ ఇప్పుడు కేంద్రం నాలిక్కరుచుకుని కొత్త మైనింగ్ అనుమతులేవీ ఇవ్వరాదని నిర్ణయించింది. స్థానిక నైసర్గిక స్వరూపం, జీవవైవిధ్యత, పర్యావరణ సున్నిత త్వాన్ని దృష్టిలో ఉంచుకుని తమ తాజా ఆదేశాలను ఆరావళీలోని మరికొన్నిగుట్టలు మైనింగ్ నుంచి రక్షణ పొందడం ఆహ్వానించదగిన నిర్ణయమే!

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### వార్తా పత్రికలను చదవాలి

**చరవాణి** చేతులలోకి విస్తృతంగా వచ్చి చేరిన తరువాత చాలామంది పిల్లలు, పెద్దలు వాటిఉచ్చులో పడి పుస్తకాలను, వార్తా పత్రికలను చదవడం తగ్గించారని అనాలో లేక మానేశారని అనాలో. ఇప్పటి విద్యార్థులు ముఖ్యంగా టెక్నికల్ కోర్సులు చదివేవారికి దేశ కాల, మాన పరిస్థితులు తెలుసుకోవాలనే జిజ్ఞాస కూడాలేదు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంఅన్ని గవర్నమెంట్ స్కూళ్లలో ప్రతిరోజూ విద్యార్థులచే వార్తా పత్రికలలో వచ్చిన ముఖ్యమైనవి చదివి తీరాలనే నిర్ణయం కొన్ని రోజుల క్రితం తీసుకున్నది. మన తెలుగు రాష్ట్రాలలో కూడా ఈ నిర్ణయాన్ని అమలు పరచాలి. ఇంజినీరింగ్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో వారి సబ్జెట్ మీద పూర్తి అవగాహన ఉన్నా జనరల్ నాలెడ్జ్ దాదాపు సున్నా. చరవాణిలో చదవడం కంటి, ఒంటి ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సర్దుబాటు ముఖ్యం

**బంగ్లా** సంక్షోభం తారా స్థాయికి చేరింది. దానికి ప్రధాన కారణం యూనిస్‌అంటే అతిశయోక్తికాదేమో. శాంతి దూత కష్ట కాలంలో దేశాన్ని నడపడంలో విఫలం అయ్యారు. చైనా, పాకిస్థాన్ చెంతన చేరి బలమైన మూలాలు కలిగిన భారత్‌తో బంధాలు ఇరుకున పెట్టుకున్నారు. 4096 కిలో మీటర్ల సరిహద్దుకలిగిన మనదేశంతో చారిత్రక జాతీయ వాదాస్నేహం కలిగిఉన్న ఆ దేశంపాకిస్థాన్ నుండి విముక్తి పొందడంలో భారత్ చేసిన సహాయాన్ని కూడా మరిచి నట్టు ఉంది. అస్సాం, బెంగాల్ లాంటి రాష్ట్రాలలో మళ్ళీ వలసలు పెరిగే అవకాశం ఉంది. భారత్ కూడా బంగ్లాలో ఎవరు అధికారంలో ఉన్నవాళ్లతో సర్దుబాటు చేసుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

### వికలాంగులకు న్యాయం చేయాలి

**వికలాంగులు** కష్టపడి సంపాదించిన డబ్బులు పొదుపు చేసుకుంటే అవసరానికి అప్పుతీసుకొన్నవారు, సకలాంగులు తిరిగిఇవ్వాడంలో చాలా ఇబ్బందులు పెడుతున్నారు. వికలాంగుల నుండి అప్పులు తీసుకొన్నవారు కూడా అడిగితేదాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు. వికలాంగులు చాలా కష్టపడి సంపాదించిన డబ్బులు అప్పుగా తీసుకున్నవారు తిరిగి ఇవ్వడంలో వివక్షత చూపుతున్నారు.

-రాపాక రవీందర్, జనగాం

### రైల్వేలు ప్రజాసేవా వ్యవస్థలు

**భారతీయ** రైల్వేలు ఒకప్పుడు సామాన్యుడి జీవనరేఖగా వెలుగొందాయి. కానీ ప్రస్తుత పరిణామాలు ఆ ప్రజాస్వామ్య స్వరూపాన్ని మసకబారుస్తున్నాయి. గత జూలైనుంచి రాబోయే మార్చి వరకు విడతల వారీగా పెంచిన చార్జీల వల్ల ప్రయాణికులపై దాదాపు రూ.1,300కోట్ల అదనపు భారం పడనుంది. ప్రభుత్వానికి ఇది ఆదాయ వనరుగా కనిపించినా, సామాన్యుడి జేబుకు ఇది పెద్ద చిల్లు. ఆధునికీకరణ పేరుతో సాధారణ రైళ్లను తగ్గించి, ఖరీదైన వేగవంతమైన రైళ్లను పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయాణం భారంగా మారుతోంది. చార్జీలు పెరుగుతున్నా రైళ్ల జాప్యం, శుభ్రతలోపం, రద్దీ వంటి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. దీనికి తోడు రైల్వే సేవల్లో ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం వల్ల నిర్వహణ వ్యయం పెరిగి, ఆభారం చివరకు ప్రయాణికులపైనే పడుతోంది. రైల్వేలు కేవలం లాభనష్టాల కోసం నడిచే వాణిజ్య సంస్థలు కావు, అవి ప్రజాసేవా వ్యవస్థలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పరిశ్రమ విద్యాసంస్థల అనుసంధానం

**ప్రస్తుతం** ఉన్న డిగ్రీ, పీజీ సిలబస్‌లో కాలానికి అనుగుణమైన మార్పులు అత్యవసరమయ్యాయి. ఉద్యోగమార్కెట్ పెద్దఎత్తున మారిపోయింది. పరిశ్రమలు నైపుణ్యాలు, ప్రాక్టికల్ పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని కోరుతున్నాయి. కానీ మన సిలబస్‌లో ఇంకా పాతసిద్ధాంతాలు, కాలంచెల్లిన మాడ్యూల్స్, ప్రయోగాత్మక శిక్షణకు తక్కువ అవకాశాలు ఉన్నాయి. విద్యార్థి పుస్తక జ్ఞానంతో బయటకు వస్తున్నాడు. కానీపరిశ్రమ అవసరాలకు సిద్ధంగా ఉండటంలేదు. ఫలితంగా చదువుకున్న నిరుద్యోగం పెరుగుతోంది. ప్రభుత్వంముందుగా పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధాన విధానాన్ని బలోపేతం చేయాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### సీట్ల కొరత

భారత దేశంలో డిమాండ్ ఉన్న కోర్సులు చదువుకునేందుకు సీట్ల కొరత అలాగే చదివిన చదువులకు ఉద్యోగాల కొరత ఉంది. ఎంబీబీఎస్ , ఇంజనీరింగ్ , ఎంబీఏ, తదితర ఉన్నత చదువులు విదేశాల్లో చదవలసిన పరిస్థితి ఉంది. డిమాండ్ ఉన్న కోర్సుల సీట్‌లను భారత్‌లో పెంచితే విదేశాలకు వెళ్లే అవకాశం ఉండదు. చదివిన చదువులకు తగ్గట్టుగా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బంగ్లా వైఖరి బయటపడేది ఎన్నికల తర్వాతే!

*ప్రస్తుతం తారిఖ్ రెహ్మాన్ ఎన్నికలలో గెలవటానికి తగ్గట్టుగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తున్నది. భారత్ పట్ల ఇంతవరకూ వ్యతిరేకంగా మాట్లాడలేదు కానీ షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన నేపథ్యంలో పూర్తిగా భారత్‌తో స్నేహాన్ని అభిలషిస్తాడని చెప్పడం కష్టమే. 1971లో బంగ్లాదేశ్ విముక్తికి షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు కానీ, ఇందిరా గాంధీకి కాని 'క్రెడిట్' ఇవ్వకుండా 'జియా'కు ఇవ్వడం రాజకీయం చేసే నాయకుడు మాట్లాడే విధంగానే ఉంది. అందుచేతనే భారత్ పట్ల రహమాన్ ధోరణిలో స్పష్టత లేదు. నిప్పుల కొలిమిలా ఉన్న బంగ్లా ఎన్నికల తర్వాతనే భారత్ పట్ల స్పష్టమైన వైఖరితో బయటపడగలదు. అంతవరకూ బంగ్లాదేశ్ మనకు ప్రశ్నార్థకమే!*



రావులపాటి సీతారాం రావు

పొరుగు దేశం బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాదిరే భారత్‌కు మరో తలనొప్పిగా మారే సూచనలు ప్రగాఢంగా కనిపిస్తున్నాయి. ఇప్పటి నుంచే భారత దేశ దౌత్య నిపుణులూ విదేశాంగ శాఖ నిర్వహణలో ఆరితేరిన వారు తగు జాగ్రత్త చర్యలు తీసుకొని సముచిత రీతిలో రెండు దేశాల సంబంధాలను గాడిన పడేయకపోతే అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఆటంకాలు ఏర్పడతాయి. బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీ (బి.యస్‌పి) ఛైర్మెన్ ఒకప్పటి ప్రధాన మంత్రి ఖలీదా జియా, కుమారుడు తారిక్ రెహ్మాన్ (18 సంవత్సరాలు లండన్‌లో అజ్ఞాత వాసంలో ఉన్న నాయకుడు) స్వదేశానికి ఈ నెల వచ్చిన సందర్భంగా తాత్కాలిక నాయకుడుగా వ్యవహరిస్తున్న మహమ్మద్ యూనస్ అట్టహాసంగా స్వాగత ఏర్పాట్లు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఢాకాలో అతని రాకను ప్రతిపక్షాలు హిందూ నాయకులతో సహా తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఉపద్రవాలూ, అలజడులూ జరగబోతాయో అని ఆ దేశ ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడుపుతున్న యూనస్‌కు చట్టపరంగా బంగ్లాదేశ్‌కు సారథ్యం వహించటానికి ఎలాంటి హక్కూ లేదు. కొన్ని రోజుల క్రితం షరీఫ్ ఉస్మాన్‌హదీ అనే యువ నాయకుడును చంపేసిన సందర్భంగా మరోసారి దేశంలో అలజడులు చెలరేగాయి. హాదీ ప్రధాన మంత్రి షేక్ హసీనా ప్రభుత్వానికి (ప్రస్తుతం పదవీచ్యుతురాలై భారత్‌లో తలదాచుకుంటున్నది) వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన వాడు! ప్రస్తుతం మరింత మార్పును రాజకీయ పార్టీలకు (జమల్ ఇస్లామీ పార్టీ లాంటి వాటికి) వెసులుబాటు కల్పించే విధంగా ఉండాలని లిబరేషన్ మూమెంట్ తర్వాత ఆలోచించిన నాయకుడు దారుణంగా డిసెంబరు 12 నాడు ఒక గన్‌మన్ కాల్పులకు గురై చంపబడ్డాడు. ఈ సందర్భంగా మీడియా సంస్థలపై అల్లరిమూకలు దాడులు కూడా చేశాయి. అవామీ లీగ్ ఆఫీసులు, కల్చరల్‌సెంటర్స్, మాజీ మంత్రుల గృహాలు ఇలా చాలా ఆస్తులపై దాడులు జరిగాయి. బంగ్లాదేశ్‌కు స్వాతంత్య్రం తెచ్చిన ముజిబూర్ రెహ్మాన్ ఇంటిని కాల్చి వేశారు. అంతేకాదు ఒకహిందువును (25 సంవత్సరాల యువకుడ్ని) కూడా కిరాతకంగా చంపటాన్ని, దహనం చేయటాన్ని దారుణానికి పాల్పడ్డవారు ఫిల్మ్ తీశారు. షేక్ హసీనా నిష్క్రమణ జరిగి 15 నెలలు అవుతున్నది. అయినా బంగ్లాదేశ్‌లో అల్లరిమూకల దాడులు నిరాఘాటంగా సాగుతూనే ఉన్నాయి. ఒక విధంగా హసీనా నిష్క్రమణ, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నిర్మించుకోటానికి అవకాశాన్ని కల్పించినా అక్కడి అల్లరి మూకలు సాగన్వికుండా అలజడుల్లో మునిగితేలుతూనే ఉన్నారు. అవామీలీగ్ కార్యకర్తల మీద, హిందువుల మీద, మైనార్టీ వారి మీద ఇంకా అప్రతిహతంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. అవామీ లీగ్ మీద, స్టూడెంట్ ఆర్గనైజేషన్స్ మీద నిషేధం విధించి జమ్మత్- ఇ- ఇస్లామ్ మీద నిషేధం ఎత్తివేయడం గమనార్హం. బియన్‌పి లీడర్ రావడంతో రాజకీయాలు బంగ్లాదేశ్‌లో ఎలాంటి మార్పు తీసుకురాబోతాయో ఊహించటం కష్టం. ఎన్నికలు నిర్వహిస్తే కొంతలో కొంత ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన ప్రభుత్వం సాధారణ పరిస్థితులు ఈ దేశంలో నెలకొల్పే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంలోని ఆర్థిక సలహాదారు సలీహుద్దీన్ అహ్మద్ మాత్రం భారత్‌తో సత్సంబంధాలు ఏర్పరుచుకొనే దిశగా ఆలోచిస్తున్నామని ఢాకాలో ఈ తరుణంలో ప్రకటించడం ఆలోచించదగ్గ విషయంగానే మారింది. మహమ్మద్ యూనస్ ఆ దిశగా ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధు



లు యూనస్, భారత ప్రభుత్వ ప్రతినిధులతో ప్రత్యక్షంగా మాట్లాడారా అని అడిగితే లేదనిచెబుతూ, ఇతర స్టేక్‌హోల్డర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. ఎంతవరకు నమ్మాలో కానీ భారత్‌తో స్నేహసంబంధాలు పునరుద్ధరించుకోవాలనే ప్రయత్నాలు చేయాలని అనుకోవటం కూడా ఆహ్వానించదగ్గ పరిణామమే. పొరుగుదేశమైన బంగ్లాదేశ్ అనిశ్చిత పరిస్థితులలో ఉండటం భారత్‌కు మంచిది కానే కాదు. బంగ్లాదేశ్, భారత్‌కు తలనొప్పిగా మారుతున్నదని ఎందుకు విశ్లేషించాల్సి వస్తున్నదంటే అమెరికా ప్రభుత్వంలోనిన్యాయ నిపుణులు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ నాయకులతో దేశంలో ఎన్నికలు ఏవిధంగా జరుపుతే బాగుంటుందన్న విషయంలో సలహాలు, సూచనలు ఇచ్చిన సందర్భంలో ఢాకాలోని ప్రభుత్వ నాయకులు షేక్‌హసీనా పార్టీ అవామీ లీక్ మీద నిషేధం ఎత్తివేశారు. 2026 ఎన్నికల్లో ఆపార్టీ పాల్గొనే ప్రసక్తే లేదని ఖండితంగా చెప్పటంతో అక్కడ రాబోయే ఎన్నికలను ఒక తంతుగా మార్చే సూచనలు బహిర్గతమవుతున్నాయి. అదే జరిగితే 1971లో ఏర్పడిన అవామీలీగ్ పార్టీ ఎన్నికల్లో పాల్గొనకుండా ఉండటం మొదటిసారి అని భావించాలి. హసీనా మీద మరణశిక్ష విధించడం కూడా బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ నవంబరు 17 నాడు చేసింది. ఫిబ్రవరి 12, 2026 నాడు జరిగే ఎన్నికలలో దేశ బహిష్కృతులు, వలస పోయినవారు పాల్గొనే అవకాశం లేదని కూడా ప్రభుత్వ సలహాదారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా హసీనా రాతపూర్వకంగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో అవామీలీగ్‌ను సపోర్టు చేసే ఎవరూ ఈ జరగబోయే ఎన్నికలలో (తమ పార్టీపై నిషేధం అమలులో ఉన్న పక్షంలో) ఓటువేయరని చెప్పటం కూడా ఈఎన్నికలు ఏ విధంగా జరగబోతున్నాయనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నాయకుడు తారిఖ్ రహమాన్ ఢాకా రాగానే బ్రహ్మాండమైన ర్యాలీనుద్దేశించి ప్రసంగించాడు. ముఖ్యంగా వాక్ స్వాతంత్రం ఉండాలని ప్రజలనుద్దేశించి చెప్పటాన్ని చాలామంది మెచ్చుకుంటున్నారు. అంతేకాకుండా బంగ్లాదేశ్ అన్ని జాతుల వారు నివసించడానికి భద్రత ఉండాలని ప్రత్యేకంగా చెప్పటం విశేషం. దేశంలో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని గురించి ప్రత్యేకంగా ఆయన ప్రస్తావించారు. కొండల్లో ఉండేవారు, మైదాన ప్రాంతాల్లో ఉండేవారు, ఎవరైనా ఈ దేశంలో నివాసయోగ్యులే అని చెప్పారు. అన్ని మతాల వారు హిందువులతోసహా ఉండటానికి సురక్షిత బంగ్లాదేశ్ నిర్మించుకోవాలని కూడా చెప్పారు. అయితే షేక్ హసీనాను మాత్రం బాగా ఈ ర్యాలీలో విమర్శించారు. 2024లో దేశస్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటానికి ప్రజలందరూ సమాయత్తమై, 1971లో మాదిరి పోరాడారని రెండు సంఘటనలను పోల్చటంతోపాటు జనరల్ జియాకు బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని మార్చి 26,1971 నాడు ప్రకటించారని ఆ ఘనత ఆయనకు ఆపాదించారు. అంతేకాదు 'ఆపరేషన్ సెర్చ్ లైట్' పేరిట స్వాతంత్ర్యయోధులను సంహరించడానికి పాకిస్థాన్ బలగాలు సిద్ధపడినప్పుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, బంగ్లా స్వాతంత్ర్య సమరయోధులను కాపాడారని చెప్పారు. ఏదిఏమైనా 2026లో బంగ్లాలో జరగబోయే ఎన్నికలు ఏ ఫలితాలతో బయటకు వస్తాయో ఊహించటం ఎవరికీ సాధ్యంకాని పరిస్థితి ప్రస్తుతం ఉన్నది. షేక్‌హసీనా గెలిచిన సీటులో ఒక హిందూ నాయకుడు పోటీకి దిగుతున్నాడని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎన్నికల్లో మైనార్టీలు ముఖ్యంగా హిందూ మతస్తులు కూడా పాల్గొనటానికి సిద్ధంగా ఉండటం ప్రజాస్వామ్యానికి శుభసూచకంగా పరిగణించాలి. అయితే ప్రస్తుతం తారిఖ్ రెహ్మాన్ ఎన్నికలలో గెలవటానికి తగ్గట్టుగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తున్నది. భారత్ పట్ల ఇంతవరకూ వ్యతిరేకంగా మాట్లాడలేదు కానీ షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన నేపథ్యంలో పూర్తిగా భారత్‌తో స్నేహాన్ని అభిలషిస్తాడని చెప్పడం కష్టమే. 1971లో బంగ్లాదేశ్ విముక్తికి షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు కానీ, ఇందిరా గాంధీకి కాని 'క్రెడిట్' ఇవ్వకుండా 'జియా'కు ఇవ్వడం రాజకీయం చేసే నాయకుడు మాట్లాడే విధంగానే ఉంది. అందుచేతనే భారత్ పట్ల రహమాన్ ధోరణిలో స్పష్టత లేదు. నిప్పుల కొలిమిలా ఉన్న బంగ్లా ఎన్నికల తర్వాతనే భారత్ పట్ల స్పష్టమైన వైఖరితో బయటపడగలదు. అంతవరకూ బంగ్లాదేశ్ మనకు ప్రశ్నార్థకమే! •

# యాసంగికి సన్నద్ధమవుతున్న రైతన్న

బైరబోయిన వెంకటేశ్వర్లు

రాష్ట్రంలో యాసంగి సాగు ఊపందుకుంది. వానాకాలం పంటకు మొంథా తుఫాన్ చేసిన బీభత్సం నుండి తేరుకుంటూ యాసంగి పంటకు రైతులందరూ సన్నద్ధమవుతున్నారు. సాధారణంగా తుఫానులు జూలై, ఆగస్టు నెలలో ఎక్కువగా సంభవిస్తాయి. అప్పుడు పంటవయసు పెట్టిన పెట్టుబడి తక్కువ ఉంటుంది. కానీ ఈసంవత్సరం మొంథా తుఫాన్‌మాత్రం అక్టోబర్ నెల చివరన వచ్చి రైతు చేతికందే పంటను నేలపాలు చేసింది. రైతు ఆరు నెలల కష్టాన్ని బూడిద పాలు చేసింది. ఈ తుఫాన్ రాష్ట్రంలో దాదాపుగా ఆరులక్షల ఎకరాలకు పైగా పంట నష్టం చేసింది. అందులో వరి మూడులక్షల ఎకరాలు, పత్తి లక్షన్నర ఎకరాలు, మొక్కజొన్న, మిగతా పంటలు అన్నికలసి 50 వేలా ఎకరాల వరకు నష్టం చేసింది. ఒక వరంగల్ జిల్లాలోనే రెండు లక్షల ఎకరాలకు పైగా పంట నష్టం చేసిందని అంచనా వేశారు. వానాకాలం పంట కాలంలో యూరియా కోసం రైతులు పడ్డ తిప్పలు అందరికీ తెలిసేఉంటుంది. ఎరుపెక్కిన పంటను తిరిగి పచ్చగా మార్చి నేలలో నత్రజని శాతాన్ని పెంచడానికి కావాల్సిన యూరియా కోసం పడినపాట్లు అన్నీ ఇన్నీకావు. ఇంతటి కష్టాన్ని గట్టెకి యూరియా సంపాదించి పంటను కాపాడుకుంటే తీరా చేతికొచ్చేసరికి తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయి. ఈ పంట నష్టానికి రైతులకు ప్రభుత్వాల నుండి వచ్చే పరిహారం అంతంత మాత్రమే అని చెప్పాలి. సూర్యుడు అస్తమించిన తిరిగి ఉదయించినట్టుగానే భూమినే నమ్ముకునే రైతులు సాగు చేయాడం ఆపరు. రైతులకు ప్రత్యామ్నాయం లేకనే ఎంత నష్టం జరిగిన మళ్ళీ భూమినే నమ్ముకుంటాడు. వానాకాలం పంటల సాగు వర్షాలపై ఆధారపడిన యాసంగి సాగుకు మాత్రం బోర్లు, బావులు, చెరువులు, రిజర్వాయర్ల ద్వారా వచ్చే నీటి పారకం పైన ఆధారపడుతుంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం సగటు సాధారణ వర్షపాతం 850 మీ.మీగా పడాల్సి ఉంటే ఇప్పటివరకు 1178 మి.మి వర్షపాతం పడింది. ఇది సాధారణం కన్నా 39శాతం ఎక్కువగా నమోదైంది. గత సంవత్సరంతో పోలిస్తే 1045మి.మి కన్నా ఎక్కువ. రాష్ట్రవ్యాప్తంగా 4జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైతే 29 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఈ అధిక వర్షపాతం వల్ల భూగర్భ జలాల నీటిమట్టంకూడా పెరిగింది. ప్రస్తుతం బావులు, చెరువులు, రిజర్వాయర్లు నీటితో కలకలలాడుతున్నాయి. అలగే రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి 790 టీఎంసీలు ఉంటే అది ప్రస్తుతానికి 840 టీఎంసీలుగా ఉంది. రాష్ట్రంలో సరాసరి భూగర్భ జలాల నీటి మట్టం నవంబర్ చివరి నాటికి అత్యల్పంగా నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రౌండ్ లెవల్ నుండి 1.89 మీటర్ లోతులో ఉంటే అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 7.71 మీటర్ లోతులో ఉన్నాయి. రాష్ట్ర సరాసరి భూగర్భ జలాల నీటి మట్టం 4.41 మీటర్‌గా ఉంది. ఇది గతడేది నవంబరు చివరినాటికి 6.05 మీటర్‌గా ఉండేది. ఈ గణాంకలన్నీ యాసంగి సాగుకు కావాల్సిన నీటిలభ్యత పుష్కలంగా ఉంది అనే చెబుతున్నాయి. ఒకప్పుడు పత్తి ఏడాది పంటగా ఉండేది ఇప్పుడు ఆరు నెలల పంటగా మారింది. గత పది సంవత్సరాలుగా వర్షాలు పుష్టిగా పడటంతో పత్తి పంట వానాకాలానికే పరిమితమై యాసంగిలో మొక్కజొన్న పంటను వేస్తున్నారు. ఇప్పుడు యాసంగిలో వరి, మొక్కజొన్న ప్రధాన పంటలుగా సాగవుతున్నాయి. యాసంగిలో సాధారణ సాగు భూమి 68.67 లక్షలుగా అంచనా వేస్తే డిసెంబరు మూడోవారానికి 8.20 ఎకరాలలో పంట సాగు మొదలైంది. వరి పంట 51 లక్షల ఎకరాలకు గాను లక్ష ఎకరాలు, మొక్కజొన్న ఆరున్నర లక్షల ఎకరాలకు గాను నాలుగులక్షల ఎకరాలలో సాగు మొదలైంది. లక్షన్నర ఎకరాలు శనగ సాగు ఐతే మిగిలినవి పప్పుధాన్యాలు సాగు అవుతున్నాయి. ఇప్పటివరకు 26 జిల్లాల్లో 25 శాతం లోపు 6 జిల్లాల్లో 25 శాతం పైగా సాగు జరుగుతుంది. పంట చేతికందే వరకు రైతు ముందున్నవి ప్రకృతి విపత్తులు ఒక సమస్య ఐతే మానవ విపత్తులు మరో సమస్య. యాసంగి పంట చేతికొచ్చే వేసవికాలంలోనే ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తాయి. ఇవి వరి మొక్కజొన్న పంటలతో పాటు మామిడి తోటలకు తీవ్ర నష్టం చేస్తాయి. స్వార్థం లేని పుడమి పంటనివ్వడానికి సిద్ధంగా ఉన్న ధన దాహానికి మానవ స్వార్థపూరితమైన ఆలోచనలు రైతులకు ఎక్కువ నష్టం చేస్తున్నాయి. పంట ప్రారంభంలోనే నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల సమస్య ఒక వైపు ఐతే దిగుబడి అయిన పంటకు గిట్టుబాటు ధర లేక దళారుల మధ్య మోసపోవడం మరోసమస్య. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం క్రింద రైతు భరోసా అందిస్తున్న, ప్రధానంగా నకిలీ విత్తనాల తయారీని నిర్మూలిస్తు యాసంగిపంటకు కావాల్సిన ఎరువులు, యూరియా, విద్యుత్‌ను అందుబాటులో ఉంచడంపై దృష్టిపెట్టాలి. అలాగే వానాకాలంలాగా యూరియా కొరత లేకుండా చూస్తూ అవసరానికి కావాల్సిన యూరియా సరఫరాచేస్తూ పరిమితికి మించి వాడితే భూమిలో ఆమ్లశాతం పెరుగుతుందని, దాని పర్యవసానాల పైఅలాగే పంటకు తగ్గట్టుగా నేలలోపోషకాలు వృద్ధిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంఉంది. •

# గ్రామీణాభివృద్ధికి అడుగులు పడేనా?

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కొలువుదీరిన 12,702 మంది సర్పంచులు, 1,11,803 మంది వార్డు సభ్యులు గ్రామ పాలనలో కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీ అనేది పునాదివంటిది. గ్రామ పంచాయతీ బలంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధిబాటలో నడు స్తుంది. అలాంటి గ్రామ పంచాయతీలకు నాయకత్వం వహించే సర్పంచుల పాత్ర అత్యంత కీలకం. అయితేగ్రామాభివృద్ధి అనేది మాటల్లో కాకుండా కార్యరూపంలోకి రావాలంటే సర్పంచులు అనేక సవాళ్లను ఎదుర్కొని, అవగాహనతో, నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామ సర్పంచుల ముందు నిలిచే మొదటి పెద్ద సవాలు అభివృద్ధి పట్ల సరైన అవగాహన లేకపోవడం. చాలా మంది సర్పంచులు ప్రజాభిమానంతో ఎన్నికైనా, పాలనా విధానాలు, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం, చట్టపరమైన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా గ్రామానికి రావాల్సిన నిధులను సద్వినియోగం చేయలేకపోవడం, లేదా పథకాలను పూర్తిగా అమలు చేయలేకపోవడం జరుగుతోంది. కాబట్టి గ్రామాభివృద్ధి కోసం ముందు సర్పంచులే శిక్షణపొందాల్సిన అవసరంఉంది. నిధుల కొరత మరో ప్రధాన సమస్య. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు వస్తున్నా అవి చాలవు. రోడ్లు, తాగు నీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాలు వంటి అనేక అవసరాలకు ఒకేసారి నిధులు అవసరం అవుతాయి. కానీ పరిమిత నిధులతో అన్ని పనులు చేయడం సర్పంచులకు పెద్ద సవాలుగా మారుతోంది. అంతేకాకుండా, కొన్నిసార్లు నిధులు ఆలస్యంగా రావడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. నిధులు వచ్చినా వాటి సరైన వినియోగం కూడా ఒక పెద్దసమస్యే. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, అధికారులపై ఆధారపడాల్సిరావడం వల్ల కొన్ని చోట్ల అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది గ్రామాభివృద్ధికి పెద్దఅడ్డంకిగా మారుతోంది. సర్పంచులు నిజాయితీగా ఉన్నా, వ్యవస్థలోని లోపాలవల్ల ప్రజల్లో వారి మీదనమ్మకం తగ్గేపరిస్థితి ఏర్పడుతోంది. గ్రామాభివృద్ధిలో మరోసవాలు ప్రజల భాగస్వామ్యం లేకపోవడం. అభివృద్ధిఅనేది కేవలం సర్పంచి బాధ్యత మాత్రమే కాదు. గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలి. కానీ చాలా గ్రామాల్లో ప్రజలు సమావేశాలకు రాకపోవడం, గ్రామసభలను పట్టించుకోకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా సర్పంచులు తీసుకునే నిర్ణయాలకు పూర్తిమద్దతు లభించడంలేదు. ప్రజల సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. రాజకీయ జోక్యం కూడా సర్పంచుల పనితీరును ప్రభావితం చేసే అంశం. గ్రామస్థాయిలోనే వర్గపోరులు, రాజకీయ విభేదాలు సర్పంచుల ముందున్న పెద్ద సమస్య. అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూసి అడ్డుకోవడం, వ్యక్తిగత లాభనష్టాల కోసం పనులను నిలిపివేయడం జరుగుతోంది. దీనివల్ల





గ్రామానికి మేలు చేసే పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. ఇక అధికారులతో సమన్వయం లోపించడం కూడా ఒక సవాలే. గ్రామ పంచాయతీకి సంబంధించిన పనుల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. వీరితో సమన్వయం సరిగా లేకపోతే పనులు ముందుకు సాగవు. కొన్నిసార్లు అధికారుల నిర్లక్ష్యం, ఆలస్యంవల్ల సర్పంచులు ప్రజల విమర్శలకు గురవుతున్నారు. అయితే ఈ సవాళ్ల మధ్య సర్పంచులు చేయాల్సిన బాధ్యతలు మరింత పెరుగుతున్నాయి. కేవలంప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా స్థానికంగా నిధులు సృష్టించుకోవడం నేటి అవసరం. గ్రామపంచాయతీ పరిధిలోని మార్కెట్లు, వారపుసంతలు, దుకాణాలు, ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చు. ఆస్తిపన్ను, నీటి పన్నువంటి వాటిని సమర్థవంతంగా వసూలు చేయడంద్వారా కూడా గ్రామానికి ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ విషయంలో సర్పంచులు ధైర్యంగా, పారదర్శకంగా వ్యవహరించాలి. అలాగే సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కూడా ఎంతో అవసరం. డిజిటల్ పాలన, ఆన్‌లైన్ దరఖాస్తులు, పారదర్శక లెక్కల నిర్వహణ ద్వారా గ్రామపాలన మరింత సమర్థవంతంగా మారుతుంది. యువతను గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా చేయడం ద్వారా కొత్త ఆలోచనలు, కొత్తమార్గాలు ముందుకువస్తాయి. మొత్తంగా చూస్తే, తెలంగాణ గ్రామ సర్పంచుల ముందు ఉన్న సవాళ్లు అనేకమైనా, అవి అధిగమించలేనివి కావు. సరైన అవగాహన, నిజాయితీ, ప్రజల భాగస్వామ్యం, అధికారులతో సమన్వయం, స్థానిక నిధుల సృష్టివంటి అంశాలపై దృష్టి సారిస్తే గ్రామాభివృద్ధిసాధ్యమే. గ్రామం అభివృద్ధిచెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఆ అభివృద్ధికి పునాది వేయాల్సిన బాధ్యత గ్రామ సర్పంచులదే. •

ong-5_ong-5.qxd 12/28/2025 10:16 PM Page 1



ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## నవోదయలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం విజయవంతం

ఒంగోలు, ప్రభాతవార్త



జవహర్ నవోదయ విద్యాలయం నందు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. నవోదయలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు పూర్తి చేసిన వివిధ బ్యాచ్ల పూర్వ విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చి, తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను తమను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకొని వారి యొక్క తరగతి గదిలో హాస్టల్లో జరిగిన అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ జీవితంలో సాధించిన విజయాలను పంచుకున్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరాం హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ సమ్మేళనం విద్యార్థుల మధ్య సత్సంబంధాలను పెంపదమే కాకుండా, తమను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన గురువుల పట్ల కృతజ్ఞతను చాటుకునే గొప్ప అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, నవోదయ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పివిఎన్ రంజిత్ కుమార్ పుట్టినరోజు పలు సేవా కార్యక్రమాలు

ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త



పివిఎన్ రంజిత్ కుమార్ జన్మదినోత్సవం ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ మంచి మనసు దాతృత్వం కలిగిన సీనియర్ న్యాయవాది పోకల వెంకట రామారావు ఆర్థిక సహకారంతో పివిఎన్ రంజిత్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా శివం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చలికి ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీతో పాటు పండ్లు కాయలు పంపిణీ చేయడం శివం శరణాలయంలో వృద్ధులకు మూడు పూటలా పౌష్టిక ఆహారంతో భోజనం ఏర్పాటు చేయడం శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలో అనాథలకు యాచకులకు 300 మందికి పైగా అన్నదానం చేయడం మానవత్వంతో కూడిన మంచి సేవా కార్యక్రమం అని తెలిపారు. శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి మాట్లాడుతూ దాతలు మీ కుటుంబాలలో ముఖ్యమైన రోజుల్లో పేదలకు ఆర్థికంగా అండగా ఉండాలని తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో శివం శరణాలయం లోని వృద్ధులు పాల్గొని పివిఎన్ రంజిత్ కుమార్కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీకనక నాగవరపు అమ్మ ఆలయానికి కంచు గంట బహూకరణ

వేటపాలెం, డిసెంబర్ 28, ప్రభాతవార్త



వేటపాలెం గ్రామానికి చెందిన సాబినేని లలిత బాయి రామన్నపేటలోని శ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారి ఆలయానికి సుమారుగా 20 వేల విలువ చేసే కంచు గంటను బహుకరించారు. సాబినేని పుష్పావతి జ్ఞాపకార్థం భర్త సుబ్బారావు, కుమారుడు సాబినేని లలిత బాబు ధర్మపత్ని పద్మావతి, కుటుంబ సభ్యులు ఆరున్నర కిలోల కంచు గంటను బహుకరించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పోతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వలేటి ఆంజనేయులు, గుత్తి వీర ప్రసాదరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సామూహిక భగవద్గీత పారాయణం

చీరాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త





ధనుర్మాసం సందర్భంగా రావూరిపేట శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానం నందు వాసవి మహిళా సంఘం వారిచే సామూహిక భగవద్గీత పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొత్త శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అనుమాల శెట్టి సురేష్, గట్టా రమేష్, దోగిపర్తి వెంకట సుబ్బారావు, ఆత్మకూరి సుబ్బారావు, శికాకొల్లి సూర్య ప్రకాష్, ట్రెజరర్ దోగిపర్తి బాలకృష్ణ, చలువాది రాధాకృష్ణ, కొత్త వెంకట నారాయణ, వీరశేఖర్, పొన్నూరు రమేష్ కుమార్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు నాయకుడు పల్లపోలు సాంబయ్యకు ఘన నివాళి

వేటపాలెం, డిసెంబర్ 28, ప్రభాతవార్త



రైతు నాయకుడు పల్లపోలు సాంబయ్య 33వ వర్ధంతి సందర్భంగా ఆయనకు వారి కుటుంబ సభ్యులు నాగ మనోహర్ లోహియా రమేష్బాబులు, పరిసర ప్రాంత ప్రజలు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అందే మురళి వర ప్రసాద్(విశ్రాంత శాస్త్రవేత్త) సాంబయ్య జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో మొదటిగా సాంబయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ రైతు నాయకుడుగా నల్లమడ రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా పని చేసి మత్స్యకారుల ఉప్పు కొటారు సంఘం చేనేత సమస్యలపై, ఫారెస్ట్ భూమి పోరాట సాధన కమిటీ అధ్యక్షుడిగా పోరాడినటువంటి మహానాయకుడుగా వేటపాలెం ప్రాంతంలో గొప్ప పేరు ప్రతిష్ఠలు కలిగిన సాంబయ్యను స్మరించుకోవడం ఎంతైనా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, ఎం.సుభాషిని, గుర్రాల శేషు కుమారి, పసుపులేటి వసంతకుమారి, చింతం కోటి వీరయ్య, షేక్ సుభాని, షేక్ గౌస్ భాషా, మల్లేశ్వరి, బొమ్మిడి విజయ నిర్మల, బొమ్మిడి సుబ్బాఆవు, తులసి, మానస, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు షేక్షావలి సేవలు అభినందనీయం

పెద్దదోర్నాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త

కులమతాలకు అతీతంగా పెద్దదోర్నాల సేఫ్టీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ షేక్షావలి అందించిన సేవలు అభినందనీయమని అయ్యప్ప స్వాముల దీక్ష మాలధారులు అభినందించారు. మండల కేంద్రమైన పెద్దదోర్నాల శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి దీక్ష పరులకు శనివారం రాత్రి షేక్ షేక్షావలి బిక్ష అందజేసి వడ్డించి తిన్న విస్తర్లు ఎత్తి వేసి తాను దీక్ష పరులతో తిని తన సేవాభావాన్ని చాటుకున్నారు. ఓం శ్రీ అయ్యప్ప అంటూ నినాదం చేసి అయ్యప్ప స్వాముల సేవలో పునీతుడై స్వాముల ఆశీస్సులు పొందాడు. ఈ సందర్భంగా షేక్ షేక్షావలి మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు సేవ చేయడం ఆధ్యాత్మిక ఆనందం, మానసిక శాంతిని కలిగిస్తుందని తెలిపారు. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించేందుకు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కులమత బేధాలు లేకుండా ఇటువంటి సేవా కార్యక్రమాలు షేక్ షేక్షావలి చేయడం అభినందనీయమని అని పలువురు అభినందించారు.



## సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

చీరాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త



నేడు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశం ఉన్నందున ప్రతి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నాడు తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ బి.ఉమామమేశ్వర్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. వివిధ సమస్యలను విన్నవించుకోవడానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చే వారు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

# కోడి.. రెడీ..!



ఒంగోలు, ప్రభాతవార్త

సంక్రాంతి సంబరాలకు సమయం సమీపిస్తుండడంతో లక్షలు కొల్లకొట్టే కోడిపందాలకు నిర్వాహకులకు ఇప్పట్నించే కాలుదువ్వుతున్నారు. బరుల కోసం ఇప్పటికే వెతుకులాట ప్రారంభించారు. ఎక్కడెక్కడ బరులు ఏర్పాటు చేయాలి. పందెలు నిర్వహణకు సంబంధించి ఎవ్వరెవ్వరికి ఎంతెంత ముట్టచెప్పాలనే దానిపై అంచనాలు వేసుకోవడంలో తలమునకలవుతున్నారు. బేరశారాలకు తలుపులు బార్ల తెరిచారు. ప్రతి ఏడాది మాదిరిగానే కోడిపందాలు నిర్వహిస్తే తోలు తీస్తామంటూ పోలీసులు బీకర హెచ్చరికలు చేస్తున్నా వాటిని నిర్వాహకులు శరామామూలుగానే తేలిగ్గా తీసుకుంటున్నారు. గత ఏడాది కంటే రెట్టింపు బరులు వేయాలనే పట్టుదలతో పకడ్బందీ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏటా సంక్రాంతి పండుగ వస్తుందంటే చాలు జిల్లాలోని ఒంగోలు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలతో పాటు కనిగిరి, సంతనూతలపాడు, దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కొండపి నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో సముద్ర తీరం వెంట కోడిపందాలు యమాజోరుగా సాగుతుంటాయి. కోడిపందాల ముసుగులో నెంబర్ల లాటరీలకు కూడా ఈ ప్రాంతాలకు పెట్టింది పేరుగా నిలుస్తున్నాయి. ఇక్కడ నుంచి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు కూడా కోడిపందెలను తీసుకుని వారం రోజుల పాటు అక్కడే ఉండి కోడిపందాలు వేస్తున్న వారు కూడా అనేక మంది ఉన్నారు. ఈ క్రమంలోనే సంక్రాంతి పండుగ నాటికి కోడిపందాలు నిర్వహించి తీరుతామని ఇప్పటికే నిర్వాహకులు ఛాలెంజ్ చేస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో మూడు పుంజులు, ఆరు పందాలు అనే రీతిలో కోడిపందాలు నిర్వహించడం ఖాయమని ఢంకా బజాయించి మరి చెప్పున్నారు. పండుగ పూట కోడికట్టకుండా సరదాగా పందెలు వేసుకుంటే ఎటువంటి అభ్యంతరం ఉండదని, కత్తి కడితే మాత్రం పందాలను అడ్డుకుని తీరుతామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇప్పుడు అలానే అంటారని, పండుగ దగ్గరకు వచ్చే కొద్ది ఈ మాటలు చెల్లవని, ఏవైనా తేడా వస్తే తమ నాయకులే చూసుకుంటారని పందాలు నిర్వాహకులు అంటున్నారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులతో సైతం బేరసారాల్లో మునిగితేలుతున్నారు. జిల్లాలో ఈసారి ప్రధానంగా సముద్ర తీర ప్రాంతాలు అయిన పాకల, కొత్తపట్నం, చిన్నగంజాం, పెద్దపట్టపుపాలెం, చాగిచర్ల, తెట్టు, యరజర్ల, కొణిజేడుతో పాటు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో పందెలు వేసేందుకు సిద్ధం చేసినట్లు సమాచారం. దీనికి ఎంత ఖర్చు అవుతుంది. ఎంత మిగులుతుందని లెక్కలేస్తున్నారు. గ్రామ స్థాయి నేతలు గ్రామాల వారీగా బరులు వేసే ఏర్పాట్లో ఉన్నారు. ఈ సారి కూడా ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వాహకులు ముందడుగు వేస్తున్నారు. నిర్వాహకులు మారుతున్నారే తప్ప పందాలు మాత్రం ఎప్పటి మాదిరిగానే జరిపే ఏర్పాట్లో ఉన్నారు. గత ఏడాది వేసిన భారి బరులో లక్షలు చేతులు మారాయి. లక్షల్లో పందాలు కాస్తూ జేబులు చిల్లులు పొడుసుకుని వస్తుంటారు. ఓడిన వారు తెల్లముఖం వేసుకుంటే గెలిచిన వారు డప్పు వాయిద్యాలతో నృత్యాలు వేస్తూ వస్తుంటారు. ప్రతి నియోజకవర్గంలోనూ ముఖ్య నేతల కనుసన్నల్లోనే బేరసారాలు సాగుతుండటం విశేషం.

## ఏపిజెఏసి అమరావతి ఆవిర్భావ సభను జయప్రదం చేయండి..

*- వేలాదిగా తరలివచ్చి ఐక్యతను చాటుదాం...*
*- ఉద్యోగుల సమస్యలపై ఏపిజెఏసి అమరావతి నిరంతరం పోరాటం*
*- ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బప్పరాజు వెంకటేశ్వరరావు..*

ఒంగోలుకలెక్టరేట్, ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఏపిజెఏసి అమరావతి ఆవిర్భావ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసేందుకు చేపట్టిన జిల్లాల పర్యటనలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలు, ఎన్టీఆర్ కళాక్షేత్రం నందు ఏపిజెఏసి అమరావతి ప్రకాశం జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టివి ఫణి పేరాజు, విఆర్ఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయ కుమార్, ఉమెన్ అసోసియేట్ స్టేట్ చైర్ పర్సన్ సైకం శివకుమారి రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు వి. ఆర్లయ్య, క్లాస్5 ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లేశ్వరరావు, ఏపి విఆర్ఓ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అనుపమ, ప్రకాశం జిల్లా మహిళా చైర్ పర్సన్ వి. జయలక్ష్మీ, జనరల్ సెక్రెటరీ వి. శ్రీదేవి, విఆర్ఓ అసోసియేషన్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వరంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తిశిరితిది అమరావతి ఏర్పాటు చేయడం జరిగింది తెలిపారు. ఏపిజెఏసి అమరావతిలో వ్యక్తుల ప్రాధాన్యత ఉండదని, సంఘాల ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కరించడం ముఖ్య లక్ష్యమని తెలిపారు. తిశిరితిది అమరావతిలో ఉన్న 94 సంఘాలలో, 78 సంఘాలు రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి ఉద్యోగులకు మధ్య వారధిలా పని చేస్తున్నాయన్నారు. ఫిబ్రవరి 5వ తేదీన ఏపిజెఏసి అమరావతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన రాష్ట్ర "మహాజనసభ" కు ఉద్యోగులు వేలాదిగా హాజరై జయప్రదం చేయడం ద్వారా ఉద్యోగుల ఐక్యతను చాటాలన్నారు. అందులో భాగంగానే జిల్లాల పర్యటనలో భాగంగా నేడు ఒంగోలు రావడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, నూతనంగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంలో రెండు సంవత్సరాలుగా అనేక రకాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తున్నామని, అందుకు సంబంధించిన కార్యాచరణను రాష్ట్ర మహాజన సభలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉద్యోగాలకు రావాల్సిన ఐఆర్, పిఆర్సి, డిఎ తదితర ఆర్థికపరమైన సమస్యలను ప్రభుత్వం తీర్చే విధంగా మనమందరం ఐక్యతగా ప్రభుత్వానికి తెలియ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపిజెఏసి అమరావతి జిల్లా చైర్మన్ పిన్నిక మధుసూదన్ రావు, అసోసియేటెడ్ చైర్మన్ కృష్ణమోహన్, ట్రెజరర్ కుమార్, వైస్ చైర్మన్లు బెజవాడ రవి, తిరుపతి స్వామి, ప్రసన్నాంజనేయ కుమార్, వెంకట్రావు, పద్మ, వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, సెక్రటరీ జనరల్ పోలయ్య, సెక్రటరీలు శిరీష్ బాబు, అబ్దుల్లా, ప్రశాంత్ నాయుడు, రాజేష్ బాబు, వెంకటేశ్వరరాజు, వైస్ చైర్మన్ ఊతకోలు శ్రీనివాసరావు, సెక్రటరీ శ్రీనివాస వర్మ, వైస్ చైర్మన్ విశ్వరూపాచారి, సెక్రటరీలు జానయ్య, శ్రీనివాసరావు, బాలకృష్ణ, బాలాజీ, లావణ్య, సుబ్రహ్మణ్యం, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.




## రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఒంగోలుకలెక్టరేట్, ప్రభాతవార్త



రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ఈ దిశగా ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరిగే మీకోసం కార్యక్రమంలో ప్రత్యేకముగా రెవెన్యూ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈనెల 29వ తేదీ నుంచి మీకోసం కార్యక్రమంలో రెవెన్యూ అంశాలకు సంబంధించి వచ్చే అర్జీల పరిష్కారానికి ఐదు ప్రత్యేక టేబుళ్ళు ఏర్పాటు చేస్తారు. ఈ విధంగా ఆర్.ఓ.ఆర్, పాస్ పుస్తకము, ఆర్.ఓ.ఎఫ్.ఆర్, ఏజెన్సీ భూములు, రీ సర్వే టేబుళ్ల ఏర్పాటు చేసి సంబంధిత రికార్డును కూడా అందుబాటులో ఉంచుతారు. రెవెన్యూ క్లినిక్లో ప్రత్యేకంగా రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అందులోని సిబ్బంది అర్జీదారుతో మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకుని సంబంధిత టేబుల్ వద్దకు అర్జీదారును పంపుతారు. అన్ని పరిశీలించాక భూమి స్వభావము, సమస్య, దాని పరిష్కారానికి చేపట్టే కార్యాచరణ (ఏ.టి.టి)తో కూడిన రిపోర్టును అర్జీదారుకు అందజేస్తారు. ఒకవేళ సమస్య సివిల్ అంశానికి సంబంధించినది అయితే న్యాయపరమైన సలహాకూడా అందిస్తారు. రెవెన్యూ క్లినిక్కు వచ్చే తీవ్రమైన అంశాలు, న్యాయపరమైన వ్యవహారాలపై జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ, తాసిల్దార్ స్థాయిలో చర్చలు జరిపి పరిష్కారం చూపుతారు. ప్రతిరోజూ ఉదయం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఈ రెవెన్యూ క్లినిక్ పిటిషన్లపై సమీక్షిస్తారని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు సరైన చర్య తీసుకున్నారని నిర్ధారించుకున్నాకే ఈ పిటిషన్ను ముగిస్తామని కలెక్టర్ తెలిపారు. రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ విధంగా ప్రత్యేక దృష్టి సారించినందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

### ఈ రెండు మండలాలతో

# మార్కాపురానికి ఒరిగేదేమిటి..?




ఒంగోలు, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కురిచేడు, దొనకొండ మండలాలను మార్కాపురం జిల్లాలో చేర్చి పొదిలి మండలాన్ని ప్రకాశం(ఒంగోలు) జిల్లాలో కలిపే ప్రతిపాదనపై చర్చలు జరుగుతున్నాయి. ఈ మార్పులు మార్కాపురం జిల్లా అభివృద్ధికి ఎలా ఉపయోగపడతాయనే విషయాన్ని ఏ విధమైన పరిశీలనతో ప్రభుత్వం ఆలోచించిందనే చర్చ మార్కాపురం ప్రాంతంలో మొదలైంది. పరిపాలనా సౌలభ్యం ఆర్థిక వృద్ధి, స్థానిక అవసరాలు వంటి అంశాలు తీసుకోవాలి. కానీ ఈ రెండు మండలాలు మార్కాపురంలో కలిపి పొదిలిని ఒంగోలులో కలపడం వల్ల నియోజకవర్గాల సమతుల్యతలు దెబ్బతినే అవకాశం ఉందిన పలువురు రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో భాగమైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉంది. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిపాదనల ప్రకారం మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లను కలిపి ఈ జిల్లా ఏర్పడుతుంది. దీంతో జనాభా సుమారు 11.42 లక్షలకు చేరుతుంది. ఇక్కడే కురిచేడు, దొనకొండ మండలాల చేరిక కీలకం. మార్కాపురం జిల్లాలో ఈ రెండు మండలాలు కలపడం వల్ల పెద్దగా ఒనగూరే గొప్పంటూ ఏమి లేదనేది పలువురు పరిశీలకుల అభిప్రాయం. దొనకొండలో రైల్వే స్టేషన్, పాత ఎయిర్పోర్ట్ సదుపాయాలు ఉన్నాయి. ఇవి కొత్త జిల్లాలో చేర్చడం వల్ల పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెబుతున్నారు. మార్కాపురం నుంచి దొనకొండ రావాలంటే పొదిలి మీదుగా కురిచేడు చేరి అక్కడి నుంచి దొనకొండ చేరుకోవాలి. ఇది 80 కిలో మీటర్ల వరకు ఉంటుంది. లేదంటే మరో రూటులో కర్నూలు, గుంటూరు రోడ్డు నుంచి త్రిపురాంతకం గ్రామానికి సమీపంలోని వెల్లంపల్లి వద్ద నుంచి గుండ్లకమ్మ బ్రిడ్జి మీదుగా దొనకొండ చేరుకోవాలి. ఇది కూడా సుమారు 70 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి నుంచి కురిచేడు మరో 25 కిలోమీటర్లు ఉంటుంది. ఎటు చూసినా మార్కాపురం పట్టణానికి దగ్గరగా, ఒంగోలుకు దూరంగా ఈ రెండు మండలాలు లేవు. సమాన దూరంలోనే ఉంటాయి. ఈ రెండు మండలాలు కలిపినంత మాత్రానా నాగార్జున సాగర్ నీరు యర్రగొండపాలెం నియోజకవర్గంలోకి వచ్చే అవకాశం లేదు. ఎందుకంటే యర్రగొండపాలెం పశ్చిమాన ఉంటుంది. పైగా గుళ్లకమ్మ ఈ రెండు మండలాలకు అడ్డంగా ఉంటుంది. అక్కడి నుంచి పై ప్రాంతానికి నీళ్ల రావాలంటే వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

### ప్రజలు ఏమి కోరుకుంటున్నారు:

దర్శి నియోజకవర్గంలో దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాలు ఉన్నాయి. తాళ్లూరు, ముండ్లమూరు మండలాలు అద్దంకి నియోజకవర్గ కేంద్రానికి దగ్గరలో ఉన్నాయి. అందువల్ల దర్శి, కురిచేడు, దొనకొండ మండలాలు కలిపితే బాగుంటుందనే ఆలోచన ప్రజలు చేవారు. పాలకులు మాత్రం కురిచేడు, దొనకొండ చాలు అనటం వెనుక ఏదో మతలబు ఉందని, దొనకొండ పారిశ్రామిక కారిడార్గా మారితే రాజకీయ నాయకులకు కల్పతరువుగా మారుతుందే తప్ప మార్కాపుం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల వారికి పెద్దగా ఉపయోగం లేదనే వాదన కూడా ఉంది.

### వెలిగొండే శాశ్వత మార్గం:

మార్కాపురం జిల్లా సస్యశ్యామలంగా వెలుగొందాలంటే ఈ మండలాల మార్పు వల్ల ఏ మాత్రం ఉపయోగం లేదనే వాదన చాలా మందిలో ఉంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి కాలువలకు నీరు వదిలితే మంచి పంటలు పండి ఈ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందే తప్ప దొనకొండ వచ్చినంత మాత్రాన మార్కాపురం మణిహారంగా మారే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారు. మార్కాపురం ఎమ్మెల్యే దొనకొండ, కురిచేడును మార్కాపురంలో కలపాలని కోరడం వెనుక వచ్చే ప్రయోజనాలు ప్రజలకు వివరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారిలో ఉన్న పొదిలి పట్టణం ఒంగోలులోకి పోవడం వల్ల మార్కాపురం నియోజకవర్గానికి నష్టం కలుగుతుంది. రవాణా పరంగా మార్కాపురం, ఒంగోలుకు మధ్య ఎటు చూసినా 50 కిలోమీటర్ల దూరంలో పొదిలి ంటుంది. పొదిలిని ఆనుకుని కొనకనమిట్ల మండలం ఉంది. ఈ రెండు మండలాలతో పాటు తర్లుపాడు, మార్కాపురం, మున్సిపాలిటీ కలిపి మార్కాపురం నియోజకవర్గంలో ఉన్నాయి. అందువల్ల కలపాలనుకుంటే దర్శిని కూడా మార్కాపురంలోనే కలపాలని ప్రజలు కోరుతున్నారు. దర్శి, కురిచేడు, దొనకొండ మండలాలు పక్కపక్కనే ఉంటున్నాయి. అలాగే పొదిలి పట్టణాన్ని మార్కాపురంలోనే ఉంచటం మంచిదని మార్కాపురం వాసులు కోరుకుంటున్నారు. ఇవన్నీ వదిలేసి ఏవేవో ఆలోచనలు ఎందుకు చేస్తున్నారనేది పలువురి వాదన. దొనకొండ మండలం చుక్క నీరు లేని పూర్తి మెట్ట ప్రాంతం. పారిశ్రామిక వాడాగా దొనకొండ మారాలంటే కనీసం మరో 30 సంవత్సరాల సమయం కావాలి. ఒక వేళ ఒకటో రెండో పరిశ్రమలు పెడితే స్కిల్ ఉన్నవారిని ఉద్యోగల్లోకి తీసుకుంటారు తప్ప అన్ స్కిల్డ్ వర్కర్లకు ఇక్కడ అవకాశం లేదు. యుద్ధ విమానాల తయారీ పరిశ్రమ పెడితే స్థానికులకు ఎంత మందికి ఉద్యోగాలు వస్తాయో ఆలోచించుకోవాలని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

6_6.qxd 12/28/2025 11:48 PM Page 1



# 4న ఛలో విశాఖకు తరలిరండి

**బల్లికురవ, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



దేశానికి సర్వసంపదలు సృష్టించే కార్మిక వర్గం, స్వాతంత్ర్య అనంతరం ఎప్పుడూ లేని విధంగా తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటుందని బాపట్ల జిల్లా సీఐటీయు అధ్యక్షుడు ఎం.వసంతరావు అన్నారు. ఆదివారం సాయంత్రం బల్లికురవలో సీఐటీయు కళాజాత ప్రదర్శన కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలకు పెద్దపీట వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా జనవరి 4న విశాఖలో జరిగే అఖిల భారత సీఐటీయు మహాసభలకు కార్మిక లోకం కదలి రావాలని పిలుపునిచ్చారు. విశాఖలో జరిగే అఖిల భారత సీఐటీయు మహాసభలు కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించబోతుందన్నారు. ఈ విధానాల కోసమేసమరశీల శంఖారావం పూరిస్తున్నామన్నారు. ధరల పెరుగుదల ఆకాశంలో ఉంటే,కార్మికుల జీతాలు మాత్రం పాతాళంలో ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి కార్మిక వ్యతిరేక విధానాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్మికుల జీతాల పెంచం, జీవితాంతం పని చేసిన ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తింపు నిచ్చే ప్రసక్తే లేదంటూ ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. కార్మిక, కర్షక ఐక్యతతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టడమే కాకుండా, పాలకుల మెడలు వంచే చేలా కార్మిక లోకం గళం వినిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ముజుందర్, ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, జిల్లా నేతలు రేఖ ఎలిజబెత్, వై.సింగయ్య, బొంత వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనంపై నుండి పడి యువకుడు అనుమానస్పద మృతి

**బల్లికురవ, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



బల్లికురవ, చెన్నుపల్లి రహదారిలో శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నుండి పడి యువకుడు అనుమాన స్పద రీతిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన అమర్తపూడి ప్రశాంత్‌కు ఐదుమాసాల క్రితం సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. రాత్రి పది గంటల సమయంలో బల్లికురవ,చెన్నుపల్లి రహదారిలోని ఒక పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకుని మక్కెనవారిపాలెం అత్తగారింటికి బయలుదేరాడు. ఏం జరిగిందో తెలియదు కానీ ఆదివారం తెల్లవారుజామున రహదారి పక్కనే ఉన్న, కాలువలో ద్విచక్ర వాహనంతో పాటు ప్రశాంత్ పడిపోయి ఉన్నాడు. ద్విచక్ర వాహనానికి ఏ విధమైన దెబ్బలు లేకపోవడం, మక్కెనవారిపాలెం వెళ్లేందుకు బయలుదేరిన యువకుడు బల్లికురవ వైపు వాహనంతో పాటు పడిపోయి ఉండటం, కుటుంబ సభ్యులను అనుమానాలకు గురి చేసింది. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన వ్యక్తులు ప్రమాదాన్ని గుర్తించి 108కు సమాచారం అందించారు. ప్రశాంత్ అప్పటికే మృతి చెందినట్లు సిబ్బంది తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేస్తున్నారు.

# సీఎంఆర్‌తో పేదల ముఖంలో చిరునవ్వు

**- చెక్కులు పంపిణీలో ఎమ్మెల్యే ఏలూరి**

**- ఆప్యాయంగా పలకరిస్తూ.. ధైర్యం చెప్పిన సాంబన్న**

**మార్టూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



పేదల కష్టాలను అర్థం చేసుకుంటూ, అవసర సమయంలో అండగా నిలిచే ప్రభుత్వం ఉందని మరోసారి నిరూపితమైందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలోని 67 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.36,85,956 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి ప్రతి లబ్ధిదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. చికిత్స ఖర్చుల భారం వల్ల ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారు వైద్య ఖర్చులతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం చేరేలా కృషి చేస్తున్నాం. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం అని తెలిపారు. చెక్కులు అందజేసే సమయంలో లబ్ధిదారులతో సన్నిహితంగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే యొక్క ఆప్యాయతకు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కోడూరి శేష బ్రహ్మాచారి, బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు రావిపాటి సీతయ్య, తాటి నాగేశ్వరరావు, నల్లపుని రంగయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన సీఐ శ్రీనివాసరావు

**మార్టూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



మార్టూరు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యర్రగడ్డ శ్రీనివాసరావు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

# అడవిని తలపిస్తున్న స్మశాన వాటిక

**- కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

**పుల్లలచెరువు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**





చచ్చిన శవాన్ని పూడ్చడానికి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి తీవ్రంగా నెలకొంది. మండలంలోని కవలకుంట్ల గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస సౌకర్యాలు లేక అంత్యక్రియలు చేయాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏళ్ళ తరబడి స్మశాన వాటికలో పిచ్చి మొక్కలు ముళ్లచెట్లతో చెత్తాచెదారంతో నిండిపోయి ఉండటంతో ఎవరైన మరణిస్తే ఆ స్మశాన వాటికలోకి వెళ్ళాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి ఉందని ఆ గ్రామ ప్రజలు అంటున్నారు. అంతే కాకుండా భారీ ఎత్తులో పిచ్చి చెట్లు పెరిగిపోయి స్మశాన వాటిక చిట్టడవిని తలపిస్తోంది. దీంతో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని వారంటున్నారు. ఆ ప్రాంతంలో కనీసం విద్యుత్ సరఫరా లేక నానారకం నిర్మాణాలు చేసి వెళ్లేందుకు సరైన మార్గం లేకుండా అప్పట్లో ఉపాధిహామీ నిధులతో నిర్మించారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే కాకుండా మండలంలో కొన్ని గ్రామాల్లో కూడా ఇదే దుస్థితి నెలకొంది. పాడుబడిన స్థలాల్లో ఖననం లేదా దహనాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం వస్తే మృతదేహాలను దొంకల్లో వాగుల్లో తరలించడం కష్టసాధ్యమే అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల అభివృద్ధి పేరుతో లక్షలకు లక్షలు ప్రభుత్వ నిధులు వెచ్చించి తూతూ మంత్రంగా నిర్మాణాలు చేసి ఉపయోగానికి వీలు లేకుండా ఉందని వారంటున్నారు. కొన్ని చోట్ల బోర్లు వేశారు ఉపయోగంలో లేకుండా విద్యుత్ సరఫరా లేదు. కాబట్టి బోర్లు నీరు వాడలేని పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. కాబట్టి ఇకనైనా అధికారులు స్పందించి స్మశాన వాటికలపై ప్రత్యేక దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కామ్రేడ్ మాజీ ఎంపీటీసీ లక్ష్మీ నరసయ్య సేవలు మరువలేనివి

**కొనకనమిట్ల, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



కామ్రేడ్ మాజీ ఎంపీటీసీ దివంగత పిల్లి లక్ష్మీ నరసయ్య సేవలు మరువలేనివని దళిత మహాసభ జిల్లా కార్యదర్శి ధర్నాసి పెద్దన్న, వాగుమడుగు సర్పంచ్ బూదాల కమలాకర్‌రావులు అన్నారు. కొనకనమిట్ల ఎస్సీ కాలనీలో ఆదివారం జరిగిన ప్రధమ వర్ధంతి సభలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. తొలుత దివంగత లక్ష్మీనరసయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో ఎన్నో ఏళ్లుగా క్రియాశీలక సభ్యునిగా, ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారని, ఎంపీటీసీగా సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దర్జీల సంఘం మాజీ అధ్యక్షులు పి.చిన్న, హైదరాబాద్ హెచ్ఎంటీ హిల్స్ కాలనీకి చెందిన బిల్డర్ వి.కోటేశ్వరరావు, వీఆర్ఏ దార్ల రామారావు, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం అధ్యక్షులు పి.బాలనరసయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### సంతాన సాఫల్యం పొందిన అభిమానుల వెల్లువతో

# దోర్నాల్లో డాక్టర్ వసంత కిరణ్‌కు ఘన స్వాగతం

**- దోర్నాల ఉచిత వైద్య శిబిరంలో 150 మంది సంతానలేమి దంపతులకు వైద్య పరీక్షలు**

**పెద్దదోర్నాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త**





మండల కేంద్రమైన దోర్నాల పట్టణంలో సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు దోర్నాల శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ కాశిరావు ఆధ్వర్యంలో నరసరావుపేట శ్రేయ హాస్పిటల్స్ అండ్ ఐవీఎఫ్ సెంటర్ వారు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మంది దంపతులకు పరీక్షలు నిర్వహించారు. స్కానింగ్, పురుష వీర కణాల పరీక్షలు చేశారు. సంతానలేమి సమస్యతో బాధపడిన అనేక దంపతులకు ఆశా కిరణంగా నిలిచిన ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ మేకల వసంత కిరణ్‌కు ఆదివారం ఘన స్వాగతం లభించింది. ఆమె వైద్యవాల ద్వారా సంతాన సాఫల్యం పొందిన దంపతులు హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతాభిమానాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. శిబిరంలో మహిళలకు అవసరమైన వైద్య పరీక్షలు, హార్మోనల్ సమస్యలపై అవగాహన, ఆధునిక చికిత్స విధానంపై సలహాలు, జీవనశైలి మార్పులపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత కిరణ్ మాట్లాడుతూ సంతాన లేమి ఒక వ్యాధి కాదని, సరైన సమయంలో సరైన చికిత్స పొందితే ఫలితం తప్పక ఉంటుందని అన్నారు. సమాజంలో ఉన్న అపోహలు తొలగించి, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు ఉండాలనే లక్ష్యంతోనే ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామని, శ్రీ రంగ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రోత్సాహంతో మరెన్నో శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో శ్రేయ హాస్పిటల్ అండ్ ఐవీఎఫ్ కేంద్ర వైద్య బృందం పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**మార్కాపురం, డిసెంబరు 28, ప్రభాతవార్త**



దేవరాజు గట్టు-ఏ వన్ గ్లోబల్ కళాశాల మధ్య శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్కాపురం పట్టణం గొర్లగడ్డకు చెందిన సయ్యద్ సత్తార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మోటార్‌బైక్‌పై మార్కాపురం వైపు వస్తున్న సమయంలో రోడ్డుపై అకస్మాత్తుగా బర్రెల గుంపు పరిగెత్తుకుంటూ రావడంతో వాటికి తగిలిన సత్తార్ బైక్‌పై నుంచి పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన తలకు బలమైన గాయం కాగా, స్పృహ తప్పిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి సత్తార్‌ను అత్యవసర చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా ముగిసిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

**కంభం, డిసెంబరు 28, ప్రభాతవార్త**






మండలంలోని పెద్ద నల్లకాల్వ గ్రామంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) స్పెషల్ క్యాంపు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ముగింపు ఉత్సవాలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సోనీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నల్లకాల్వలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టి గ్రామ వీధులను శుభ్రపరిచారు. అలాగే ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్ పరిసరాలను పరిశుభ్రం చేసి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సాయంత్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా డాక్టర్ జి సోనీ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయని పేర్కొన్నారు. క్యాంపును సమర్థవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులును, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను మరియు కళాశాల సిబ్బందిని అభినందించారు. అనంతరం ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వినోదుల పూర్ణచంద్రుడు, ఆఫీస్ సిబ్బంది రమణ యాదవ్, సునీతతోపాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చు

**- ఒంగోలు పార్లమెంట్ కమిటీ కోశాధికారి అంబవరం శ్రీనివాసరెడ్డి**

**రాచర్ల, డిసెంబరు 28 ,ప్రభాతవార్త**



క్రీడల ద్వారా దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని ఒంగోలు పార్లమెంట్ కమిటీ కోశాధికారి అంబవరం శ్రీనివాసరెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలోని అనుమలవీడు యువకులు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయగా ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరిగింది. ఈ మ్యాచ్‌లో కొమరోలు మండలం తాటిచెర్ల ఆర్కేజట్టు, అనుమలవీడు యూత్ జట్టు తలపడగా ఆర్కే జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.15వేల ప్రథమ బహుమతిని ఆయన సొంత నిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లతీఫ్, టిడిపి నాయకులు రమణారెడ్డి, కృష్ణారెడ్డి, శివరామిరెడ్డి, ఆంజనేయులు, నారాయణరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సంజయ్, నిర్వాహకులుక్రాంతి, యాకోబ్, అనూఫ్‌తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ముత్తుములను ఘనంగా సన్మానించిన ఒంగోలు పార్లమెంట్ కమిటీ సభ్యులు

**గిద్దలూరు, డిసెంబరు 28 ప్రభాతవార్త**





గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఒంగోలు పార్లమెంట్ నూతన కమిటీసభ్యులు ఆదివారం గజమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ద్వారా జిల్లా రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. ఒంగోలు పార్లమెంట్ కమిటీలో ఉపాధ్యక్షుడిగా కంభం పట్టణానికి చెందిన బిజ్జాల కిషోర్, కోశాధికారిగా రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన అంబవరం శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా గుర్రందానియేలు నియమితులైన సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి పార్లమెంట్ కమిటీలో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి జిల్లా వ్యాప్తంగా సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంభం, రాచర్ల మండల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఐటీయు మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతా

**సంతనూతలపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**




సీఐటీయు అఖిల భారత మహా సభలను జయప్రదం చేయాలని కోరుతూఆదివారం నాడు సంతనూతలపాడు మండలంలో సీఐటీయు నాయకులు ప్రచారజాతను నిర్వహించారు. మండలంలోని మంగమూరు, పేర్నమిట్ట, కామేపల్లివారి పాలెం, చంద్రపాలెం, గంగవరం, తక్కెళ్లపాడు, చిలకపాడు, లక్ష్మీపురం, రుద్రవరం, గురవారెడ్డిపాలెం, చలప్పాలెం, మైనంపాడు, ఎండ్లూరు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్నమిట్టలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రచారజాతాలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బంకా సుబ్బారావు పాల్గొని ఉపన్యసించారు. ఈ జాతాలో సీఐటీయు మండల కన్వీనర్ షేక్ మస్తాన్, నాయకులు షేక్ నాగూర్, పొత్తూరి చిన్న శేషయ్య, గుండవరపు వెంకట సుబ్బారావు, కోడూరి రామకృష్ణారెడ్డి, తుళ్లూరు సుబ్బారావు, దాసరి చినబాబు, కైలా అనీష్, తిప్పాబత్తిన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

**బల్లికురవ, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన బల్లికురవలో భక్తుల పాలిట కొంగు బంగారమై బాసిల్లుతున్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వీరాంజనేయులు ప్రత్యేక అభిషేకాలు అనంతరం, అమ్మవారికి పట్టు వస్త్రాలతో సువర్ణ శోభితంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సద్ది నైవేద్యంగా అందజేశారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**తాళ్లూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయ లక్ష్మి అమ్మవారి మూల విరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్. కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్ల సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లపెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. అమ్మవారి దర్శించుకున్న భక్తులకు ఆలయ అన్నదాన సత్రంలోఅన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో నర్రానారాయణరెడ్డి, ఆర్‌ఏ కాటూరిప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు. అలాగే జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## రాష్ట్ర రెడ్డి సంఘం లీగల్ సెల్ కార్యదర్శిగా నాగమల్లేశ్వరరెడ్డి

**తాళ్లూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



రాష్ట్ర రెడ్డి సంఘం లీగల్ సెల్ కార్యదర్శిగా మండలంలోని తూర్పుగంగవరంకు చెందిన భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం నంద్యాలలో జరిగిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో రాష్ట్రరెడ్డి సంఘం లీగల్‌సెల్ అధ్యక్షులు కే.రామకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పీ.రామకృష్ణారెడ్డిలుఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం ప్రమాణస్వీకారం చేయించారు. తనను రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శిగా నియమించిన రెడ్డి సంఘం అధ్యక్షులు, సభ్యులకు నాగమల్లేశ్వర రెడ్డికృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఉన్నతపదవి బాధ్యతలు అప్పజెప్పిన వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా రాష్ట్రంలో తన వంతు లీగల్ సేవలు అందిస్తానని, రెడ్డి సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. నాగమల్లేశ్వరరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

# 'వేటగాడు' నాటకం సక్సెస్ మీట్

**నాగులుప్పలపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**



ఉప్పుగుండూరులో ఈనెల 26వ తేదీన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురష్కరించుకుని ప్రదర్శించిన వేటగాడు సాంఘిక నాటకం విజయవంతంగా ప్రదర్శనమైంది. దీనిని పురష్కరించుకుని సక్సెస్ మీట్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్(ఏబీజే) ఫౌండేషన్ అధ్యక్షులు గద్దె త్యాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం బీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఘనంగా జరిగింది. సక్సెస్ మీట్‌లో సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆనందాన్ని పంచాలని ఉద్దేశంతోనే సాంఘిక నాటకాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే 2026 క్రిస్మస్ పర్వదినానికి మరొక సాంఘిక నాటకం విజయవంతంగా ప్రదర్శించాలని తీర్మానించుకున్నారు. డైరక్టర్ కొలకలూరి విజయ్ కుమార్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం సాంఘిక నాటకం సభ్యులతో కలిసి లంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జగ్జీవన్‌రామ్ ఫౌండేషన్ నిర్వాహక కమిటీ కన్వీనర్లు కొలకలూరి రవీంద్ర, బండారు సురేష్, కొలకలూరి బాలాజీ, తేళ్ళ జయరాజ్, కత్తి పవన్, సురేష్, కొలకలూరి రాము, ఉసురుపాటి యోహాను, కత్తి రాజేష్, అత్తంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అనధికార రొయ్యలచెరువు సాగు నిలుపుదల చేయాలి

**- పరిశీలించిన రైతు సంఘం నాయకులు - నిలుపుదల చేసినా తొలగించని కట్ట**

**- నష్టపోతున్న రైతులు వినతి**

**నాగులుప్పలపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**





కనపర్తి రెవెన్యూ పరిధిలోని 76 సర్వే నెంబరులో దేవరంపాడు గ్రామానికి చెందిన సింగోతు ఏడుకొండులు, నాయుడు శ్రీను, వడ్లమూడి శ్రీను మరో 20 మంది రైతుల మాగాణి సాగు చేసుకుంటున్నారు. మా భూములకు ఆనుకొని సింగోతు బ్రహ్మయ్య ఎటువంటి అనుమతులు లేకుండా రొయ్యల చెరువు సాగు చేస్తున్నాడని తద్వారా ఉప్పునీరుమయంగా మారి మా పంట భూములు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా రొయ్యల సాగుకు సిద్ధం చేస్తున్న బ్రహ్మయ్యకు అధికారుల నుండి ఎటువంటి అనుమతులు పొందకుండా కట్టవేయడంతో మాగాణి భూముల నుండి మురుగు నీరు పోనందువలన మాగాణి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని బాధిత రైతులు రైతు సంఘం దృష్టికి తీసుకురాగా ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జే.జయంతిబాబు మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా రొయ్యల సాగు చేయడం చట్టవిరుద్ధమని, వెంటనే రెవెన్యూ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి.శ్రీకాంత్, రావెళ్ళ వెంకటరావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో విజేత విద్యార్థిని ప్రియాంకకు

### బెస్ట్ అవార్డును అందజేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్

**సంతనూతలపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**





తిరుపతిలో ఈ నెల 27వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో విజేతగా నిలిచిన ప్రకాశం జిల్లా జట్టు నుండి సంతనూతలపాడు హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని చలువాది లక్ష్మీ సాయి ప్రియాంకకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ బెస్ట్ అవార్డును అందజేశారు. రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు నాలుగోస్థానంలో నిలిచింది. సంతనూతలపాడు హైస్కూల్ విద్యార్థిని సీహెచ్ లక్ష్మీ సాయి ప్రియాంక సభ్యురాలుగా కొనసాగింది. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో విశేష ప్రతిభ కనపరిచిన 6 జట్లకు మంత్రి సత్య కుమార్ యాదవ్ బెస్ట్‌అవార్డులు, బహుమతుల ను అందజేశారు. హైస్కూల్ విద్యార్థిని ప్రియాంక రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనపరిచినందుకు అందే విధంగా వీరికి గైడ్ టీచర్‌గావ్యవహరించిన టి.సుబ్బారావులను సంతనూతలపాడు హైస్కూల్ హెచ్ఎం ఎం.ప్రమోద, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సదరు అవార్డు అందుకున్న ప్రియాంక తండ్రి చలువాది రాము, తదితరులు పాల్గొన్నారు.

### 30న ఒంగోలు పోలీసు కళ్యాణ మండపం నందు

## జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం సర్వసభ్య సమావేశం

**సంతనూతలపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

ఒంగోలులోని బైపాస్ రోడ్డు నందు గల పోలీసు కళ్యాణ మండపం నందు ఈనెల 30న మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారులు సంఘం అధ్యక్షులు జే.రామ్మూర్తి, వైస్ ప్రెసిడెంట్ షేక్ అల్లాబక్షు, ట్రెజరర్ షేక్ కాశీం సాహెబ్‌లు ఆదివారం నాడు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సీనియర్ పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు తదితరులు సత్కరించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశానికి పలువురు పోలీసుఅధికారులు హాజరు కానున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం సభ్యులు తప్పక హాజరు కావాల్సిందిగా రామ్మూర్తి, అల్లాబక్షు, కాశీంసాహెబ్‌లు కోరారు.

7_7.qxd 12/28/2025 11:50 PM Page 1



## ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రాజెక్టు నిలుపుదలకు మంత్రి స్వామికి వినతి



**సింగరాయకొండ, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
సింగరాయకొండ మండల పరిధిలో జాతీయ రహదారి-16పై కనుమళ్ల నుంచి కలికివాయి వరకు ప్రతిపాదించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రాజెక్టు విస్తరణ పేరిట చేపడుతున్న భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ మూలగుంటపాడు, కనుమళ్ల ,కలికివాయి గ్రామాల ప్రజలు రాష్ట్ర సాంఘిక సంక్షేవశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామికివినతిపత్రంఅందజేశారు.ఆదివారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి నివాసంలో స్వామిని కలిసిన గ్రామస్థులు తమ సమస్యలను వివరించారు. ప్రతిపాదిత ఎమర్జెన్సీ విమాన రహదారి నాసిరకం నిర్మాణంతో చేపడితే విమాన భద్రతకు తీవ్రమైన ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. తీర ప్రాంతమైన ఈ ప్రాంతంలో నీటి వనరులు, వ్యవసాయ భూములు విస్తారంగా ఉండటంతో పాటు పక్షుల సంచారం అధికంగా ఉండటం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.అదనపు భూసేకరణ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, భారీ వ్యయంతో ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సింగరాయకొండలో ప్రతిపాదిత ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని మంత్రిని కోరారు.ఈ అంశంపై స్పందించిన మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా టీడీపీ న్యాయ విభాగం అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు, కరుణాకర రెడ్డి, కామినేని రామమూర్తి, వి. తిరుపతిరావు, నక్కా మురళి, అంబటి శ్రీను, నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నేత సురేష్ తల్లి నాగరత్నంకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఘన నివాళులు



**సంతనూతలపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో ఆదివారం నాడు జరిగిన సంస్కరణ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్ బాబు తల్లి వెంకట నాగరత్నంకు సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాగరత్నం చిత్రపటానికి ఎమ్మెల్యే విజయ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరత్నం కుమారులు సురేష్‌బాబు, శ్రీనివాసరావు, అల్లుడు, కుమార్తెలైన మనపాటి వెంకటరావు, సుజాతలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మాజీ మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, నియోజకవర్గ టీడీపీ టీఎన్‌టీయుసీ అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, చీమకుర్తి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, శీలం రామారావు, మాజీ జడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, ఆలయాల చైర్మన్లు దుంపా సుబ్బారెడ్డి, ఎస్.ఉమామహేశ్వరరావు, నియోజకవర్గ టీడీపీ నాయకులు గొల్లపూడి సుబ్బారావు, వేల్పుల శ్రీనివాసరావు, మద్దిపాడు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు దుంపా యల్లమందరెడ్డి, బి.శివరామయ్య, ఎస్.శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ నల్లూరి భాస్కరరావు, హనుమంతరావు, హైస్కూల్ కరస్పాండెంట్ బొడ్డు హనుమంతరావు, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కే.గోపికృష్ణ, గుమ్మలంపాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డపాటి చంద్రశేఖర్, సంతనూతలపాడు చెరువు సంఘం అధ్యక్షురాలు మన్నం రంగ నాయకమ్మ, ఎన్ఎస్పీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు నల్లూరి కృష్ణారావు, మంగమూరు సొసైటీ అధ్యక్షులు నల్లూరి నారాయణరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, సీపీఎం నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు బంకా సుబ్బారావు, కాలం సుబ్బారావులు,టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, కొప్పోలు శ్రీనివాసరావు, డి.అనిల్ కుమార్, బి.రమణారావు, ఆర్.రాంబాబు, నల్లగట్ల సుబ్బారావు, బొడ్డు వెంకటరావు, నాదెళ్ళ ఆంజనేయులు, చుండూరు శ్రీనివాసరావు, కరిచేటి శ్రీనివాసరావు, ఈదర విష్ణు, తన్నీరు వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీను,ఎం.చిరంజీవి, నువ్వుల మీరయ్య,ధర్మవరపు శ్రీనివాసరావు, నలమోతు శ్రీనివాసరావు, పాతూరి రాంబాబు, పుట్టా సాంబశివరావు, పి.కుబేంద్రరావు, కే.శ్రీనివాసరావు, నల్లూరి రూప్సీ,కోలి కోటేశ్వరరావు, ఎస్.కొండలరావు, వేజెళ్ళయ్య, కట్టా సుబ్బారావు, నేతి రాజేష్, సొసైటీ డైరెక్టర్ ఎం.రాముకృష్ణారెడ్డి, టీడీపీ నేత నలమాల్లు సుబ్బారెడ్డి, మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, పలువురు అధికారులు,గ్రామస్తులు పాల్గొని సురేష్‌బాబు తల్లి వెంకట నాగరత్నంకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

### జిల్లా సిమెంట్, ఐరన్ వెల్డర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా కందుల శ్రీనివాసరావు



**సంతనూతలపాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా సిమెంట్ అండ్ ఐరన్ వెల్డర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గుంటూరు రోడ్డులోని గోల్డెన్ వెన్యూ హాల్లో ఆదివారం నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. ఈ నూతన కమిటీ జిల్లా అధ్యక్షునిగా కందులశ్రీనివాసరావు (ఒంగోలు) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బిజ్జం వెంకట కృష్ణారెడ్డి(అద్దంకి) సెక్రటరీగా కుంభా శంకర్(ఒంగోలు) కోశాధికారిగా బొలినేని శ్రీనివాసరావు (ఒంగోలు) సంయుక్త కార్యదర్శి మోరా రవికుమార్ రెడ్డి(కనిగిరి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గౌరవఅధ్యక్షులుగా ఒగ్గిశెట్టి నరసింహం (పరుచూరు),బత్తినేని తిరుపతిస్వామి(ఒంగోలు),బొగ్గవరపు నరసింహారావు (కందుకూరు),బొంతల వెంకటసుబ్రహ్మణ్యం(పామూరు),యక్కల చెంచయ్య(మార్కాపురం), సాయిన ఆంజయ్య(ఒంగోలు) గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

### జాతీయ మారథాన్ పోటీలకు ఎంపికైన నల్లగుంట్ల విద్యార్థి





**కొమరోలు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
ఈ నెల 24న ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్16 మారథాన్ పోటీల్లో నల్లగుంట్లకు చెందిన షేక్ నాయబ్ రసూల్ తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న నాయబ్ రసూల్ జిల్లా నుంచి పాల్గొన్న ఎనిమిది మంది టీంలో తృతీయ స్థానం సాధించారు. నల్లగుంట్లలోని సాధారణ కుటుంబంలో పుట్టిన ఈయన కళాశాలలో ఎటువంటి వ్యాయామ శిక్షణ లేకున్నా గ్రామంలోని ప్రభుత్వ రహదారిపై సాధన చేసి ఈ పోటీల్లో పాల్గొన్నారు. జనవరి నెల 28న జార్ఖండ్‌లో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చాటాలని ఆసక్తిగా ఉందని పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

### - మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

**పొదిలి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
మర్రిపూడి మండలం తంగెళ్ల గ్రామం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పరామర్శించారు. తంగెళ్ల గ్రామానికి చెందిన మృతుడువేవిడ్ కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. గాయాలైన గుల్లసముద్రం గ్రామానికి చెందిన కొల్లానాగార్జున శివారం హైదరాబాద్‌లో మృతిచెందాడు. పోస్టుమార్టం కోసం పొదిలి వైద్యశాలకు తరలించిన మృతదేహాన్ని పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. వీరితో పాటు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఉన్నారు. అనంతరం పొదిలి ప్రభుత్వ వైద్యశాలను మంత్రి స్వామి తనిఖీ చేశారు. మృతి చెందిన రెండు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వీరితో పాటు టీడీపీ నాయకులు ఉన్నారు.





### ఎస్సై వెంకట రమణయ్యను సన్మానించిన దోర్నాల కిరాణా ఫ్యాన్సీ అసోసియేషన్ నాయకులు



**పెద్దదోర్నాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల నూతన ఎస్సై ఎస్.వెంకట రమణయ్యను కిరాణా ఫ్యాన్సీ అసోసియేషన్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకొని స్వాగతం పలికి సన్మానించారు. సందర్భంగా శాంతి భద్రత పరిరక్షణలో తమ వంతు సహకారం అందజేస్తామని దోర్నాల కిరాణా ఫ్యాన్సీ అసోసియేషన్ ప్రెసిడెంట్ యక్కలి యోగి వెంకట నారాయణ, సెక్రటరీ మొగిలి గుప్త, మొగిలి లక్ష్మీ నారాయణ, రావి కింది సుబ్బారావు, నాగేళ్ల వెంకటేశ్వర్లు(వెంకీ), ఎక్కలి వాసు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు ఇంటింటి ఆహ్వానం

### - టీడీపీ అధ్యక్షుడు ఫిరోజ్ పిలుపు



**కనిగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 20 వార్డుల అధ్యక్షులు, కేఎస్ఎస్ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా శక్తి టీం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నాయకులతో కలిసి నూతన సంవత్సర వేడుకలకు రావాలని ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ ఆదివారం తెలిపారు. ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హెచ్ఎంపాడు రోడ్డులోని ఎకో ఫారెస్ట్ పార్కులో నిర్వహించనున్న వేడుకలకు పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలను ఆహ్వానించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించడమే లక్ష్యమని ఫిరోజ్ తెలిపారు.

## నూతన సంవత్సర వేడుకలకు ఇంటింటి ఆహ్వానం

### - కనిగిరిలో టీడీపీ విస్తృత ప్రచారం



**కనిగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి మండలంలోని 25 వార్డుల అధ్యక్షులు కేఎస్ఎస్ సభ్యులు, క్లస్టర్ యూనిట్, బూత్ స్థాయి నాయకులు, రాష్ట్ర, జిల్లా నియోజకవర్గం అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా శక్తి టీం, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కూటమి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. రానున్న 01-01-2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హెచ్ఎంపాడు రోడ్డులోని ఎకో ఫారెస్ట్ పార్కులో నిర్వహించనున్న కార్యక్రమాలకు పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ప్రజల విస్తృత భాగస్వామ్యంతో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించడమే లక్ష్యమని కొండా కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## ఆటపాటలతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

**సీఎస్‌పురం, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోని టీచర్ కేంద్రంలో ఆట పాటలతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ వెలిగండ్ల సీడీపీవో షేక్ ఆషాబేగం అన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ స్కూల్ పిల్లలు వారి తల్లిదండ్రులను సమావేశపరిచి పూర్వ ప్రాథమిక విద్య, దాని యొక్క ప్రాముఖ్యత గురించి సీడీపీవో వివరించారు. పిల్లల్లో మేధాభివృద్ధి చాలా వేగంగా జరుగుతుంది కనుక వారికి ఆటపాటలతో కూడిన విద్య చాలా అవసరం. అంగన్‌వాడీ కేంద్రాలలో అన్ని రకాల సదుపాయాలు కల్పించి పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు విధిగా ప్రీ స్కూల్ పిల్లలను అంగన్‌వాడీ బాట పట్టించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే.దేవకృపావరం, సరళారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**కురిచేడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
కురిచేడు మండల యూటీఎఫ్ నూతన కమిటీ ఆదివారం నాడు ఎన్నుకోబడింది. ఇందులో గౌరవ అధ్యక్షులుగా షేక్ ఖాదర్ వలి, అధ్యక్షులుగా అన్నెం శ్రీనివాసులురెడ్డి,అసోసియేటెడ్ అధ్యక్షులుగా బి.జాన్ బాబు, ఉపాధ్యక్షురాలుగా హెల్డ నైటెంగెల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు,కోశాధికారిగా బి.మణి కుమార్, గౌరవ సలహాదారులుగా ఏ.సింగరయ్య, బి.లక్ష్మయ్యలు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. నూతన కమిటీని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, ఎం.శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారాన్ని చేయించారు.

## కందిపైనే ఆశలన్నీ..



**కురిచేడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
మండలంలో మెట్ట పంటలపైనే ఎక్కువ సాగు జరుగుతుంది. ఈ క్రమంలో మెట్ట పంటలైన పత్తి, పొగాకు, తదితర పైర్లు ఈ ఏడాది మొంథా తుఫాన్ దెబ్బకు భాగా దెబ్బతిని పోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కానీ మొంథా తుఫాన్ అనంతరం కంది పైరు మాత్రం ఊహించని విధంగాఏపుగా పెరిగి నిండుగా పూత పూసి ఆశాజనకంగా కనిపిస్తుంది. అంతే కాక ఈ ఏడాది పొగాకు నాటేందుకు ఎక్కువ అనుమతి ఇవ్వకపోవడంతో కంది సాగే ఎక్కువగా ఉంది. ఆ పైరు సైతం ప్రస్తుతానికి ఆశాజనకంగా ఉండడంతో రైతులు కందిపైనే ఆశలు పెట్టుకుని ఒకింత ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## ఉపాధ్యాయులను వేదించే కార్యక్రమాలను తగ్గించాలి



**దర్శి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
ఒంగోలు నందు టీటీడీ కళ్యాణ మండపంలో 51వ యూటీఎఫ్ ప్రకాశం జిల్లా కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే అబ్దుల్ హై అధ్యక్షతన జరిగింది. ఈ కౌన్సిల్ భావితరాల ఉద్యమానికి పిలుపునిస్తూ వచ్చే నెలలో ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కుల సాధన కొరకు ఉద్యమ కార్యచరణకు తీర్మానం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఉపాధ్యాయులను వేదించే కార్యక్రమాలు తగ్గించాలని యూటీఎఫ్ పక్షాన డిమాండ్ చేశారు. దర్శి డివిజన్ జిల్లా కార్యదర్శులుగా రెండవ సారి మీనిగ శ్రీను, టి.రాజశేఖర్‌లు, రాష్ట్ర కౌన్సిలర్‌గా జి.కోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఆర్.శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులుగా పి.కాశీం,కుటుంబ సంక్షేమడైరక్టర్‌గా జి.విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## సీవీ రామన్, మేడంక్యూరీ ప్రతిభ పురస్కారం పొందిన ఉపాధ్యాయులు ఐజాక్ బాబు



**పొదిలి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
రాష్ట్రస్థాయిలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులకు కేవీఆర్, జయలక్ష్మి ట్రస్టు ఆధ్వర్యంలో సీవీ రామన్, మేడం క్యూరీ ప్రతిభ పురస్కారాన్ని మర్రిపూడి మండలం కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు గుంటూరి ఐజాక్ బాబుకు ప్రతిభ పురస్కారాన్ని అందించారు. గుంటూరులో ప్రతిభా పురస్కారాలు ఉత్సవంలో మాజీ ఎమ్మెల్సీ కే.లక్ష్మణరావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

## నేడు వెలిగండ్లలో ఉచిత కంటి వైద్య శిబిరం

**పొదిలి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
కొనకనమిట్ల మండలంలోని వెలిగండ్లలో మార్కాపురం ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయులు దోర్నాల కొండారెడ్డి తెలిపారు. తన తండ్రి నందిపాలెం మాజీ సర్పంచ్ దోర్నాల వెంకటరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలతో పాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు.

## కెల్లంపల్లిలో సందడి చేసిన హీరోయిన్ శ్రీలీల

### - పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీలీల

### - షటిల్ ఆడిన శ్రీలీల - పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న శ్రీలీల







**ముండ్లమూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**
మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో తెలుగు సినిమాల్లో మంచి పేరు తెచ్చుకున్న హీరోయిన్ శ్రీలీల సందడి చేసింది. వాళ్ల తాతగారైన క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరు నాగేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా వారి సొంత గ్రామం అయిన మండలంలోని కెల్లంపల్లి గ్రామంలో నిర్వహించగా,ఈ కార్యక్రమానికి హీరోయిన్ శ్రీలీల హాజరైంది. కాసేపు వాళ్ల తాతగారు గ్రామంలో బంధువుల తోటిగ్రామస్తుల తోటి ముచ్చటించి గ్రామస్తులందరూ సెల్ఫీలు దిగారు. అనంతరం దేవుని గుడిలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని కొంత సేపు బంధుమిత్రులతో షటిల్ ఆడింది. వాళ్ళ తాత నిడమానూరు నాగేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి వాళ్ళ తాతకి తినిపించడం జరిగింది. అనంతరం చుట్టు పక్కల గ్రామాలు ఉల్లగల్లు, ముప్పరాజువారిపాలెం,చుట్టు పక్కల గ్రామస్తులు శ్రీలీలని చూడటానికి భారీగా తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో వారి బంధుమిత్రులు నిడమానూరి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానానికి అష్టలక్ష్మి వెండి బిందె విరాళం



**మార్కాపురం, డిసెంబరు 28,ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని గ్రామదేవత శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారికి భక్తులు విశేష విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన నూకల మురళీకృష్ణ, సుజాత దంపతులు రూ.1.24లక్షల విలువైన వెండి అష్టలక్ష్మి చెంబు (బిందె)ను భక్తి భావంతో దేవస్థానానికి బహూకరించారు. ఈ వెండి అష్టలక్ష్మి బిందెను దేవస్థానం కార్యాలయ నిర్వహణ అధికారి ఈదుల చెన్నకేశవరెడ్డికి అధికారికంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు దేవులపల్లి పవన్ కుమార్ శర్మ, ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే దేవస్థాన సిబ్బంది వెన్న శ్రీధర్‌రెడ్డి, శివ రంగనాయకులు హాజరయ్యారు. భక్తుల సేవాభావానికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.ఈ తరహా విరాళాలు ఆలయ ఆభరణాలు,పూజాసామగ్రి అభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

### జిల్లా ప్రకటనకు కృతజ్ఞతగా డ్రైవర్స్ కాలనీలో చంద్రన్నకు పాలాభిషేకం

### - మార్కాపురం అభివృద్ధికి చంద్రన్న తీసుకున్న నిర్ణయం చారిత్మాత్మకం

#### - శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి



**మార్కాపురం, డిసెంబరు 28, ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ నందు మార్కాపురాన్ని నూతన జిల్లాగా ప్రకటించిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతగా కృతజ్ఞత సభ, పాలాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కల నెరవేరిందని తెలిపారు. జిల్లా ఏర్పాటు వల్ల పరిపాలన మరింత సులభతరం అవుతుందని, ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మార్కాపురం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని అభివర్ణించారు. కార్యక్రమంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, నినాదాలతో కాలనీ ప్రాంతం మార్మోగింది. అనంతరం ప్రజలు, నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం శాంతియుతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

### ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఖచ్చితంగా చేదించే నైపుణ్యం పొందాలి





**చీమకుర్తి,డిసెంబర్ 28,ప్రభాతవార్త**
పోలీసులు తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పూర్తి స్థాయి పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు కోరారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఫైరింగ్ సాధన ప్రక్రియలో భాగంగా చీమకుర్తి మండలం పల్లామల్లి పరిధిలోని జిల్లా ఫైరింగ్ రేంజ్ లో పోలీసు అధికారులకు నిర్వహించిన వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ సెషన్ ను ఆదివారం జిల్లా ఎస్పీ సందర్శించారు. అక్కడ జరుగుతున్న ఫైరింగ్ ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఫైరింగ్ సాధన ప్రక్రియలో జిల్లా ఎస్పీ పాల్గొని, ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న అధికారుల్లో ఉత్సాహం, మనోధైర్యాన్ని నింపారు. ఈ ఫైరింగ్‌లో ప్రతి అధికారి తప్పనిసరిగా పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలని, ఫైరింగ్‌కు సంబంధించి ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యత వహిస్తుందని, ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు అత్యంత జాగ్రత్తగా, ఏకాగ్రతతో ఫైరింగ్ చేయాలన్నారు. ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఖచ్చితంగా చేదించే నైపుణ్యం పొందాలని సూచించారు.కొత్తగా వచ్చిన ఆయుధాలపై పూర్తి స్థాయి తర్ఫీదు పొందుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల, ప్రభుత్వ ఆస్తుల, ధన మరియు ప్రాణాల రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అత్యంత కీలకమని, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి జిల్లా పోలీసుశాఖ ఉన్నతి సాధనలో ఎల్లప్పుడూ ముందడుగు వేయాలని సూచించారు.ఫైరింగ్‌లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను అభినందించి, రివార్డ్స్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దర్శి డీఎస్పీ లక్ష్మి నారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి. వి.రమణ కుమార్, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, డిటిసి డిఎస్పీ జి.గురునాథబాబు, ఎఆర్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, సీఐలు,ఆర్ఐలు,ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వాజపేయికి ఘన నివాళులు



**చీమకుర్తి,డిసెంబర్ 28,ప్రభాతవార్త**
భారతరత్న మాజీ ప్రధానమంత్రి మాన్యశ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి 100వ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈరోజు రామతీర్థం లోని కమ్మవారి సత్రం నందు సంతనూతలపాడు నియోజకవర్గ కార్యకర్తల అటల్ సుశాసన్ సమ్మేళన్ కార్యక్రమం బిజెపి ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు గుండా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి ప్రకాశం జిల్లా అధ్యక్షులు సగం శ్రీనివాసరావు మాట్లాడుతూ మన మాజీ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్పేయి మన దేశానికి తన పదవీకాలంలో బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. దానిని వారసత్వంగా మన ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నారని సవివరంగా విశదీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లాప్రధాన కార్యదర్శి శ్రీ అమర సింహం, ప్రకాశం జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు తీగల సత్యవతి,చీమకుర్తి మండల పట్టణఅధ్యక్షులు బొడ్డు శంకరరావు, సంతనూతలపాడు మండల అధ్యక్షులు బాలినేని కళ్యాణ్ రెడ్డి, సంతనూతలపాడు మండల అధ్యక్షులు కోర్రా నాగేశ్వరరావు, లక్ష్మి, నగేష్ బాబు, సంఖ్య సుబ్బారావు, తెల్ల మేకల శ్రీనివాసరావు, బొడ్డపాటి వెంకటేశ్వర్లు హాజరై వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# 'టీ' తో ఆత్మీయ పలకరింపులు

## - పార్టీ బలోపేతానికి దద్దాల నారాయణ యాదవ్ స్పష్టమైన సందేశం



**కనిగిరి, డిసెంబర్28, ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీని గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం పార్టీ శ్రేణులతో ఆత్మీయంగా ముచ్చటించారు. కనిగిరి మున్సిపాలిటీలోని 1వ వార్డు గార్లపేట రోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ స్నేహపూర్వకంగా మాటామంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజల విశ్వాసం, కార్యకర్తల ఐక్యత వంటి అంశాలపై దద్దాల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఐక్యతే పార్టీ బలం, క్రమశిక్షణే విజయానికి మార్గం అని పేర్కొన్న ఆయన, ప్రజల నమ్మకమే పార్టీకి పునాదని స్పష్టం చేశారు. సాధారణ ప్రజల మధ్యే కూర్చుని, నాయకులు– కార్యకర్తలతో సమానంగా మాట్లాడడం ద్వారా పార్టీకి ప్రజలకు మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను కార్యకర్తల నుంచి తెలుసుకున్న దద్దాల నారాయణ యాదవ్, వాటి పరిష్కారానికి పార్టీ తరుపున తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సమస్యలు ఉంటే నిస్సంకోచంగా చెప్పాలని, వాటిని సమిష్టిగా పరిష్కరించడమే వైఎస్సార్‌సీపీ విధానమని తెలిపారు. టీ కప్పు చుట్టూ సాగిన ఈ చర్చలు పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయని కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రజల పట్ల నిబద్ధత, పార్టీ పట్ల అంకితభావంతో ముందుకు సాగితేనే వైఎస్సార్‌సీపీ మరింత బలంగా నిలుస్తుందని ఈ సమావేశం స్పష్టంగా చాటిచెప్పింది.

## నల్లబోతుల నారాయణకు నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల





**కనిగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణం 1వ వార్డు రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న నల్లబోతుల నారాయణ అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నల్లబోతుల నారాయణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, పోలిచర్ల రహీంభాష, నల్లబోతుల చిరంజీవి, మితికాల వెంకట్, ఈర్ల శ్రీను, పురుషొత్తం, కాజా, తోక బ్రహ్మయ్య, హరి, నర్సింగ్, లక్ష్మయ్య, పుట్టా నాగబాబు, కంటూ కేశవ, మోటు, శ్రీకాంత్, బాలకృష్ణ, రవి, రాజీవ్ నగర్ యూత్ ఫోర్స్ సభ్యులు తదితరులు పాల్గొని మృతునికి నివాళులర్పించారు.

## క్రీడా స్ఫూర్తికి నిదర్శనం.. యేరువారిపల్లిలో క్రికెట్ టోర్నమెంట్





**కనిగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని యేరువారిపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ క్రీడా స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. గ్రామ యువత ఉత్సాహంగా పాల్గొన్న ఈ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసి క్రీడాకారులను అభినందించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న యేరువారిపల్లి మాజీ ఎంపీటీసీ, వైసీపీ సీనియర్ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రతి క్రీడాకారుడు వాటిని స్పోర్టివ్‌గా స్వీకరించాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని జట్లను ఆయన అభినందించారు. ఈ క్రికెట్ పోటీలలో ప్రధమ బహుమతిని యేరువారిపల్లి జట్టు, ద్వితీయ బహుమతిని సీఎంఆర్ జట్టు, తృతీయ బహుమతిని బస్టాండ్ బ్లాస్టర్స్ జట్టు గెలుచుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేసిన అనంతరం క్రీడాకారులతో కలిసి నాయకులు ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో యేరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, ఏరువ చిన్నపురెడ్డి, యేరువారిపల్లి వైసీపీ పార్టీ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, మైనార్టీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ కాశీం, గొట్టం రాములు, వీరంరెడ్డి లక్ష్మీరెడ్డి, వీరంరెడ్డి సుభారెడ్డి, కనిగిరి మండలం వాలంటీర్ విభాగం ఉపాధ్యక్షుడు ఆటో జగన్‌తో పాటు బాబు, వలి, బంటి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ అవిష్కరణ





**అద్దంకి , డిసెంబరు 28,ప్రభాతవార్త**

అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 2026 ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5 గంటలకు దక్షిణ అద్దంకి పట్టణంలోని షిరిడి సాయిబాబా కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత, కళా మిత్ర జాతీయ పురస్కార గ్రహీత, అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం పూర్వాధ్యక్షులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి జాతీయ పురస్కారం అందుకున్న శుభ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి అద్దంకి సీమ బ్రాహ్మణ పెద్దలు,సంఘ బాధ్యులు, కార్యవర్గసభ్యులు, విశేష సంఖ్యలో బ్రాహ్మణ బంధువులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సాహిత్య, విద్యా, సామాజిక సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ గౌరవాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు శ్రీపతి రంగనాథాచార్యులు అధ్యక్షత వహించగా, సంఘ కార్యవర్గంసభ్యులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ,సేవా సంఘ పెద్దలు దివాకర్ దత్తు, పివిఎం సత్యనారాయణ, లక్కరాజు శ్రీనివాసరావు, పూర్వాధ్యక్షులు జమ్మలమడక హనుమంతరావు, వారణాసి రఘురామశర్మ, ప్రసన్నాంజనేయ స్వామిదేవస్థానం పాలక మండలి సభ్యులు గొర్రెపాటి పద్మజ, లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన పాలకమండలి సభ్యులు కస్తూరిలక్ష్మీ ప్రసూన, కస్తూరి పద్మనాభ శర్మ, మేడూరు జానకిరామ్ ,ఆడిటర్ శర్మ, ధర్మవరపు శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నేడు చింతలపూడి పర్యటన వివరాలు



**అద్దంకి, డిసెంబరు 28, ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పంగులూరు మండలంలోని చందలూరి గ్రామంలో పెంట్యాల వెంకట సుధాకర్ దశదిన కార్యక్రమంలో పాల్గొంటారు. అదే విధంగా సాయంత్రం 4 గంటలకు బల్లికురవ మండలం గొర్రెపాడు గ్రామ వైసిపి నాయకులు భవనం శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తారని పార్టీ కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.

# మండలంలో వైసీపీకి ఎదురు దెబ్బ

## - వైసీపీకి చెందిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ సహా పలువురు ముఖ్య నాయకులు టీడీపీలో చేరిక



**వెలిగండ్ల, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

మండలంలో వైసీపీకి ఎదురు దెబ్బ తగిలింది. వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ ముఖ్య నాయకత్వానికి సన్నిహితులుగా మెలిగిన ఎంపీపీ వైస్ ఎంపీపీ సహా పలువురు ముఖ్య నాయకులు వైసీపీని వీడి స్థానిక ఎమ్మెల్యే జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామణ మహాలక్ష్మీ, వైస్ ఎంపీపీ ఎర్రబోయిన భారతి, మాజీ జడ్పీటీసీ సభ్యులు రామణ తిరుపతిరెడ్డి, కొటాలపల్లి సర్పంచ్ రామణ భాస్కర్‌రెడ్డి, వైసీపీ ముఖ్య నాయకులు ఎర్రబోయిన నాగూర్ యాదవ్ సహా కొటాలపల్లి, అగ్రహారం గ్రామాలలోని వైసీపీ పార్టీకి చెందిన పలువురిని ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే సమర్థవంతమైన నాయకత్వం ద్వారానే సాధ్యమవుతుందని నమ్మకంతో తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ బీరం వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి మీనిగ కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఛలో విశాఖకు శ్రామికులు పెద్ద ఎత్తున తరలి రావాలి

## - సీఐటీయూ జిల్లా కార్యదర్శి పిలుపు



**అద్దంకి , డిసెంబరు 28, ప్రభాతవార్త**

శ్రామిక సమరగళం వినేందుకు గొంతు కలిపి సమరశంఖం పూరించేదుకు ఊరూ వాడ శ్రామికులు, కార్మికులు చలో విశాఖకు తరలి రావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి హెచ్ మజుందర్ పిలుపు నిచ్చారు. విశాఖలో జరిగే సీఐటీయూ జాతీయ మహాసభల ప్రచారజాత కార్యక్రమం లో భాగంగా స్థానిక బస్టాండ్ సెంటర్ లో ఆర్టీసీ కార్మికులకు, ఆటో కార్మికులకు, తోపుడు బండ్ల కార్మికులకు కరపత్రాలు పంచుతూ జనవరి 4న విశాఖ లో జరిగే కార్మికుల బహిరంగ సభకు భారీగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల కోసం, ప్రజా సమస్య ల పరిష్కారం కోసం ఎన్నుకున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ ల సేవలో తరించి పోతున్నాయని, ప్రజల ఆస్తులను, హక్కులను హరిస్తూ కార్పొరేట్ లకు ఊడిగం చేస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. ఉన్న హక్కులను కాపాడుకోవడానికి, కార్పొరేట్ లూటిని అడ్డుకోడానికి సీఐటీయూ ఐక్య ఉద్యమాలకు సారధ్యం వహిస్తుందని ఈ సందర్భంగా విశాఖలో సీఐటీయూ జాతీయ మహాసభ లు ఐదురోజుల పాటు జరుగుతున్నాయని దేశావ్యాపితంగా అన్ని రంగాలలో వస్తున్న మార్పులని సమీక్షించి భవిష్యత్తు ఉద్యమాలను నిర్మించడానికి ఈ మహాసభ లు జరుగుతున్నాయని అందులో భాగంగా జనవరి 4న జరిగే బహిరంగ సభ ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు పి తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ప్రచారకార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు వసంతరావు, బి రేఖఎలిజిబెత్, వై సింగయ్య, బి.లత, తంగిరాల వెంకటేశ్వర్లు, మునిసిపల్, ఆర్టీసీ, ఫ్రూట్ వెండర్స్ కార్మికులు పాల్గొన్నారు.

# శర్వాణి బయో ఫ్యూయల్స్‌ను ప్రారంభించిన పెద్దిరెడ్డి



**కొరిశపాడు , డిసెంబరు 28, ప్రభాతవార్త**

మండలంలోని తమ్మవరం గ్రామంలో 270 కోట్ల వ్యయంతో నిర్మించిన బయో ఫ్యూయల్స్ ను ఆ పరిశ్రమ చైర్మన్ ఆదివారం ఉదయం ప్రారంభించారు ముందుగా అనుకున్న ప్రకారం ముఖ్య అతిథులైన జిల్లా కలెక్టర్ కె వినోద్ కుమార్ ఎస్పీ ఉమామహేశ్వర్లు అనివార్య కారణాల వలన ప్రారంభోత్సవానికి రాలేకపోయారు పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఉదయం పదిన్నర గంటలకు తన మనుమడైన ఇక్ష్వాక్‌తో రిబ్బన్ కట్ చేయించారు. అనంతరం ఆయన ప్రారంభోత్సవానికి వచ్చిన అతిథులతో మాట్లాడుతూ తాను తన బంధుమిత్రుల సహకారంతో ఇంతటి పెద్ద పరిశ్రమను ఈ గ్రామంలో ఏర్పాటు చేశానన్నారు మొక్కజొన్న పంట పండించే రైతులు ఎటువంటి దళారులు లేకుండా నేరుగా తమ ఫ్యాక్టరీ వద్దకు వచ్చి మంచి ధరకు అమ్ముకోవచ్చు అన్నారు తాము మొక్కజొన్న బియ్యపు నూక లను ముడిసరుకుగా ఉపయోగించి ఇథనాల్ ను పలు ఉత్పత్తులను పర్యావరణహితంగా తయారు చేస్తామన్నారు కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాంటి ఫ్యాక్టరీలను నిర్మించి దేశంలో ఇథనాల్ ఉత్పత్తిని పెంచి పెట్రోల్ డీజిల్ వాడకం తగ్గించాలని నిర్ణయించిందన్నారు అంతేకాక విదేశాల నుంచి పెట్రోల్ డీజిల్ దిగుమతులను తగ్గించుకోవడం వలన వేలకోట్ల విదేశీమారకద్రవ్యం కూడా ఆదా చేయాలనుకుంటున్నారు ఆ మార్గదర్శకాలను అనుసరించి తాము ఈ పరిశ్రమను తమ్మవరం గ్రామంలో నిర్మించామన్నారు కనుక ఈ గ్రామ ప్రజలే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు కూడా తమకు సహకరించి తమ పరిశ్రమ అభివృద్ధికి సహకరించాలని కోరారు అనంతరం వేలాదిగా వచ్చిన అతిధులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ ప్రారంభోత్సవంలో ఆయనతోపాటు ఆయన కుమారుడు జయదీప్ వైస్ ప్రెసిడెంట్ సోమనాథ్ చౌదరి రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ కే ప్రభాకర్ రెడ్డి కెనరా బ్యాంక్ ఏజీఎం లు అనుపమ ఆనంద్ మేదరమెట్ల గ్రామ ప్రముఖులు మన్నె రామారావు పరిసర గ్రామాల నాయకులు మొరవినేని ప్రభాకరరావు రామిరెడ్డి ఆంజనేయులు కరిచేటి రాంబాబు జంపు హరిబాబు ఎడం భవానీ ప్రసాద రెడ్డి చింబోతుల సత్యనారాయణ తదితరులతోపాటు పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డి బంధువులు మిత్రులు ఆయన అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉత్తమ కార్యకర్తగా పైడిమర్రి శ్రీనివాసులు(ఐటీసీ శ్రీను)కి ఘన సత్కారం



**కనిగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేషన పంపిన ప్రశంసా పత్రం, మెమోంటో ను 17వవార్డు,136వబూత్ అధ్యక్షుని గా సేవలందించినందు కు గాను ఉత్తమ కార్యకర్తగా గుర్తింపు పొందిన పైడిమర్రి శ్రీనివాసులు(ఐటీసీ శ్రీను)కు అందజేశారు. 17వ వార్డులో పార్టీ కార్యకర్తలు,ప్రజల అవసరాలను గుర్తించి వాటిని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండి, సమస్యలను అత్యంత వేగంగా పరిష్కరించడంలో పైడిమర్రి శ్రీనివాసులు కీలక పాత్ర పోషిస్తున్నాని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశంసించారు. నిరంతరం ప్రజల మధ్య ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ గుర్తించి ప్రోత్సహించడం హర్షణీయమని నాయకులు తెలిపారు. ఈ క్యాక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా సరిహద్దులో పెద్ద ఎత్తున వాహనాలు తనిఖీ

## - అద్దంకి సి.ఐ. ఆధ్వర్యంలో నాకా బందీ





**అద్దంకి , డిసెంబరు 28,ప్రభాతవార్త**

పోలీసులు నాకా బందీ కార్యక్రమంలో భాగంగా జిల్లా సరిహద్దులలో పెద్ద ఎత్తున వాహనాలను తనిఖీ చేశారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం ప్రకాశం, బాపట్ల జిల్లా సరిహద్దు అయిన అద్దంకి మండలం తిమ్మాయిపాలెం సమీపంలో దర్శి, అద్దంకి రహదారిపై వాహనాల తనిఖీని నిర్వహించారు. పట్టణ సి.ఐ. సుబ్బరాజు ఆధ్వర్యంలో పలువురు పోలీస్ సిబ్బంది, ఆ రహదారిలో ప్రయాణించే ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించారు. నాకా బందీలో భాగంగా ఈ తనిఖీలను నిర్వహించారు.

# కురిచేడును ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలి



**కురిచేడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

జిల్లాల పునర్విభజనలో భాగంగా కురిచేడు మండలాన్ని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని కురిచేడు తెలుగుదేశం పార్టీ మండల శాఖ కోరింది. కురిచేడులో ఆదివారం ఈ పార్టీ మండల శాఖ కన్వీనర్ పిడతల నెమిలయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల కమిటీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజు మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి కురిచేడు మండలాన్ని మార్కాపురం జిల్లాలో కలుపుతున్నట్లు వదంతులు వినిపిస్తున్నాయన్నారు. అయితే తమ మండలాన్ని దర్శి నియోజకవర్గంలో మాత్రమే ఉంచాలని దర్శి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో ఉంచుతున్నందున తమ మండలం సైతం అదే జిల్లాలో కొనసాగాలని మండలంలోని అధిక శాతం ప్రజలు కోరుతున్నట్లు తెలిపారు. అవసరమైతే కురిచేడు మండలాన్ని పల్నాడు జిల్లాలో కలిపినా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. మార్కాపురం వెళ్ళడానికి ఒక్క రైలు సౌకర్యం తప్ప మరే ఇతర రవాణా సౌకర్యాలు సరిగ్గా లేనందున ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తమ సమస్యలను విన్నవిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మొగల్ మస్తాన్‌వలి, గణపర్తి వెంకటేశ్వర్లు, పాపారావు, నాగేశ్వరరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనలో తొలి అడుగు

## - టీడీపీ ఉత్తమ కార్యకర్తలకు మెమోంటోలు, ప్రశంసలు అందజేత





**కనిగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రశంసిస్తూ అందజేసిన ప్రశంసా పత్రాలు, మెమోంటోలను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం అమరావతి మైదానంలో తెలుగుదేశం పార్టీ ఉత్తమ కార్యకర్తలుగా ఎంపికైన వారికి అందజేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జిలకు ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు, మెమోంటోలు అందజేశారు. పార్టీ అభివీద్ధికి కార్యకర్తల కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలన లక్ష్య సాధనలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజా రెహమాన్ షేక్, ఉమర్ షారూక్ హుస్సేన్ షేక్, జాలా వెంకట సద్గురు మూర్తి బొగ్గ, అంజయ్య నీలిశెట్టి, శ్రీనివాసులురెడ్డి వెన్న, రామ్ బాబు చరంచెర్ల, వెంకట శ్రీనివాసులురెడ్డి పైడిమర్రి, సుధీర్ కుమార్ రాచపూడి, వీరనరసింహస్వామి, ఏ.ఆనంద్ సందీప్ దాసరి, ఖాదర్ షేక్, మణికాంత వాల్లేవు, నాగ ప్రసాద్ కొటాటే, భరత్ బట్టుల, ఇలియాజ్ పోలిచెర్ల, బాబతాజుద్దిన్ షేక్, ఏకే జిలాని షేక్, శివన్నారాయణ నాగినేని, అహ్మద్‌భాషాషేక్ ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, మండల అద్యక్షుడు కొండ కృష్ణారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, కనిగిరి నియోజకవర్గ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు షేక్ గయాజ్, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, సహా కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మన్నం త్రిమూర్తులకు పలువురు అభినందనలు



**అద్దంకి , డిసెంబరు 28,ప్రభాతవార్త**

ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అద్దంకి డిపో వారు ప్రతి నెల నిర్వహించే కార్యక్రమంలో భాగంగా అదివారం అద్దంకి పట్టణంలోని చిన్ని శాంతయ్య మినీ ఫంక్షన్ హాల్ నందు ప్రతిభ మూర్తులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమనకు రాజకీయ, సినీ విశ్లేషకులు అన్నమనేని వెంకటరావు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసినారు. ప్రతిభ మూర్తులు మధురాసమృతులు కార్యక్రమమైన సినీ దర్శకులు కె బాలచందర్, సినీ జీవిత విశేషాలు సినీ విశ్లేషకులు రాఘవరావు అరగంటలో బాలచందర్ పూర్తి సినీజీవిత విశేషాలను ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా రాఘవరావు ప్రసంగించారు. అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశంలో కలిపేందుకు, అద్దంకిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు, అద్దంకిలో గ్రంధాలయానికి సొంత భవన నిర్మాణ స్థల సేకరణకై ప్రజలందరిని కలుపుకొని, పోరాట ప్రతిమతో విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ చొరవతో విజయం సాధించిన మన్నం త్రిమూర్తులు పోరాట యోధుడని తను అనుకుంటే చివర వరకు పోరాటంలో రాజీపడే ప్రసక్తే లేని ప్రజా పోరాటయోధుడు మన్నం త్రిమూర్తులు అని వెంకట్రావు అన్నారు. త్రిమూర్తులను విశిష్ట సేవ రత్న పురస్కారంతో ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అద్దంకి వారు గౌరవంగా సత్కరించారు. రోటరీ క్లబ్ సింగరకొండ అద్దంకి, అద్దంకి పట్టణంలోని వివిధ సాహితీ సాంస్కృతిక సేవ సంస్థలు త్రిమూర్తులను శాలువాతో సత్కరించారు. విశిష్ట సేవ రత్న పురస్కారం అందుకున్న మన్నం త్రిమూర్తులు స్పందిస్తూ సమాజంలోని ప్రజా సమస్యల పట్ల స్పందన వాటి పరిష్కారం నా జీవిత లక్షం అని ఈ పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పురస్కారం చెందుతుంది అని, ఎప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారమునకై ప్రజాన్యాయ పోరాటమే పౌరునిగా నా బాధ్యత అని, సమాజం నుండి పొందటమే కాకుండా తిరిగి మనం ఇవ్వాలి అని త్రిమూర్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిహెచ్ కోటయ్య, చప్పిడి వీరయ్య, డాక్టర్ యు దేవ పాలన, నీలం రాజు నాగేశ్వరరావు, గాడేపల్లి దివాకర్ దత్తు, వారణాసి రఘురాంశర్మ, పుట్టమరాజు శ్రీరామచంద్రమూర్తి, పంతంగి ఆంజనేయులు, పి ఎల్ వి నరసింహారావు, మల్లాది శ్రీనివాసరావు, ఎస్ కే రఫీ, ఆర్కే ట్రావెల్స్ రామకృష్ణ, గోవాడశ్రీకాంత్, చేబ్రోలు సుబ్బయ్య, అంజద్ భాష, చెన్నుపాటి రామాంజనేయులు, తాళ్లూరి నాగేశ్వరరావు, చిన్న, నర్రా సుధాకర్ రావు, సీతారామయ్య, సుబ్బయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దేశ భద్రతలో రాజీ లేదు



## 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి చాటిచెప్పాం

### ప్రగతి సంవత్సరంగా నిలిచిన 2025

### దేశ భవిష్యత్తుకు యువతే ప్రధాన బలం

### యువశక్తితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం

### మన్‌కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

### నరసాపురం అల్లికలు ప్రత్యేకంగా ప్రస్తావన



**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీపడబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పునరుద్ఘాటించారు. 'మన్‌కీ బాత్'129వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారు. ఇందులో భాగంగా 2025లో భారతదేశం సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని చెప్పారు. దేశంలోని ప్రతిపౌరుడికి ఈ ఆపరేషన్ గర్వకారణంగా మారిందన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌ను మారుతున్న భారతావనిగా అభివర్ణించి, సైనిక విజయాన్ని దేశవ్యాప్త దేశభక్తిని పెంచిన ఘటనగా ప్రధాని ప్రశంసించారు. ఈ ఏడాది భారత్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చూపిన ధైర్యం, స్వదేశీ ఆయుధాలు, టెక్నాలజీ ఉపయోగం ద్వారా సాధించిన విజయాలను మోడీ ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశం ఉగ్రవాదాన్ని రూపుమాపే నిర్ణయాన్ని చాటిందని, ఇది కేవలం సైనిక చర్య కాదు.. మారుతున్న భారత్ బలాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. నేటి భారత్ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడబోదని ప్రపంచానికి స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చిందని అన్నారు. అంతేకాకుండా, గిర్ అడవుల్లో ఆసియాటిక్ సింహాల సంఖ్య పెరుగుదల, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాలను కూడా ప్రధాని ప్రస్తావించారు.

2025 సంవత్సరం అన్ని రంగాల్లో భారత్ గణనీయమైన ప్రగతిని సాధించిన సంవత్సరంగా నిలిచిందని ప్రధాని తెలిపారు. దేశ భవిష్యత్తుకు యువతే ప్రధాన బలమని, యువశక్తితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని పేర్కొన్నారు. స్టార్టప్‌లు, వ్యవసాయం, ఫిట్‌నెస్ వంటి రంగాల్లో యువత వినూత్న ఆవిష్కరణలతో ముందుకు వస్తోందని, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సరికొత్త టెక్నాలజీ, ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రీడల్లో కూడా ఈ ఏడాది భారత్ గణనీయమైన విజయాలు సాధించిందని తెలిపారు. నూతన సంకల్పాలు, స్పష్టమైన లక్ష్యాలతో 2026లోకి అడుగుపెడుతున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్:2026 జనవరి 12న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ రెండో ఎడిషన్ జరగనున్నదని ప్రధాని తెలిపారు. యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ఎలా పంచుకోవాలో సూచించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇందులో ప్రధాన మంత్రి స్వయంగా పాల్గొననున్నట్లు వివరించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు యువత ఆలోచనలను ఆచరణలోకి తేవడానికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఐఐఎస్‌సీకి చెందిన గీతాంజలి, దుబాయ్‌లోని కన్నడ పాఠశాల, జమ్మూ-కాశ్మీర్ సాంస్కృతిక వారసత్వంవంటి అనేక ప్రేరణాత్మక ఉదాహరణలను ప్రధాని ప్రస్తావించారు.

వందేమాతరం గేయం 150 ఏళ్ల పూర్తి చేసుకున్నప్పుడు కూడా దేశ ప్రజల్లో ఇదే స్ఫూర్తి కనిపించిందని ప్రధాని చెప్పారు. క్రీడలపరంగా కూడా ఈ ఏడాది చిరస్మరణీయమని మోడీ అన్నారు. 12 ఏళ్ల తర్వాత టీమ్‌ఇండియా పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుందని, మహిళల క్రికెట్ జట్టు మొదటిసారి వన్డే ప్రపంచకప్ గెలుచుకుందని తెలిపారు. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్పు గెలుచుకొని చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలోనూ ఈ ఏడాది భారత్ తన ప్రతిభను చాటుకుందని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ఆయన ప్రశంసించారు. మహా కుంభమేళాకు కోట్లాదిమంది తరలివచ్చారని, ఆ సంఖ్యను చూసి ప్రపంచం ఆశ్చర్యపోయిందని ప్రధాని తెలిపారు. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందని చెప్పారు.

ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలను గుర్తుచేశారు. దేశ ప్రజలు స్వదేశీ ఉత్పత్తుల పట్ల గొప్ప ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, వోకల్ ఫర్ లోకల్‌ను మరింత బలోపేతం చేయాలని, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో శుభాంశు శుక్లా సాధించిన విజయాలతో దేశకీర్తి మరింత పెరిగిందని కొనియాడారు. భారతీయ భాషల ప్రోత్సాహానికి ప్రత్యేకంగా తమిళ భాషకు కాశీ తమిళ సంగమం వంటి కార్యక్రమాల ద్వారా జరుగుతున్న కృషిని ప్రధాని ప్రశంసించారు. స్వాతంత్ర్య సమరయోధురాలు పర్బతి గిరి జీకి నివాళి అర్పించారు. యాంటీబయాటిక్స్ దుర్వినియోగంపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఆరోగ్యంపై జాగ్రత్త అవసరమని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ కళాకారులను అభినందించగా, కచ్ వైట్ రణ్ను భారతదేశ సహజ సౌందర్యానికి ప్రతీకగా పేర్కొన్నారు. ప్రజలకృషి, ప్రేరణాత్మక కథలతో భారత్ 2026 లోకి మరింత ఉత్సాహంగా అడుగుపెడుతుందని ప్రధాని నరేంద్ర మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. 2025లో దేశ ప్రజలు ఏ విధంగా ఐక్యతతో సామరస్యంగా ఉన్నారో అదేవిధంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.



# దౌత్యం విఫలమైతే ఇక ఉక్రెయిన్‌పై సైనిక చర్యలే..

## రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరిక

**మాస్కో, డిసెంబరు 28:** ఉక్రెయిన్‌పాలకులకు శాంతియుత మార్గంలో వివాదాన్ని పరిష్కరించుకోవడం ఇష్టం లేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శించారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ దౌత్యం విఫలమైతే ప్రత్యేక సైనిక చర్య తప్పదని, లక్ష్యాలన్నింటినీ బలప్రయోగం ద్వారానే సాధిస్తామని హెచ్చరించారు. పుతిన్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలోనే రష్యా దళాలు ఉక్రెయిన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు తెగబడ్డాయి. రాత్రంతా జరిగిన ఈ దాడుల్లో సుమారు 500 డ్రోన్లు, 40 క్షిపణులను రష్యా ప్రయోగించింది. ఈ భీకర దాడిలో ఒకరు మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. రష్యాకు యుద్ధం ఆపే ఉద్దేశంలేదనడానికి ఈ 10 గంటల విధ్వంసమే నిదర్శనమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలను వెతకడానికి జెలెన్‌స్కీ నేడు అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఫ్లోరిడాలో జరగనున్న ఈ సమావేశంలో భద్రతా హామీలు, వివాదాస్పద ప్రాంతాలపై చర్చించనున్నారు. ట్రంప్‌తో భేటీకి ముందు కెనడా చేరుకున్న జెలెన్‌స్కీ శాంతి స్థాపన కోసం తాము చేస్తున్న ప్రయత్నాలకు రష్యా అడ్డు తగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న దాడులను కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను ఆయన అమానవీయమైనవిగా అభివర్ణించారు. శాంతి స్థాపన జరగాలంటే రష్యా సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ పునర్నిర్మాణం కోసం కెనడా ప్రభుత్వం 2.5 బిలియన్ కెనడియన్ డాలర్ల సుమారు 1.82 బిలియన్ యూఎస్ డాలర్లు భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది.


# పాక్‌తో అమెరికా 'ఖనిజ' బంధం

## యుఎస్ లోకోమోటివ్‌లను కొనుగోలు చేయనున్న పాక్



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** అమెరికా-పాకిస్థాన్ వాణిజ్య బంధం మరింత బలపడుతోంది. ఈ క్రమంలో అమెరికా తన లోకోమోటివ్ రైళ్లను పాక్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతోపాటు పాకిస్థాన్‌లో అరుదైన ఖనిజాల అన్వేషణకు కూడా సమష్టిగా కృషి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పాక్ పత్రిక ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ తన కథనంలో పేర్కొంది. ఈ యేడాది అక్టోబరులో పాక్ ఆర్థికమంత్రిమహమ్మద్ ఔరంగజేబు వాషింగ్టన్‌ను సందర్శించినప్పుడు వీటిపై చర్చలు మొదలయ్యాయి. ఆ తర్వాత నుంచి అమెరికాక ప్రయోజనాలు కల్పించేలా పాక్ అధికారులు చర్చలు చేపట్టారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు సలహాదారు అయిన రేమాండ్ ఎమోరి కాక్స్, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల విషయంలో సలహాదారు అయిన రికీ గిల్ స్వయంగా పాక్‌తో చర్చలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా తయారీ లోకోమోటివ్‌లను పాక్ కొనుగోలు చేయాలని గిల్ కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పాక్ ఆ దేశం తయారీ 55 లోకోమోటివ్‌లను వాడుతోంది. కాకపోతే ప్రస్తుతం పాక్ రైల్వే వద్ద తగినంత నగదు లేదు. స్టార్‌లింక్ ఇంటర్నెట్ అనుమతలను కూడా సానుకూలంగా పరిశీలించాలని కూడా రికీ గిల్ కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో అమెరికన్ కంపెనీలపై పాకిస్థాన్ 5 శాతం డిజిల్ పన్నును కూడా తొలగించింది. ఖనిజాల రంగంలో పెట్టుబడి పెట్టేందుకు అమరికా 135 బిలియన్ డాలర్లను సిద్ధం చేసింది. ఈ క్రమంలో బలోచిస్థాన్‌లోని రెకో డిక్ మైనింగ్ కంపెనీకి 1.25 బిలియన్ డాలర్లను తమ దేశ ఎగ్జిమ్ బ్యాంక్ ద్వారా అమెరికా మంజూరు చేయించింది. ఇక పాకిస్థాన్ ఖనిజాల నిల్వలను గుర్తించే విషయంలో, కృత్రిమ మేధ అభివృద్ధిలో అమెరికా-పాక్ కలిపి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ యేడాది పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికా పర్యటనతో ఇరు దేశాల సంబంధాల్లో భారీ మార్పులు చోటుచేసుకొన్నాయి.

# ప్రపంచంలోనే అత్యంత పొడవైన చేతిరాత బైబిల్



**తిరువనంతపురం, డిసెంబరు 28:** ప్రపంచంలోనే అత్యంత పొడవైన, చేతితో రాసిన బైబిల్ ఆవిష్కరణకు సిద్ధమైంది. ఏకంగా 100కిలోమీటర్ల పొడవున్న ఈ బృహత్తర బైబిల్‌ను కేరళలోని త్రిసూర్‌లో ఆది వారం కార్డినల్ మార్ జార్జ్ కూవక్కాడ్ ఆవిష్కరించనున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి సేక్రేడ్ హార్ట్ ఆఫ్అవర్ లేడీ ఆఫ్ సారోస్ బసిలికా ప్రాంగణం వేదిక కానుంది. 2025 జూబ్లీ ఇయర్ వేడుకలు, త్రిసూర్ బసిలికా శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 2,025 మంది భక్తులు, ప్రతినిధులు కలిసి ఈ బైబిల్‌ను చేతితో రాయడం విశేషం.

# సంక్షిప్తంగా..

## 'సిందూర్' వేళ బంకర్‌లో దాక్కోమన్నారు: పాకిస్థాన్ అధ్యక్షుడు



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే ఈ క్రమంలోనే అక్కడ అగ్ర నాయకత్వానికి వణుకుపట్టినట్లు తెలిసింది. భారత్ ఆపరేషన్ నేపథ్యంలో బంకర్‌లోకి వెళ్లిపోవాలని తమ సైన్యం సూచించిన మాట వాస్తవమేనని పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ అంగీకరించారు. ఇటీవల ఓ బహిరంగ సభలో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. 'మిలటరీ సెక్రటర నా దగ్గరకు వచ్చి ఆపరేషన్ సిందూరు పేరుతో భారత్ దాడులు చాస్తోంది. యుద్ధం ప్రారంభమైంది. బంకర్లోకి వెళ్దాం' అని తనను అప్రమత్తం చేసినట్టు జర్దారీ వెల్లడించారు. అయితే, ఆయన సలహాను తాను తిరస్కరించానని చెప్పారు. పాక్, పిఒకెలలోని సైనిక, ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా చేసుకొని భారత్ సైన్యం మే7న ఆపరేషన్ చేపట్టింది. పలు ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది.

## ఆధ్యాత్మిక యాత్రను పూర్తిచేసిన ఎంపి కంగనా రనౌత్




**సిమ్లా, డిసెంబరు 28:** ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన దశాబ్దకాల ఆధ్యాత్మిక యాత్ర ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 12 జ్యోతిర్లింగాలను ఆమె దర్శించుకున్నారు. భీమశంకర జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవడంతో తన యాత్ర పూర్తయిందని ఆదివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కంగనా తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కొన్ని ఫొటోలను పోస్ట్ చేశారు. సంప్రదాయ దుస్తుల్లో శివలింగానికి పాలాభిషేకం చేస్తూ, పూజల్లో పాల్గొన్న చిత్రాలను పంచుకున్నారు. మహాదేవుడి దయ, నా పూర్వీకుల పుణ్య కర్మల వల్ల ఈరోజు నేను 12 జ్యోతి ర్లింగాల దర్శనాన్ని పూర్తి చేశాను. పదేళ్లకు పైగా సాగిన నా యాత్ర భీమశంకర దర్శనంతో ముగిసింది. మొదట్లో ప్రయాణాల్లో యాదృచ్ఛికంగా దర్శనాలు జరిగాయి. కానీ ఇటీవల గట్టి నిర్ణయం తీసుకుని అన్నింటినీ పూర్తి చేయాలనుకున్నానని కంగనా తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## హిందువుల నిరసనను అడ్డుకున్న ఖలిస్థానీలు



**లండన్,డిసెంబరు 28:** లండన్ లోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బంగ్లాదేశ్‌లో ఇటీవల మైనారిటీ హిందువులపై మూకదాడులు, హత్యలు జరుగుతున్న విషయం తెలిసిందే. హిందువులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడులను నిరసిస్తూ లండన్‌లోని హిందువులు బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. బంగ్లాదేశ్ లోని మైనా రిటీలకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన హిందువులు ఈ నిరసన కార్యక్రమం చేపట్టగా ఖలిస్థానీ వేర్పాటువాదులు దీనిని అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం వద్దకు చేరుకుని భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ భయాందోళనలు సృష్టించారు. ఖలిస్థానీ జెండాలు ఎగురవేస్తూ నినాదాలు చేశారు. రెండు గ్రూపులు పోటాపోటీగా నినాదాలు చేస్తుండడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## మంచు తుపానుతో అమెరికాలో ఎమర్జెన్సీ విధింపు



**న్యూయార్కు, డిసెంబరు 28:** అమెరికాలోని ఈశాన్య ప్రాంతం, గ్రేట్ లేక్స్ పరిసరాల్లో మంచుతుపాను బీభత్సం సృష్టిస్తోంది. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన మంచువర్షం తీవ్ర రూపందాల్చింది. దీనితో ఈశాన్యప్రాంతాల్లోతుపాను అత్యవసరపరిస్థితిని ప్రకటించారు. మధ్యాహ్న సమయానికి అమెరికావ్యాప్తంగా దాదాపు5,580 విమానాలు ఆలస్యంగా నడవగా, కనీసం 860విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ముఖ్యంగా న్యూయార్క్ మెట్రోపాలిటన్ పరిధిలోని మూడుప్రధాన విమానాశ్రయాలపై దీనిప్రభావం తీవ్రంగా పడింది. పరిస్థితి తీవ్రతను గమనించిన న్యూయార్క్, న్యూజెర్సీ గవర్నర్లు ఆయా రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ (అత్యవసర స్థితి) ప్రకటించారు.

## కొడుకు కావాలన్న కోరికతో కూతుర్ని హత్యచేసిన తల్లి

**నవీముంబయి, డిసెంబరు 28:** నవీ ముంబైలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కొడుకు కావాలన్న బలమైన కోరికతో ఓ తల్లి తన ఆరేళ్ల కన్నకూతురిని కిరాతకంగా హత్య చేసింది. సైన్స్ గ్రాడ్యుయేట్ అయిన ఆమెను కళంబోలి పోలీసులు అరెస్ట్‌చేశారు. గురుసంకల్ప్ సొసైటీలో నివసించే సుప్రియా మహాముస్కర్ (30)ఈ నెల 23న తన కుమార్తె మాన్సి(6) అనారోగ్యంతో చనిపోయిందని పోలీసులకు తెలిపింది. పాప మృతిపై అనుమానం వచ్చిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. ఊపిరాడకుండా చేయడంవల్లే చిన్నారి చనిపోయినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలడంతో పోలీసులు హత్య కేసునమోదు చేశారు. అనంతరం సుప్రియను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. కొడుకు పుట్టాలనే కోరికతోనే ఈ దారుణానికి పాల్పడినట్లు ఆమె ఒప్పుకుంది.

# ఖాప్ పంచాయతీ కఠిన నిర్ణయాలు

### 18యేళ్లలోపు వారికి స్మార్ట్‌ఫోన్ నిషేధం

### యువతీయువకులు బయటకు వస్తే షార్టులు, హాఫ్ పాంట్లు నిషేధం

### సామాజిక బాధ్యతలు గుర్తుచేస్తున్న గ్రామపెద్దలు



**భాగ్‌పట్,(యుపి), డిసెంబరు 28:** సామాజిక విలువల పరిరక్షణ పేరుతో ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్ జిల్లాకు చెందిన థాంబా పట్టి మెహర్ దేశ్ ఖాప్ పంచాయతీ పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. యువత దారి తప్పుతోందని, క్రమశిక్షణ లోపిస్తోందని భావించిన ఖాప్ నేతలు విద్యార్థులు, యువత జీవనశైలిపై కఠిన ఆంక్షలు విధించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు స్మార్ట్‌ఫోన్లు వాడటం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గడమే కాకుండా పెద్దల పట్ల అవిధేయత పెరుగుతోందని ఖాప్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. టీనేజర్లకు మొబైల్ ఫోన్లను నిషేధించారు. బహిరంగ ప్రదేశాల్లో అబ్బాయిలు హాఫ్ ప్యాంట్లు, అమ్మాయిలు షార్ట్స్ ధరించకూడదని ఆదేశించారు. అబ్బాయిలు కుర్తాపైజమా, అమ్మాయిలు సల్వార్‌కమీజ్ వంటి సంప్రదాయ దుస్తులే ధరించాలని సూచించారు. ఇంట్లో ఎలాంటి దుస్తులైనా వేసుకోవచ్చని, కానీ బయటకు వచ్చేటప్పుడు మాత్రం సామాజిక నిబంధనలు పాటించాలని హుకుం జారీ చేశారు. కేవలం యువతపైనే కాకుండా వివాహ వేడుకల విషయంలోనూ ఖాప్ పంచాయతీ కీలక మార్పులు సూచించింది. వివాహాలు మ్యారేజ్ హాళ్లలో కాకుండా గ్రామాల్లో లేదా సొంత నివాసాల్లోనే జరుపుకోవాలని పేర్కొంది. మ్యారేజ్ హాల్ కల్చర్ వల్ల కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. పెళ్లి పత్రికల ముద్రణ ఖర్చును తగ్గించేందుకు వాట్సాప్ ద్వారా ఆహ్వానాలు పంపడం ఉత్తమమని స్పష్టం చేశారు. ఖాప్ పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయాలకు రాజకీయ నాయకుల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత చౌదరి యశ్‌పాల్ సింగ్, ఆర్ఎల్‌డీ ఎంపీ రాజ్‌కుమార్ సాంగ్వాన్ ఈ నిర్ణయాలను సమర్థించారు. సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడేందుకు ఇటువంటి నిర్ణయాలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ నియమాలను ఉత్తరప్రదేశ్ అంతటా అమలు చేసేందుకు ఇతర ఖాప్ కౌన్సిళ్లతో కూడా చర్చలు జరుపుతామని ఖాప్ ప్రతినిధులు తెలిపారు.

# పెళ్లికాకుండానే గర్భం దాలిస్తే రూ.38 వేలు జరిమానా

## చైనాలోని యునాన్ గ్రామపెద్దల కఠిన కార్యాచరణ



**యునాన్(చైనా)డిసెంబరు 28:** నగరాలలో నాగరికత పేరుతో సహజీవనం, వివాహానికి ముందే గర్భం దాల్చడం, ప్రేమ పెళ్లిళ్ల సాధారణంగా మారిపోయాయి. ఇలాంటి వ్యవహారాలను తమ గ్రామంలోకి అడుగుపెట్టకుండా చేసేందుకు చైనాలోని యునాన్ రాష్ట్రం లిన్ కాంగ్ జిల్లాలో ఓ గ్రామస్థులు కఠినమైన నిబంధనలను పెట్టుకున్నారు. సామాజిక బాధ్యతలను గుర్తుచేస్తూ గ్రామపెద్దలు కఠిన కార్యాచరణ అమలుచేసేందుకు నడుం బిగించారు. ఈమేరకు గ్రామ పెద్దలు ఓ తీర్మానం చేసి కొన్ని రూల్స్ నిర్ణయించారు. గ్రామంలో ఎవరైనా వివాహం కాకుండా కలిసి ఉంటే ఏటా 500 యువాన్లు భారత కరెన్సీలో సుమారు రూ.6 వేలు జరిమానాగా చెల్లించాలని నిర్ణయించారు. అదేవిధంగా, పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన యువతి 3,000 యువాన్లు అంటే రూ.38,472, పెళ్లి అయిన తర్వాత 10 నెలల లోపే బిడ్డకు జన్మనిచ్చినా ఇంతే మొత్తం ఫైన్ కట్టాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే 1,500 యువాన్లు మన కరెన్సీలో సుమారు రూ.19 వేలు, దంపతులు గొడవపడి గ్రామ పెద్దల వద్దకు వస్తే ఇద్దరూ చెరో 500 యువాన్లు సుమారు రూ.6 వేలు, మద్యం సేవించి గ్రామంలో గొడవ చేస్తే 3 వేల నుంచి 5వేలయువాన్లు రూ.8,472 నుంచి రూ.64,120, నిరాధార ఆరోపణలు, పుకార్లు సృష్టిస్తే 500 నుంచి 1,000 యువాన్లు రూ.6,412 నుంచి రూ.12,824 జరిమానా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓబోర్డును తయారు చేసి గ్రామంలోని కార్యాలయం ముందు ఏర్పాటు చేశారు. సంప్రదాయ కుటుంబ విలువలు, నైతికతను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నియమాలు అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెంటనే ఆ బోర్డును తొలగించారు.

# వేధిస్తున్న బిజెపి నేతకు పోలీసులు చెక్



**భోపాల్, డిసెంబరు 28:** అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, బాధితురాలిని బెదిరించాడో నాయకుడు. ఫిర్యాదు చేసినా తనను ఎవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశాడు. మధ్యప్రదేశ్ లోని సత్నా జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. అత్యాచారం చేస్తూ వీడియోలు తీసి నెలల తరబడి వేధింపులకు గురిచేశాడంటూ బాధితురాలు కన్నీళ్లతో న్యాయం చేయాలని వేడుకుంటోంది. తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ నిందితుడు విర్రవీగుతున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సత్నా జిల్లా రాంపూర్ బాఘేలన్ నగర్ పరిషత్ కౌన్సిలర్ భర్త అశోక్ సింగ్ అధికార బిజెపికి చెందిన స్థానిక నాయకుడు. ఆరు నెలల క్రితం అశోక్ సింగ్ ఓ మహిళ ఇంట్లోకి చొరబడి, కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ దృశ్యాలను తన మొబైల్‌లో రికార్డు చేశాడు. అత్యాచారం చేసిన విషయాన్ని బయటకు చెబితే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. ఆమెతో పాటు ఆమె కుటుంబం మొత్తాన్నీ అంతమొందిస్తానని హెచ్చరించాడు. భయంతో బాధితురాలు మౌనంగా ఉండడాన్ని అలుసుగా తీసుకున్న అశోక్ సింగ్ ఆ తర్వాత కూడా వేధింపులకు గురిచేశాడు. ఈ నెల 20న మరోసారి బాధితురాలిని వేధిస్తూ తాను చెప్పినట్లు వినకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో అశోక్ సింగ్‌ను బాధితురాలు నిలదీసింది. వీడియో రికార్డు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పగా అశోక్ సింగ్ అహంకారంతో మాట్లాడాడు. ఎవరికి ఫిర్యాదు చేసినా తనకేమీ కాదని ధీమా వ్యక్తంచేశాడు. తనను అడిగే వారు లేరని విర్రవీగడం వీడియోలో కనిపిస్తోంది. నీ ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకో పోలీసులే కాదు ఎవరూ నన్నేమీ చేయలేరు. నాకేం కాదు అంటూ బాధితురాలిని హేళన చేశాడు. బాధిత మహిళ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ అశోక్ సింగ్ నుంచి తనను కాపాడాలని, అతడికి తగిన శిక్ష పడాలని విజ్ఞప్తి చేసింది. ఈ వీడియో చూసిన స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అశోక్ సింగ్‌కు నేరచరిత్ర ఉందని, అయినా అధికార పార్టీ అండతో అతడు యథేచ్ఛగా తిరుగుతున్నాడని ఆరోపించింది. ఐదు రోజుల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణాపాయం ఉందని తమకు ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యతని ఆమె హెచ్చరించింది. బాధితురాలి వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో పోలీసులు సీరియస్‌గా స్పందించారు. నిందితుడు అశోక్ సింగ్ పై కేసు నమోదు చేశారు. దీనిపై సత్నా ఎస్పీ హంసరాజ్ సింగ్ స్పందిస్తూ డిప్యూటీ ఎస్పీ మనోజ్ త్రివేది ఆధ్వర్యంలో ఈ కేసు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. నిందితుడిని న్యాయస్థానం ముందు నిలబెడతామని, చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూస్తామని చెప్పారు.

# పుణే మున్సిపల్‌ఎన్నికల్లో గ్యాంగ్‌స్టర్

## పోలీస్ బందోబస్తుతో వచ్చి నామినేషన్



**పుణె, డిసెంబరు 28:** పుణెలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు చర్చనీయాంశంగా మారాయి. స్థానిక గ్యాంగ్‌స్టర్, మనవడి హత్య కేసులో ప్రధాన నిందితుడైన బందు అందేకర్ శనివారం నామినేషన్ దాఖలు చేశాడు. ప్రస్తుతం ఎరవాడ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు భారీ పోలీసు భద్రత నడుమ ప్రభుత్వ కార్యాలయానికి చేరుకున్నాడు. పోలీసు వ్యాన్‌లో వచ్చిన బందు అందేకర్ చేతులకు తాళ్లు కట్టి ఉండగా, ముఖానికి నల్లటి గుడ్డ కప్పి ఉంది. భవానీ పేటలోని నామినేషన్ కేంద్రానికి తీసుకురాగానే పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ లోపలికి వెళ్లాడు. మనవడు ఆయుష్ కోమ్కర్ హత్య కేసులో అందేకర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రత్యేక కోర్టు అనుమతి ఇవ్వడంతో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగాడు. అందేకర్ మాత్రమే కాకుండా, ఇదే కేసులో నిందితులుగా ఉన్న అతడి సోదరుడి భార్య లక్ష్మి అందేకర్, కోడలు సోనాలి అందేకర్ కూడా కోర్టు అనుమతితో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. పుణె మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో 28 సంస్థలకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మాజీ కార్పొరేటర్, బందు అందేకర్ కుమారుడు వనరాజ్ అందేకర్ గతంలో హత్యకు గురయ్యాడు. దీనికి ప్రతీకారంగానే మనవడు ఆయుష్ కోమ్కర్‌ను సెప్టెంబర్ 5న కాల్చి చంపినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ దారుణ హత్య వెనుక అందేకర్ గ్యాంగ్ ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

# హమాస్ నిరాయుధీకరణను ఒప్పకోం

## అమెరికా ప్రణాళికలో పాక్ మెలిక



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** గాజాలో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో భాగంగా తమ దళాలను పంపించడానికి సానుకూలంగా స్పందించిన పాక్ ఇందుకు ఓ మెలిక పెట్టింది. అమెరికా ప్రతిపాదిత 20 అంశాల ప్లాన్‌లో హమాస్‌ను నిరాయుధీకరించాలన్న పాయింట్‌ను తొలగించినప్పుడే తాము భాగమవుతామంది. ఈ మేరకు పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్)లో తమ దేశం భాగం కావడం చాలా సున్నితమైన అంశంగా అభివర్ణించారు. శాంతిని పరిరక్షించే దళంగానే పాకిస్థాన్ కొనసాగుతుందన్నారు. 'మమ్మల్ని శాంతి నెలకొల్పే చర్యలు లేదా హమాస్ నిరాయుధీకరణలో భాగంగా చేయకుండా కేవలం శాంతి పరిరక్షణ చేసేందుకు అయితే ఆ దళంలో సంతోషంగా భాగం అవుతాం. శాంతిని కొనసాగించడంలో మా పాత్ర చాలా పరిమితం' అని పేర్కొన్నారు. అమెరికా ప్రతిపాదిత శాంతి ప్రణాళిక రెండో దశలో హమాస్‌ను నిరాయుధీకర చేయడమే ప్రధాన అంశంగా ఉంది. గాజాలో శాంతి స్థాపించడంలో ఇదే ముఖ్యమైన దశగా అమెరికా విశ్వసిస్తోంది. ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ గాజాకు బలగాలు పంపుతామని పాకిస్థాన్ ఆఫర్ చేసినట్లు పేర్కొన్నారు దీంతోపాటు పలు దేశాలు కూడా దీనిలో భాగం అయ్యేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు.

# 1 నుంచి గుజరాత్‌లో అంతర్జాతీయ పుష్పప్రదర్శన



**అహ్మదాబాద్, డిసెంబరు 28:** కొత్తసంవత్సరం జనవరి మొదటితేదీనుంచీ గుజరాత్‌లోని అహ్మదాబాద్ రివర్‌ఫ్రంట్ వెంబడి అంతర్జాతీయ పుష్పాల ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. రకరకాల పూలతో ఈ నెలరోజులు సందర్శకులను ఆకర్షించేదిశగా గుజరాత్‌లో ప్రతి ఏటా ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఉదయంనుంచి సాయంత్రంవరకూ ఈ ప్రదర్శననిర్వహిస్తారు. అహ్మదాబాద్ మున్సిపల్‌కార్పొరేషన్ ఈ ఎగ్జిబిషన్ నిర్వహణను పర్యవేక్షిస్తోంది. సబర్మతి రివర్‌ఫ్రంట్‌వద్ద ఎల్లిస్‌బ్రిడ్జ్, సర్దార్ బ్రిడ్జిల మధ్యలో ఈ పూల ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఆటో, క్యాబ్, సిటీబస్సులకు సైతం ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. ప్రపంచంలోని వివిధ రకాల పూలమొక్కలు, పుష్పాలతోపాటు వివిధ జంతువులు, పక్షుల రూపంలో అలంకరించిన పుష్పాలు, గార్డెనింగ్ వంటివి సందర్శకులను కనువిందుచేస్తాయి. ప్రకృతి ప్రేమి కులకు ఈ ఫ్లవర్‌షో వీనుల విందుచేస్తుందని నిర్వాహకులు చెపుతున్నారు.



## ఎఐ కళ్ల జోళ్లు పంపిణీ

చేజర్ల (నెల్లూరు), డిసెంబరు 28 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మామూడూరు గ్రామంలోని అబ్బూరి మహాలక్ష్మీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్, అచల గ్రూప్ ఆదివారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కళ్ళ జోళ్ళను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళ్ళ జోళ్ళు నిర్వహణలో కిమ్స్ ప్రతినిదులు ఆచల గ్రూప్ ప్రతినిధులు సంయుక్తంగా కొన్ని రోజులు శిక్షణ ఇస్తారని తెలిపారు. అంగవైకల్యం కలిగిన వారు మరొకరి సహాయంతో వారి పనులు చేసుకుంటారని అన్నారు. అయితే నేడు అంధత్వం కలిగిన వారికి ఎలాంటి సహాయకులు లేకుండా నేరుగా వారి పనులు చేసుకోవడానికి ఏఐ గ్లాసులు ఎంతో ఉపయోగ పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అచల గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ రవితేజా, నేషనల్ పెడిరేషన్ ఆప్ బ్లైండ్ సంస్థ నుండి వెంకటరావు నేషనల్ పెడరేషన్ ఆప్ బ్లైండ్ జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు, ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావనీ, ప్రముఖ వైద్యనిపుణులు బొల్లినేని భాస్కరరావు, బొల్లినేని శ్రీనివాసులు, ఆత్మకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాళ్ళూరి గిరినాయుడు, బొల్లినేని ఆసుపత్రి సిబ్బంది, ఆచలా గ్రూప్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## చెట్టును ఢీకొన్న కారు

### విశాఖ వాసులు ఇద్దరు దుర్మరణం

### గజపతినగరం రైల్వే జంక్షన్ వద్ద ఘటన

గజపతినగరం (విజయనగరం జిల్లా), డిసెంబరు 28 ప్రభాతవార్త: విజయనగరం జిల్లాలోని గజపతినగరం రైల్వే స్టేషన్ జంక్షన్ సమీపంలో 26వ నెంబర్ జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చింత చెట్టును బలంగా ఢీకొనడంతో, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులిద్దరూ విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంలోని కంచరపాలెం ఏరియాకు చెందిన పొట్నూరు వినయ్ కుమార్(35) యల్లబిల్లి దినేష్ (24)లు తమ వ్యాపారంలో భాగంగా బేకరీ ఐటమ్స్ తీసుకుని ఏపీ39డి 2851 నెంబర్ గల వ్యాన్‌లో 27వ తేదీ(శనివారం) సాయంత్రం ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడకి వెళ్లారు. అక్కడ బేకరీ ఐటమ్స్ అప్పగించి, తిరిగి ప్రయాణంలో విశాఖపట్నం బయలు దేరారు. ఈ క్రమంలో 28 వ తేదీ (ఆదివారం) తెల్లవారు జాము 4 గంటల ప్రాంతంలో గజపతినగరం రైల్వే స్టేషన్ జంక్షన్ సమీపంలో చింత చెట్టుని బలంగా ఢీకొన్నారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న పొట్నూరు వినయ్ కుమార్, పక్క సీట్లో కూర్చున్న దినేష్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కారు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకొని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కారులో చిక్కుకున్న ఇద్దరి మృతదేహాలను బయటికి తీసి పోస్ట్ మార్టం నిమిత్తం విజయనగరం పెద్ద ఆస్పత్రికి తరలించారు. మృతులు వినయ్ కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు కాగా, దినేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎల్లబిల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

## మట్టి అక్రమార్కుల దాష్టీకం

### అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై ప్రొక్లెయిన్‌తో దాడి... తమిళనాడు కృష్ణగిరి జిల్లాలో ఘటన

కుప్పం, డిసెంబరు 28 ప్రభాతవార్త: జిల్లా కలెక్టరు ఆదేశాలతో చెరువు వద్ద మట్టి అక్రమ రవాణా అడ్డు కునేందుకు వెళ్లిన ఓ తహశీల్దార్, ఉప తహశీల్దార్‌లపై ఓ డ్రైవర్ ప్రొక్లెయిన్‌తో దాడి చేసి ఎక్కించబోయి హత్యాయత్నంకు పాల్పడిన సంఘటన తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా.. కృష్ణగిరి జిల్లా పోచంపల్లి సమీపంలోని చెంగంపట్టి గ్రామం వద్ద ఆనందూర్ చెరువు ఉంది. ఆ ప్రాంతంనుంచి భారీగా సారవంతమైన మట్టిని కొందరు స్మగ్లర్లు తరలిస్తున్నారని కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంగా మట్టి అక్రమ రవాణా అరికట్టాలని కలెక్టరు ఊతంగరై తహశీల్దార్ రజలత్‌సుమి, ఉప తహశీల్దార్లు సహదేవ, జయపాల్‌లను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులబృందం సంఘటనా స్థలంకు చేరుకోగా అక్కడ మట్టిని ప్రొక్లెయిన్ సాయంతో లారీలో ఎక్కిస్తుండడాన్ని అధికారులు గుర్తించారు. అక్కడున్న కొందరు అధికారులను చూసి పరారు కాగా ప్రొక్లెయిన్ డ్రైవర్ వాహనంతో వేగంగా వచ్చి తహశీల్దార్, ఉప తహశీల్దార్లపై ప్రొక్లెయిన్‌తో ఢీకొట్టి వారిపై ఎక్కించాలని హత్యాయత్నంకు పాల్పడ్డాడు. అనంతరం అతను పరారవుతుండగా అధికారులు పట్టుకునే యత్నం చేయగా తప్పించుకున్నాడు. పోచంపల్లి పోలీసులు అధికారుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలికి చేరుకుని అక్కడున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈసంఘటన కృష్ణగిరి జిల్లాలో కలకలం రేకెత్తించింది.

## ఆత్మకూరులో రూ.144.5 కోట్ల అభివృద్ధి పనులు

### - రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు (నెల్లూరు), డిసెంబరు 28 ప్రభాతవార్త: ఆత్మకూరు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖాల ద్వారా సుమారు 144.5కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలంలోని వాసిలి గ్రామంలో జాతీయ రహదారి నుంచి వాసిలి గ్రామం వరకు సుమారు 49లక్షల రూపాయలతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మించనున్న సిసిరోడ్లకు మంత్రి ఆనం శంఖు స్థాపన చేశారు. అనంతరం పూర్తయిన రోడ్లను ప్రారంభించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఆత్మకూరు మండలంలో 19కోట్ల రూపాయలతో 76పనులను ప్రారంభించామన్నారు. కొన్ని టెండరు ప్రక్రియ సాగుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 336 పనులకు 65కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.4కోట్ల రూపాయల నిధుల కొరత ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 5లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మరమ్మత్తులు చేయడం జరుగుతుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలద్వారా చివరి ఆయకట్టు భూములు కూడా వ్యవసాయ ఆమోదయోగ్యం పొందడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో అనేక లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు నిధులు మంజూరు చేశారన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవసాయంలో అంతర్భాగమన్నారు. మరికొన్ని నూతన పథకాలను కూడా ప్రారంభిస్తామన్నారు. ఎన్‌డిఎ చేసిన వాగ్ధానాల మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లు అందజేస్తుందన్నారు. ఈనెల 31వ తేదీనే పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. ఇంటింటికి మూడు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదనంగా నూతన గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని, అదనంగా నూతన గ్యాస్ కనెక్షన్ 200 ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. నియోజకవర్గ పరిధిలో 761 పనులకు 50కోట్ల 72లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు నియోజకవర్గ ప్రజల శ్రీకారం చుట్టి పనులు పురోగతి లో ఉన్నాయన్నారు. 9బిటి రోడ్లు 47కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసేందుకు 26.9 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. వాసిలి ఎస్సీ కాలనీలో 69.3లక్షల రూపాయలతో తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మండల పరిధిలో జలజీవన్ మిషన్‌కింద 76.19కోట్ల రూపాయలతో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని నియోజకవర్గ పరిధిలో 336 పనులకు 6588 లక్షల రూపాయలతో శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి బి.పావని, మండల రెవెన్యూ అధికారి పద్మజ, మండల అభివృద్ధి అధికారి, పంచాయతీరాజ్ శాఖఅధికారులు, స్థానిక అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

### - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



వరదయ్యపాళెం, డిసెంబరు 28 ప్రభాతవార్త: వరదయ్యపాలెం మండలం సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో సూళ్లూరుపేటలోని పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్‌లో సుమారు రూ.1500లకు కల్తీ విత్తనాలను కొని నారు పోసి నాటగా 15 రోజుల్లోనే ఎన్నులు తీయడం, పైకి ఎదగకపోవడం వల్ల కల్తీ విత్తనాలతో నష్టపోయిన సుమారు 250 మంది రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.62000 నష్టపరిహారం చెల్లించాలని. ఈ కల్తీ విత్తనాల అమ్మిన సుళ్లూరుపేట పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్ యాజమాని శ్రీధర్ రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కన్వీనర్ సుధాకర్ రెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్ని రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదయ్యపాలెం మండలంలోని మావిళ్ళపాడు కలతూరు కొవ్వాకొల్లి మరదవాడ అంగూరు సాతంబేడు తదితర గ్రామాల రైతులు సుమారు 250 మంది విత్తనాలు నారుపోసి నాటి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎక్కువ మంది రైతులు భూములను కౌలుకు తీసుకొని ఈ వ్యవసాయ సాగు చేస్తున్నారని, కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన భూమి గల యజమానులకు కవులు డబ్బులు చెల్లించాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురి ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సుధాకర్‌రెడ్డి చిన్నిరాజ్ నాయకత్వాన వరదయ్యపాలెం మండలంలోని గ్రామాల పొలాలలో క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులతో కలిసి పరిశీలించడం జరిగిందని ఆ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గుత్తకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న మాకు ఈ కల్తీ విత్తనాలు వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములను సరియైన నిర్వహించి రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని లేకుంటే ఆత్మహత్య చేసుకోవడమే తప్ప వేరే గత్యంతరం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనుంజయులు శెట్టి చంద్ర, ధనంజయల్ నాయుడు, చలపతి నాయుడు, విజయ ఉప్పరపాటి, మునిరాజా, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి నిధులతో కసాపురం దేవస్థానం అభివృద్ధి

### - అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ

### - ఎంపిని కలిసిన కసాపురం దేవస్థానం ఇఒ విజయరాజు



అనంతపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కసాపురం దేవస్థానం (గుంతకల్) కార్యనిర్వాహణ అధికారి విజయరాజు మర్యాదపూర్వకంగా కలుసుకొని, వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కసాపురం దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించాను. జిల్లా స్థాయిలో దేవస్థానం మరింత మంచి స్థానం సంపాదించుకునేలా అభివృద్ధి చేయాలని, ఎంపీ నిధుల ద్వారా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవాలయంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నాను. ఇప్పటికే గ్రామం మరియు దేవాలయానికి బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు దేవాలయానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని, బస్ షెల్టర్, నక్షత్రవనం, రహదారులు, నీటి వసతి, గది వసతులు, ఆర్చ్, పార్కింగ్, షెడ్స్, ఆధ్యాత్మిక వసతులు వంటి అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కసాపురం దేవస్థానం అధికారులు, ప్రధాన అర్చకుల బృందం, ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంతలో శంబాల నటుల సందడి

### మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో ఘన సన్మానం



అనంతపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త: ఈనెల 24వ తేదీ విడుదలైన శంబాల సినిమా నటులు ఆదివారం అనంతలు సందడి చేసింది. హీరో తండ్రి సాయికుమార్, హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యర్, మధుసూదన్, ఇంద్రనీల్, అనంతపురం పట్టణానికి చెందిన మరో నటుడు, మటకశిర ఎమ్మెల్యే, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు కలిసి మాసినేని గ్రాండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో త్రివేణి థియేటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ భారీగా బాణ సంచులు పేలుస్తూ స్వాగతం పలికారు. అక్కడ శంబాల సినిమా ఆడుతున్న త్రివేణి హాల్లోకి వెళ్లి సందడి చేశారు. ప్రేక్షకులు కూడా సినీ నటులను చూసి ఆనందంతో కేకలు వేస్తూ విజిల్స్ వేశారు. శంభాల సినిమా ఈనెల 24వ తేదీ ప్రపంచవ్యాప్తంగా విడుదల అయిందని, ఈ సినిమాని అందరూ ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సినీనటులు తెలియజేశారు. పైరసీను ప్రోత్సహించకుండా థియేటర్లలోనే సినిమాలు చూడాలని కోరారు. అనంతరం గజమాల తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ మెంబర్ వెంకటప్ప, టిడిపి నాయకులు రాయల్ మురళి, దేవల మురళి, ఎంఆర్పిఎస్ నాయకులు పెద్దన్న, టిసి నాగేంద్రతో పాటు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి నేరం

### అటువంటి ఉన్మాదులను ప్రోత్సహించం

### - హోంమంత్రి వంగలపూడి అనిత

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి చేయడం నేరం అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. వైఎస్సార్సీపీ నేతలు అనేకచోట్ల జంతుబలులు చేసి తమ ఉన్మాదాన్ని చాటుకున్నారని .ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ నేతలు ఏం చేసినా ఆ పార్టీ నాయకుడు నోరు తెరిచి తప్పని చెప్పలేదు. జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం ఉన్మాదం కాదా?. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే మీ పరిస్థితి ఇదేనంటూ నినాదాలు ఇవ్వడం దారుణం. రాజకీయాలను అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారు. చిన్న పిల్లలను కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారుచేస్తున్నారు. టీనేజ్ పిల్లల జీవితాలతో ఆటలు ఆడు కుంటున్నారు. రాజకీయ నేతల ఉద్దేశాలు కూడా పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాలి. ఆస్తి గురించి సొంత తల్లి, చెల్లెలిపై కేసులు పెట్టినవారు మీ పిల్లల్ని రక్షిస్తారా?. పిల్లలు రోడ్డుపైకి వచ్చి నరుకుతాం, చంపుతాం అంటున్నారు. తమ పార్టీ నేతలు చేసింది తప్పని చెప్పలేరా జగన్. జగన్ అధికారంలో ఉన్నప్పుడు అనేక దారుణాలు జరిగాయి. అధికారం కోల్పోయినా మరో రకం దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని ఖండించలేదంటే జగన్ అసలు మనిషేనా?. నేరాలు ప్రోత్సహించే పరిస్థితి నీది, వాటిని అరికట్టే బాధ్యత మాది. రోడ్లపై ఉన్మాదుల్లా ప్రవర్తిస్తే ఎవరినీ వదిలేది లేదు. ఫ్లెక్సీలపై రక్తం చల్లినవారందరినీ అరెస్టు చేశాం. నేరగాళ్లు, రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపుతాం. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తుపై ఆలోచన చేయాలని మంత్రి సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు కత్తులు పట్టుకుని రోడ్డెక్కుతుంటే తప్పు అని చెప్పేందుకు కూడా మనసు రాలేదా? అని నిలదీశారు. జగన్ పుట్టినరోజు నాడు వైఎస్సార్సీపీ వికృత చేష్టలు మానవత్వం ఎటు పోతోందో అనే రీతిలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ ముసుగులో వైఎస్సా ర్సీపీ సైకోలు చేపట్టే చర్యలు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా ఉందని మండిపడ్డారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్సీపీ వికృత చేష్టలు, జంతు బలులపై హోంమంత్రి అనిత వీడియో విడుదల చేశారు. గతంలో మాదిరి నిందితులకు ముసుగు వేయకుండా వారిని అందరి ముందు బహిర్గతం చేస్తామని మంత్రి అనిత వెల్లడించారు. ఆడపిల్లల జోలికి వస్తే రోడ్డుపై నడిపించి స్టేషన్‌కు తీసుకెళ్తామని హెచ్చరించారు. శృతి మించి ప్రవర్తిస్తే రాష్ట్ర బహిష్కరణకు వెనుకాడమని వ్యాఖ్యా నించారు. ఫ్యాక్షన్ సినిమా చూసినట్లుగా వైఎస్సార్సీపీ వికృత చేష్టలు ఉన్నాయని, నేతల్ని ఉన్మాదుల్లా ఆపార్టీ నాయకుడు ఎలా తయారు చేస్తున్నాడో ప్రజలు గమనించాలని సూచించారు. జగన్ ఆదేశాలతోనే ఈ తరహా కార్యక్రమాలు జరిగాయా? అని మంత్రి అనిత ప్రశ్నించారు. గర్భిణీ స్త్రీని కాలుతో తన్నే ఉన్మా దుల్ని ఏమనాలని మండిపడ్డారు. రాజకీయ ముసుగులో రౌడీయిజం అడ్డం పెట్టుకునే చేసే కుట్రలు స్పష్టమవుతున్నాయని తెలిపారు. అధికారంలో ఉండగా గంజాయ్‌ని ప్రోత్సహించిన జగన్ యువత భవిష్యత్తుని నాశనం చేశారని అనిత ఆక్షేపించారు. తాజా వికృత చేష్టలతో 18ఏళ్ల లోపు యువత జీవితాల్ని నాశనం చేయటమే జగన్ పనిగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయ ముసుగులో యువత భవిష్యత్తును నాశనం చేయాలనుకుంటున్న జగన్ అసలు మనిషేనా అని అనిత ధ్వజమెత్తారు. ఇష్టానుసారం వ్యవహరిస్తే ఇక్కడ ఉంది సీఎం సీబీఎన్ అని జగన్ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించేందుకు వైఎస్సార్సీపీ నేతలు ఎంతకైనా దిగజారుతున్నారని హోంమంత్రి విమర్శించారు. జంతుబలులతో రక్తాభిషేకం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జగన్ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల ఆ పార్టీ నేతలు ముగుజీవాల్ని బలి ఇచ్చి చేసిన రక్తాభిషేకంపై మండిపడ్డారు. రోడ్లపైకి వచ్చి కత్తులు పట్టుకుని తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. రక్తాభిషేకం చేసిన వాళ్లంతా కటకటాల్లో ఉన్నారని చెప్పారు. చిన్న పిల్లలను కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారు చేస్తున్నారని హోంమంత్రి



ప్లాస్మా జాతీయ సింపోజియంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

### పారిశ్రామిక, బయో మెడికల్ రంగాల్లో

## ప్లాస్మా సైన్స్ కీలకం

### తిరుపతి ఐఐటిలో ప్లాస్మా 40వ జాతీయ సింపోజియం

శ్రీకాళహస్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త: ఫ్యూజన్ ఎనర్జీ, స్పేస్, అస్ట్రోఫిజికల్, ప్లాస్మాలు, తక్కువ ఉష్ణోగ్రత ప్లాస్మాలు, ప్లాస్మా డయాగ్నస్టిక్ మెటిరీయల్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో నేడు ప్లాస్మా సైన్స్ కీలకంగా మారిందని తిరుపతి ఐఐటిలో జరుగుతున్న ప్లాస్మా 40వ జాతీయ సింపోజియంలో పలువురు వక్తులు ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సింపోజియంకు తిరుపతి ఐఐటి అతిధ్యం ఇచ్చింది. ఈ నేపధ్యంలో ఆదివారం నిర్వహించిన ఆలోచనాత్మక సమావేశాలకు డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఉత్కల్ యూనివర్శిటి మాజీ విసి ప్రొఫెసర్ ఎకె దాస్, ఎంటిఆర్‌డిసికి చెందిన డాక్టర్ ఎస్‌కె దత్, కాంచిపురం ఐఐటిడిఎం ప్రొఫెసర్ ఎంవి.కార్తికేయన్, నెట్‌కార్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ్ శర్మ తదితరులు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడి భౌతిక శాస్త్రం, సివిల్, పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం తిరుపతి ఐసర్, ప్లాస్మాసొసైటీ ఆఫ్ ఇండియా కలసి ఈ సింపోజియంను నిర్వహిస్తున్నట్లు వివరించారు. టెక్నాలజీలో ఇటీవల చోటు చేసుకుంటున్న పురోగతులు ఉద్భవిస్తున్న ధోరణులపై చర్చించటమే సింపోజియం లక్ష్యం అన్నారు. అంతర్ విభాగం పరిశోధనలు, శాస్త్రీయ నైపుణ్యాన్ని ప్రోత్సహించటానికే తిరుపతి ఐఐటి ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. భారత దేశ ప్లాస్మా పరిశోధన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఇటువంటి సింపోజియంలు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సింపోజియంలో ఆదివారం పలు అంశాలకు సంబంధించి చర్చలు జరిగాయి. అలాగే ప్యానెల్ చర్చలతో పాటు పలు పోస్టర్స్ ప్రెజంటేషన్ చర్చలు సుధీర్ఘంగా జరిగాయి. ఈ వాతావరణం విద్యాసంస్థలు, జాతీయ ప్రయోగశాలలు పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుటకు దోహద పడుతుందన్నారు.



చిత్తూరులో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ ఉత్సవంలో నాయకులు, కార్యకర్తలు

## మరో స్వాతంత్య్ర సమరానికి కాంగ్రెస్ సై

### - చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్

చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త: దేశంలో కాంగ్రెస్ పార్టీ మరో స్వాతంత్య్ర సమరానికి సిద్ధం అవుతోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావించి 141 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్ కాంగ్రెస్ పతాకంను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశం నుండి తెల్ల దొరలను తరిమికొట్టడానికి స్వాతంత్య్ర పోరాటం చేసిందన్నారు. దేశంలో ప్రస్తుతం వున్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలు, ముస్లీంలకు అన్యాయం చేసి ఆదానీ, అంబానీలకు ప్రయోజనం కలిగే నిర్ణయాలు తీసుకుని సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. చిత్తూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కి రాయల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ బీద ప్రజల వైపు నిలిచి వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేసిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి నాయకుడి నుండి కార్యకర్తల వరకు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యవేడులో రేషన్ దందా

### సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం

సత్యవేడు (చిత్తూరు జిల్లా), డిసెంబరు 28 ప్రభాతవార్త: విజిలెన్స్ దాడులు... మూడు చోట్ల పోలీసుల మెరుపు దాడులు... బియ్యం స్వాధీనం... వాహనాలు సీజ్... ఇది గత కొంత కాలంగా పేదోడికి ఇంటికి చేరాల్సిన ప్రభుత్వ సబ్సిడీ బియ్యం విషయంలో అధికారుల స్పందన. అయినా మళ్లీ బియ్యం అక్రమ రవాణా మాఫియా విజృంభణ సత్యవేడులో మొదలైంది. తమిళనాడుకు సరిహద్దులో సత్యవేడు ఉండడం వల్ల ఇటు తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల సబ్సిడీ బియ్యాన్ని కొనుగోలు చేసి శ్రీకాళహస్తి, పలమనేరు ప్రాంతాలకు తరలించి అక్కడ బియ్యాన్ని పోలీసు చేసి ఏకంగా 25 కేజీల బస్తా బియ్యం సుమారు 1300 రూపాయలు విక్రయిస్తున్నారు. సత్యవేడులో ఓ నలుగురు ఏకమై పోలీసులు, ఇతర అధికారులను వారు మచ్చిక చేసుకుని ఈ వ్యాపారం మూడు బస్తాలు.. ఆరు రకాల ఆదాయ వనరులుగా మార్చుకుని లబ్ధిపొందుతున్నారు. సత్యవేడు కేంద్రంగా తమిళనాడు రాష్ట్రంలోని ఊత్తుకోట, గుమ్మిడిపూండి, మాధరపాకం, ఎగుమదురె, పాలవాకం, అచ్చిమనాయుడు కండ్రిగ, ఎన్ఎం కండ్రిగ ప్రాంతాలు నుంచి అక్కడ తమిళనాడు ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేసేప్పుడు బియ్యాన్ని కేజీ 5 నుంచి 10 రూపాయల చొప్పున ఇక్కడికి తీసుకుని వచ్చి నిల్వ చేసుకుంటున్నారు.

### పట్టించుకుంటే ఒట్టు... అక్రమార్కుల కనికట్టు....

సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల నుంచి మన రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని సత్యవేడుకు చేరవేసుకుంటారు. ఇక్కడ ప్రభుత్వం ఇంటి పరిసరాలకే టెంపోల ద్వారా కొన్ని సందర్భాల్లోను, డీలర్లు వద్ద కొన్ని సందర్భాల్లో ఉచిత, కేజీ రూపాయి చొప్పున బియ్యాన్ని అందిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిగా ప్రజా పంపిణీ వ్యవస్థపై పర్యవేక్షణ మరచిపోవడంతో ఈ అక్రమ రవాణా మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. క్షేత్ర స్థాయిలో ఏడాది కాలంగా ఏ ఒక్క తహసీల్దార్ ఏ వీధికి కానీ, గ్రామానికి కాని వెళ్లి బియ్యం అందిందా.. లేదా.... అని ప్రశ్నించిన దాఖలాలు లేవు. దాంతో ఏకంగా డీలర్ల నుంచి 4.6 రూపాయల చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సేకరించిన బియ్యాన్ని సత్యవేడులోని జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న మంచినీటి ట్యాంకు సమీపంలో కొందరి ఇళ్ళలో ఉంచి లారీ మొత్తంలో నిల్వ చేరిన వెంటనే శ్రీకాళహస్తి, పలమనేరు ప్రాంతాలకు తరలించి భారీగా ఆదాయం పొందుతున్నారు. కొందరిపై వరుస కేసులు నమోదు అవుతున్నా ప్రయోజనం లేకపోతుంది. అటు కోర్టుకు వెళ్లామా... బెయిల్‌పై వచ్చి వెంటనే మరో ఇంటికి గోడౌన్‌గా మార్చి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. మొత్తం మీద పేదోడి సర్కారు సబ్సిడీ బియ్యం అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్ష పాత్ర వహించడం ఆలోచించాల్సి ఉంది.

29-12P g7exHMNWJQE 11_29-12P g7exHMNWJQE.qxd 29/Dec/25 12:35 AM Page 1



# నరసాపురం లేస్.. ప్రస్తావన గర్వకారణం

## - మన్‌కీ బాత్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



నరసాపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త:మన్ కీ బాత్ 129వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నరసాపురం లేస్ పరిశ్రమ, లేస్ పని చేసే మహిళల గురించి గర్వంగా ప్రస్తావించడం మన జిల్లాకు ఎంతో గర్వకారణమని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రధాని మోడీ తన ప్రసంగంలో నరసాపురం మహిళలు తమ చేతివృత్తి ద్వారా తయారు చేసే లేస్ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇది లోకల్ ఫర్ వోకల్ అనే నినాదానికి ఒక చక్కని ఉదాహరణ అని కొనియాడారు. 250 గ్రామాలలో లక్షలాది మంది గ్రామీణ మహిళలు ఈ కళ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా ఎదగడం పట్ల ప్రధాని ప్రశంసలు కురిపించారు. మహిళలు ఇలాంటి పురాతన కళలను కాపాడుకుంటూ వృత్తిలో రాణించడం దేశానికి గర్వకారణమని చెప్పారు. ఇక్కడ తయారైన 500 రకాల క్రోచెట్ లేస్ ఉత్పత్తులు విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని, ఇది భారతీయ సంస్కృతి, నైపుణ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తోందని ప్రధాని పేర్కొన్నారు. నరసాపురం లేస్ పరిశ్రమకు ఇటీవల జిఐ ట్యాగ్ కూడా లభించిన నేపథ్యంలో, ప్రధాని ప్రసంగంలో నరసాపురం లేస్ మహిళల కోసం ప్రస్తావించడం స్థానికలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నరసాపురం లెస్ అభివృద్ధికి గత సంవత్సర కాలంగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఎంతో కృషి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పెద్దమైన వానిలంక గ్రామంలో పలు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ మనకి బాత్ కార్యక్రమాన్ని స్వయంగా వీక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పాల్గొన్నారు.

# సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్‌లో సూర్య చరిష్మకు స్వర్ణం



- అసాధారణ ఘనత అంటూ సిఎం చంద్రబాబు ప్రశంసలు
- రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభకు ఇది నిదర్శనమని వెల్లడి
- జట్టు విభాగంలో ఎపి టీమ్‌కు తొలిసారిగా రజతం

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్ షట్లర్ సూర్య చరిష్మపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. సూర్య చరిష్మ సాధించిన విజయం అసాధారణమైన ఘనత అని, ఇది రాష్ట్ర క్రీడాకారిణుల ప్రతిభకు గొప్ప నిదర్శనమని ఆయన కొనియాడారు.
విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్2025 పోటీల్లో ఈ ఘనత నమోదైంది. మహిళల సింగిల్స్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన సూర్య చరిష్మ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.
ఇదే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు కూడా చరిత్ర సృష్టించింది. తొలిసారిగా టీమ్ విభాగంలో రజత పతకం సాధించి సత్తా చాటింది. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో విజయాలతో వెలిగిపోతూ రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తెస్తున్నారని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర్య చరిష్మ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సీఎం ఆకాంక్షి ంచారు. ఈ విజయాలు రాష్ట్ర క్రీడారంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని, యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

### సూర్య చరిష్మను చూసి గర్వపడుతున్నా: మంత్రి లోకేష్

ఆంధ్రప్రదేశ్‌కు ఇది చారిత్రక క్షణమని, 87వ యోనెక్స్ సన్‌రైజ్ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన సూర్య చరిష్మను చూసి గర్వపడుతున్నానని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి మహిళల సింగిల్స్‌లో ఇదే మొట్టమొదటి జాతీయ స్వర్ణ పతకం అని ఆయన కొనియాడారు. ఇదే టోర్నీలో ఏపీ మహిళల జట్టు తొలిసారి రజతం గెలవడం కూడా గర్వకారణమని తెలిపారు. మహిళా శక్తి, పట్టుదల, సమష్టి కృషికి ఇది నిదర్శనమని, ఆంధ్ర ఆడబిడ్డలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తూ భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు.




నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలో రజత పతకం గెలుచుకున్న ఆంధ్ర జట్టు

# పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పేరు సమర్థనీయం

- ఎమ్మెల్సీ కె.నాగబాబు
- పెనుగొండ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో జనసేనలో భారీగా ఆర్యవైశ్యులుచేరిక



విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగు మాట్లాడే వారిని చులకనగా చూస్తున్న కాలంలో వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలి అని ఆమరణ నిరాహార దీక్ష చేసి త్యాగధనుడు ఎమ్మెల్సీ, జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు కీలక భూమిక పోషించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం అనేకమందికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అలాంటి మహానుభావుడు పేరు పోలవరం ప్రాజెక్టుకు పెట్టి ఆయనను గౌరవించుకోవాలని జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన సూచనను బలంగా సమర్థిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం, మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్ లో జెఎస్పినేత ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పెనుగొండ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో పలువురు ఆర్య వైశ్యులు జనసేన పార్టీలో చేరారు. వారిని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ కలసి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అనగానే ప్రథమంగా గుర్తుకొచ్చేది అమరజీవి పొట్టి శ్రీరాములు, నెల్లూరులో డిగ్రీ విద్యనభ్యసిస్తున్నప్పుడు కళాశాలలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఉండేది, ప్రతి రోజూ ఆయనకు నమస్కరించి తరగతి గదిలో అడుగుపెట్టేవాళ్ళం. హిస్టరీ విద్యార్థిగా అమరజీవి గురించి చదివి ఆయన జీవన విధానం గురించి తెలుసుకున్నాం. ఆయన జీవితం అనేకమందికి ఆదర్శంగా నిలుస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం కోసం, గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు రాజకీయ నాయకుల పేర్లుపెట్టే ఆనవాయితీని తోసిపుచ్చి గోదావరి జిల్లాలకు శుద్ధి చేసిన మంచి నీరు అందించే నీటి ప్రాజెక్టుకు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టి ఆయన త్యాగాలను భవిష్యత్ తరాలు కూడా చెప్పుకొనేలా చేశారు" అన్నారు.

# జనసేన పార్టీ మూల సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి

- శాసన మండలిలో ప్రభుత్వ విప్, జెఎస్పీ నేత పిడుగు హరిప్రసాద్



విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: జనసేన ప్రాంతీయ పార్టీ అయినప్పటికి, జాతీయవాదం పనిచేయాలన్నదే పార్టీ అధినేత ఆదేశమని శాసన మండలిలో. ప్రభుత్వ విప్, జెఎస్పి నేత పిడుగు హరిప్రసాద్ అన్నారు. పార్టీలో పలువురు ఇతర పార్టీల నుంచి ఆర్యవైశ్య సంఘాల నుంచి చేరిన సందర్భంలో హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సేవే పరమావధిగా బతికే అతికొద్ది మంది నాయకుల్లో పవన్ కల్యాణ్ ముందు వరుసలో ఉంటారు. మహోన్నత ఆశయాలు కలిగిన పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి 14 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లు ఎదుర్కోవడం నేను స్వయంగా చూశాను. కూటమి ఏర్పాటు చేసి పార్టీని ప్రభుత్వంలోకి తీసుకురావడానికి చాలా కష్టపడ్డారు. ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. సప్తాశ్వాలు, సప్తరుషులు, సప్తగిరులకు ఎంత విశిష్టత ఉందో జనసేన మూల సిద్ధాంతాలకు అంతటి విశిష్టత ఉంది. ఈ సూత్రాల ఆధారంగా జనసేన ముందుకు వెళ్తుంది. పార్టీలో కొత్తగా చేరిన వారు ఆ మూల సూత్రాలను అర్థం చేసుకుని ముందుకు వెళ్లాలి" అన్నారు. కొత్తగా పార్టీలో చేరుతున్న వారితో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తామని ప్రమాణం చేయించారు. ఈ కార్యమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, మాజీ శాసన సభ్యులు కిలారి రోశయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పంచకర్ల సందీప్, శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు దేవకీ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు గంజి చిరంజీవి, కండే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

- క్రీడాకారిణి తమిరి సూర్య చరిష్మ మహిళల సింగిల్స్ టైటిల్
- పురుషుల సింగిల్స్‌లో రిత్విక్ సంజీవి టైటిల్

విజయవాడ. డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ వేదికగా ఆదివారం ముగిసిన సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్థానిక క్రీడాకారిణి తమిరి సూర్య చరిష్మ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. పురుషుల సింగిల్స్‌లో రిత్విక్ సంజీవి ఛాంపియన్‌గా నిలిచాడు. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో 19 ఏళ్ల సూర్య చరిష్మ 1721, 2112, 2114తో తన్వి పత్రిపై అద్భుత విజయం సాధించింది.
తొలి గేమ్‌లో ఓడిపోయినప్పటికీ, స్థానిక క్రీడాకారిణి కావడంతో ప్రేక్షకుల నుంచి లభించిన గట్టి మద్దతుతో పుంజుకుని అద్భుతంగా పునరాగమనం చేసింది.
ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో రిత్విక్ సంజీవి 2116, 2220 తేడాతో భరత్ రాఘవ్‌పై గెలుపొందాడు. ఇతర విభాగాల్లో, మహిళల డబుల్స్‌లో శిఖా గౌతమ్‌అశ్విని భట్ జోడీ, పురుషుల డబుల్స్‌లో హరిహరన్‌రుబన్ కుమార్ జంట విజేతలుగా నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ రెడ్డిరాధిక శర్మ జోడీ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

# దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా సూర్య ఆరాధన



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 28 ప్రభాతవార్త: శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం నాడు వేదోక్తంగా సూర్యోపసన సేవను నిర్వహించారు. లోక సంక్షేమార్థం నిర్వహించిన ఈ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### దుర్గమ్మవారి సేవలో మంత్రి సంధ్యారాణి:

దుర్గమ్మవారిని మంత్రి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. మంత్రికి ఇఒ శ్రీనా నాయక్ దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం మంత్రికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందిం చారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# జనవరి 4న బిసి, ఓబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం మహాసభ

విజయవాడ, డిసెంబరు 20 ప్రభాతవార్త: జనవరి 4న ఏపీ బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహాసభ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఆల్ ఏపీ బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల. వీర బ్రహ్మం తెలిపారు. ఆదివారం ఆయన విజయవాడలో జరిగిన ప్రెస్మీట్లో మాట్లాడుతూ న్యూఇయర్ డైరీ, కాలండర్‌ను మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు, పల్లా శ్రీనివాస రావు ఆవిష్కరిస్తారన్నారు. ఏపీలో బీసీ ఓబీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, జ్యోతిరావు పూలే రెండు వందల జయంతిని శెలవు ప్రకటించడంతోపాటు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆ కార్యక్రమ వేదికపై డిమాండ్ చేస్తామని ఈ కార్యక్రమానికి అటెండర్ స్థాయి ఉద్యోగి నుంచి డిపార్టుమెంట్ హెడ్‌ల వరకు రాష్ట్ర బీసీ ఓబీసీ ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావలన్నారు. కార్యక్రమంఓ గౌరవాధ్యక్షులు బత్తుల అప్పారావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వర రావు, జనరల్ సెక్రెటరీ పక్కిభూషణరావు, కోశాధికారి వై శంకర రావు, మహిళా అధ్యక్షురాలు హేమలత, వివిధ జిల్లాల, వివిధ సంఘాల ప్రముఖ నాయకులు హాజరైనారు.

# గ్యాస్ లీక్... అగ్నికీలలు

## - వృద్ధురాలికి తీవ్ర గాయాలు
## - నెల్లూరు నగరంలో ఘటన

నెల్లూరు క్రైమ్, డిసెంబరు 28 ప్రభాతవార్త: గ్యాస్‌లీకై మంటలు వ్యాపించి వృద్దురాలికి తీవ్రగాయాలైన ఘటన పెద్దబజారు కుమ్మరవీధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.... కుమ్మరవీధిలో షేక్ నజీనబేగం తన రెండోకుమారుడు ముత్తాహర్‌తో కలిసి ఉంటోంది. ఆదివారం కుమారుడు బయటకు వెళ్లాడు. ఆమె వంటచేసి గ్యాస్‌ను ఆపడం మర్చిపోవడంతో గ్యాస్‌లీకువుతోంది. ఈవిషయం గమనించని వృద్దురాలు సాయంత్రం ఆమె టీ పెట్టుకునేందుకు స్టౌవ్‌వెలిగించగా మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. దీంతో ఆమె కిందపడిపోయింది. మంటలు ఆమెను చుట్టుముట్టడంతో కాళ్లు, చేతులు, వీపు కాలాయి. ఈవిషయాన్ని గమనించిన స్థానికులు నజీనబేగం కుమారుడికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. అనంతరం దుప్పటితో మంటలను ఆర్పి తీవ్రగాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం 108సాయంతో జీజీహెచ్‌కు తరలించారు. ఈమేరకు ఆమె చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బీహార్‌లో గూడ్స్‌కు పెను ప్రమాదం



**పాట్నా, డిసెంబరు 28:** బీహార్ రాష్ట్రంలోని జాముయి జిల్లాలో తెల్వా బజార్ హాల్ట్‌వద్ద గూడ్స్ రైలు పట్టాలు తప్పడంతో రైల్వే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఝూఝా జసిధీ రైల్వేసెక్షన్‌లో జరిగిన ఈప్రమాదంలో సుమారు 10 వ్యాగన్లు బ్రిడ్జి సమీపంలో పడిపోయాయి. మొత్తం 34కిపైగా రైళ్లరాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ వాగన్లు ట్రాక్‌పైనుంచి పక్కకు ఒరిగిపోయాయి. యుపి, బీహార్ సెక్షన్లలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జసిదీనుంచి ఝూఝాకు గూడ్స్ రైలు ప్రయాణిస్తోంది. భారీ శబ్దంతో ఒక్కసారిగా వ్యాగన్లు పట్టాలు తప్పిపోయాయి. ఈ రైలులో సిమెంట్ బస్తాలు రవాణా అవుతున్నాయి. వంతెనపైనా, పరిసరాల్లో ఈ బస్తాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంతో అనేక ప్యాసింజర్‌రైళ్లు, కియుల్‌జసిద్ది రైల్వే సెక్షన్ మధ్యలో పలు స్టేషన్లలో నిలిచిపోయాయి. అయితేఎలాంటిప్రాణాపాయం జరిగినట్లు సమాచారం లేదని అధికారులు తెలిపారు. వంతెనపై రైలు బోగీలను తప్పించి ట్రాఫిక్‌పునరుద్ధరణ చేపట్టినట్లు తూర్పురైల్వే అధికారులు తెలిపారు. పనులు పూర్తయ్యేంతవరకూ రైళ్లను ఇతర మార్గాలమీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఝూఝా స్టేషన్‌నుంచి మాత్రం నిర్ణీత మార్గంలోనే నడుస్తాయని చెప్పారు. అసన్‌సోల్,మధుపూర్, ఝూఝా స్టేషన్లనుంచి రిలీఫ్ రైళ్లను వెంటనే ఆప్రాంతానికి పంపించామన్నారు.

# ఇక సినిమాలకు గుడ్‌బై! పూర్తికాలం రాజకీయాలకే..!!

## జననాయకన్ ఆడియో వేడుకలో విజయ్ సంచలన ప్రకటన



కౌలాలంపూర్,డిసెంబరు 28: తమిళ సూపర్‌స్టార్, దళపతి విజయ్ తన సినీ జీవితానికి ముగింపు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. పూర్తి స్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టేందుకు నటన నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఉన్న బుకిట్ జలీల్ నేషనల్ స్టేడియంలో, దాదాపు 90,000 మంది అభిమానుల మధ్య జరిగిన జన నాయగన్ చిత్ర ఆడియో విడుదల వేడుకలో విజయ్ సంచలన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, ప్రజాసేవ కోసమే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నా కోసం థియేటర్లలో నిలబడిన అభిమానుల కోసం, రాబోయే ముప్పయి 33 ఏళ్లు నేను నిలబడతాను. ఈ విజయ్ ఫ్యాన్స్ కోసమే నేను సినిమాను వదిలేస్తున్నానని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. తన మూడు దశాబ్దాల సినీ ప్రయాణంలో అభిమానులు అండగా నిలిచారని, వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. నేను ఇసుకతో చిన్న ఇల్లు కట్టుకుందామని సినిమాలోకి వస్తే, మీరంతా నాకు ఒక రాజమహల్ ఇచ్చారు. మీ అందరికీ నా కృతజ్ఞతలని విజయ్ పేర్కొన్నారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న జన నాయగన్ తన 69వ మరియు చివరి చిత్రమని విజయ్ ఈ వేదికగా తేల్చిచెప్పారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది. విజయ్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న తమిళగ వెత్రి కళగం (టివికె) పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026లో జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా ఆయన పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఈ ప్రకటనతో ఆయన పూర్తి సమయం రాజకీయ నేతగా మారనుండటం తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.

# మహనీయుల పోరాటాలకు వేదిక కాంగ్రెస్ పార్టీ

## వ్యవస్థాపక దినోత్సవంలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే



**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం కేంద్ర కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన నాయకులకు ఘననివాళి అర్పించారు. ఎందరో మహనీయుల త్యాగాలతో మనం స్వాతంత్ర్యం సమకూర్చుకోగలిగామని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఈసందర్భంగా పేర్కొన్నారు. పార్టీ 140వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, కార్యాచరణను మరింతగా మనం ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది కార్యకర్తలు ప్రాణత్యాగంచేసారని, వందలాదిమంది జైళ్లకు వెళ్లారని గుర్తుచేసారు. 1885లో స్థాపించిన పార్టీ అప్పటినుంచి భారత్‌కు గుండెకాయలా మారిందని అన్నారు. మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుతోనే స్వాతంత్ర్య పోరాటంలోకి మహిళలు, నిరుపేదలు అన్నివర్గాలప్రజలు పాలుపంచుకున్నారని అన్నారు. ఇదే సంవత్సరం మనం రాజ్యాంగం అమలు 75 ఏళ్లరాజ్యాంగ అమలు దినోత్సవం కూడా జరుపుకున్నామన్నారు. శతాధిక వర్ష పార్టీకి ఆనాడు తొలి మహిళా అధ్యక్షురాలిగా సరోజిని నాయుడు వ్యవహరించిన అంశాన్ని గుర్తుచేసారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, ఆటోమొబైల్, ఐటి రంగాల విస్తరణ, కమ్యూనికేషన్స్ రంగంలో విప్లవం కాంగ్రెస్‌వల్లనే సాధ్యం అయిందన్నారు. యుపిఎ హయాంలో సోనియా గాంధీ నాయకత్వంలో పౌర హక్కులను బలోపేతంచేసామన్నారు. మన్మోహన్‌సింగ్ హయాంలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు లభించిన అంశాన్ని గుర్తుచేసారు. కాంగ్రెస్ నిర్మించిన రాజ్యాంగ సంస్థలను 11 ఏళ్లలో ప్రస్తుత మోడీ సర్కారు నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. దేశంలోని జల్, జంగిల్, జమీన్‌లకు ముప్పు ఏర్పడుతోందని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగ విలువలను ఆర్ఎస్ఎస్ తక్కువచేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అనేది ఒక పార్టీ మాత్రమే కాదని, దేశప్రజలకు కార్యకర్తలకు గుండెకాయ వంటిదని పేర్కొన్నారు. అణగారిన, నిరుపేదల వాణిని నిరంతరం వినిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలతోపాటు జైరామ్‌రమేష్, పార్టీ ఎంపిలు కెసి వేణుగోపాల్, శశిథరూర్, దిగ్విజయ్‌సింగ్ వంటి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

29-12pg10 12 ONG_29-12pg10.qxd 28/Dec/25 10:37 PM Page 1



# టెన్నిస్ టోర్నమెంట్‌లో వైదేహికి టైటిల్

## అంకిత-వైష్ణవి జోడీకి డబుల్స్ టైటిల్

**న్యూఢిల్లీ:** డబ్ల్యూ35 షోలాపూర్ 2025 టెన్నిస్ టోర్నమెంట్‌లో వైదేహి చౌదరి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అలాగూ మహిళల డబుల్స్ విభాగంఒలో అంకిత-వైష్ణవి జోడీ డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం మహారాష్ట్రలో జరిగిన ఈ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి వైదేహిచౌదరి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది.





టోర్నమెంట్‌లో ఆరో సీడ్‌లో ఉన్న 25 ఏళ్ల ఈ క్రీడాకారిణి, మూడు సెట్ల హోరాహోరీ పోరు తర్వాత ఫైనల్‌లో జపాన్‌కు చెందిన దిగువ ర్యాంక్‌లో ఉన్న మిచికా ఒజెకిని 3-6, 6-3, 6 -4 తేడాతో ఓడించింది. ఇది వైదేహి కెరీర్‌లో నాల్గవ ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్. అంతకు ముందు, ఆమె సెమీఫైనల్స్‌లో జాతీయ ఛాంపియన్ వైష్ణవి అడ్కర్‌ను ఓడించి ఫైనల్‌లో స్థానం సంపాదించుకుంది, ఓజెకి తన సెమీస్‌లో రెండవ సీడ్ శ్రీవల్లి భమిడిపాటిని ఓడించింది. గత ఏడాది జూన్ లో చైనీస్ తైపీలో జరిగిన జూ35 తైపీ ఫార్మోసా కప్ టైటిల్‌ను ఆమె గెలుచుకున్న తర్వాత మొదటిది. మరోపక్క సెమీఫైనల్స్ లో ఓడిపోయిన వైష్ణవి డబుల్స్ లో బలంగా పుంజుకుంది. అనుభవజ్ఞురాలైన అంకితా రైనాతో కలిసి మహిళల డబుల్స్ టైటిల్ ను గెలుచుకుంది. సూపర్‌టైబ్రేక్‌ల తర్వాత ఫైనల్‌లో ఇండోరష్యన్ జంట జీల్ దేశాయ్-ఎలినా నెప్లీని 4-6, 7-5, 10-6 తేడాతో ఓడించి టైటిల్‌ను సాధించింది. 21 ఏళ్ల వైష్ణవికి ఇది తొలి సీనియర్ అంతర్జాతీయ టైటిల్ కాగా, 32 ఏళ్ల అంకిత తన 33వ డబుల్స్ టైటిల్‌ను (2025లో నాల్గవది) గెలుచుకుంది.

## దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో..

# సన్‌రైజర్స్ ఘన విజయం

## 42 రన్స్‌కే కుప్పకూలిన రాయల్స్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 2025-26 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ అనుబంధ సంస్థ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఘనంగా ప్రారంభించింది. ఈ టోర్నీలో భాగంగా బోలాండ్ పార్క్ వేదికగా పార్ల్ యారల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పార్ల్ రాయల్స్ 11.5 ఓవర్లలో



కేవలం 42 పరుగులకే కుప్పకూలింది. ఒక్కరంటే ఒక్కరు కూడా పట్టుమని పది నిముషాల కూడా క్రీజులో నిలవలేకపోయారు. మొత్తం తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. కెప్టెన్ మిల్లర్ (7) కూడా ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. సన్‌రైజర్స్ స్పీడ్ స్టార్ అన్రిచ్ నోర్జే 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. అతడితో పాటు, ఆడమ్ మిల్నే, తరించు రత్నాయకే తలా రెండు వికెట్లు సాధించారు. అంతకు ముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 186 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జోర్డాన్ హెర్మన్ (5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 62) టాప్ స్కోరర్‌గా నిలవగా, క్వింటన్ డికాక్ (42) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కాగా ఈ మ్యాచ్‌లో 49 పరుగులకే ఆలౌట్ అయిన పార్ల్ రాయల్స్ అత్యంత చెత్త రికార్డును తమ పేరిట లిఖించుకుంది. సౌతాఫ్రికా టీ20 లీగ్ చరిత్రలోనే అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా లిఖించుకుంది. ఇంతకు ముందు ఈ రికార్డు ప్రిటోరియా క్యాపిటల్స్ (520 పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో ప్రిటోరియాను రాయల్స్ అధిగమించింది.





## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# తిలోత్తమకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో తిలోత్తమ సేన్ అద్భుతమైన ప్రదర్శనతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె 466.9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కర్ణాటక షూటర్ ఫైనల్ పోటీలో ముందంజలో నిలిచింది. కేరళకు చెందిన విదర్స కె. వినోద్ 462.9 పాయింట్లతో రజతాన్ని సాధించగా, రైల్వేస్‌కు చెందిన అయోనికా పాల్ 451.8 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. అంతకుముందు, తిలోత్తమ 591-29+తో అర్హత రౌండ్‌లో అగ్రస్థానంలో నిలువగా, విదర్స 589-29+తో రెండవ స్థానంలో, కర్ణాటకకు చెందిన అనుష్క హెచ్ థోకూర్ 588-33+తో అర్హత రౌండ్‌లో మూడవ స్థానంలో నిలిచింది. ఫైనల్లో, అనుష్క 441.2 పాయింట్లతో నాల్గవ స్థానంలో నిలిచి పతకాన్ని తృటిలో కోల్పోయింది. జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ ఈవెంట్‌లో ఆర్మీకి చెందిన రీతుపర్ణ సతీష్ దేశ్‌ముఖ్ ఫైనల్‌లో 458.6తో బంగారు పతకాన్ని గెలుచుకుంది. క్వాలిఫికేషన్‌లో నాల్గవ స్థానం నుండి రీతుపర్ణ 584-31+తో ఎగబాకి, ఫైనల్‌లో గరిష్ట స్థాయికి చేరుకుంది. హర్యానాకు చెందిన నిశ్చల్ బలమైన సవాలును ఎదుర్కొన్నప్పటికీ 0.5 పాయింట్లు వెనుకబడి 458.1తో రజతాన్ని, కర్ణాటకకు చెందిన అనుష్క హెచ్ థోకూర్ 447.6తో కాంస్యం సాధించింది. సీనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ ఈవెంట్‌లో రాజస్థాన్ జట్టు మణిని కౌశిక్, స్వీటీ చౌదరి, మోనికా జఖర్ 1751 పాయింట్లతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆశి చౌక్సే, శ్రీవల్లి శ్రీవాస్తవ, నూపుర్ కుమ్రావత్ సంయుక్తంగా రాణించడంతో మధ్యప్రదేశ్ 1750 పాయింట్లతో రజత పతకాన్ని గెలుచుకుంది. హర్యానా జట్టు స్వాతి, ఆకృతి దహియా, నిశ్చల్ లు ప్రాతినిధ్యం వహించిన మొత్తం 1750 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

# వన్డేల్లో టాప్ 5 ఇన్నింగ్స్

## భారత్ బ్యాట్స్‌మన్ల అద్భుత ప్రదర్శన



**న్యూఢిల్లీ:** 2025లో టీమ్ ఇండియా వన్డేల్లో అద్భుతాలను సృష్టించింది. మెన్ ఇన్ బ్లూ 14 మ్యాచ్‌లు ఆడి 11 మ్యాచ్‌లు గెలిచి మూడింటిలో మాత్రమే ఓడిపోయింది. దీనితో వారికి 78.57 విజయ శాతం లభించింది. ఈ ఏడాదిని ఇంగ్లాండ్‌పై 3-0 తేడాతో స్వదేశంలో సిరీస్ విజయంతో భారత్ ప్రారంభించింది. ఆ తర్వాత యుఎఇలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో వారు అజేయంగా నిలిచారు. తర్వాత ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కోల్పోయింది. అయితే, దక్షిణాఫ్రికాపై 2-1 తేడాతో స్వదేశంలో సిరీస్ విజయంతో వారు 2025ను అత్యున్నత స్థాయిలో ముగించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది టీం ఇండియా బ్యాట్స్‌మెన్ ఆడిన టాప్ ఐదు వన్డే ఇన్నింగ్స్‌లు తీపి గుర్తులుగా ఉండిపోయతాయి. రాంచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో విరాట్ కోహ్లీ తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించాడు. సిరీస్‌లోని మొదటి వన్డే మ్యాచ్‌లో కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేశాడు. 173 నిమిషాల ఆటలో అతను 11 ఫోర్లు, 7 సిక్సర్లు బాదాడు. అలాగే సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో భారత్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుతమైన సెంచరీతో సంవత్సరాలను వెనక్కి తిప్పాడు. లక్ష్యఛేదనలో రోహిత్ 125 బంతుల్లో 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతను 13 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టాడు. ఇక దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో యశస్వి జైస్వాల్ తన తొలి వన్డే సెంచరీని కూడా సాధించాడు. గాయపడిన శుభ్‌మాన్ గిల్ లేకపోవడంతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన జైస్వాల్, విశాఖపట్నంలో జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో మ్యాచ్ గెలిచే ఇన్నింగ్స్‌ను అందించాడు. 271 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జైస్వాల్ 121 బంతుల్లో 116 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. శుభ్‌మాన్ గిల్ భారత్ తరపున 11 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. 11 ఇన్నింగ్స్‌లలో, అతను 49 సగటు మరియు 88.76 స్ట్రైక్ రేట్‌తో 490 పరుగులు చేశాడు. ఈ సమయంలో 2 సెంచరీలు, మరో 2 హాఫ్ సెంచరీలు సాధించాడు. అహ్మదాబాద్‌లో జరిగిన మూడవ మరియు చివరి వన్డేలో గిల్ 102 బంతుల్లో 112 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. కాగా రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ తన తొలి వన్డే సెంచరీ సాధించాడు. శ్రేయాస్ అయ్యర్ గాయం కారణంగా అవుట్ కావడంతో అతను ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు.

దక్షిణాఫ్రికా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న తర్వాత, భారత్ మొదటి 10 ఓవర్లలోనే ఇద్దరు ఓపెనర్లను కోల్పోయింది. ఆ తర్వాత గైక్వాడ్ బలమైన ఎదురుదాడిని ప్రారంభించి కేవలం 83 బంతుల్లో 105 పరుగులు చేసి 12 ఫోర్లు, 2 సిక్సర్లతో రాణించాడు.

## వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్..

# అగ్రస్థానానికి హంపి

## అర్జున్, గుకేష్ తొలి ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్ 2025లో వరుసగా మూడు విజయాలు సాధించిన తర్వాత భారత్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అగ్రస్థానానికి చేరుకుంది. ఇదే సమయంలో భారత్ గ్రాండ్ మాస్టర్లు ఎరిగైసి అర్జున్, దొమ్మరాజు గుకేష్‌లు తొలి ఓటమిని ఎదుర్కొన్నారు. దోహాలో జరిగిన ఛాంపియన్‌షిప్ టోర్నీ మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ హంపి మొదటి రోజు నెమ్మదిగా ఆడిన హంపి తర్వాత వరుసగా మూడు విజయాలను నమోదు చేసింది. ఆ తర్వాత అలెగ్జాండ్రా గోరియాచ్కినాతో జరిగిన నాల్గవ గేమ్‌లో డ్రాగా ఆడింది. ఈ ప్రదర్శనతో ఆమె 8 ఆటల్లో 6.5 పాయింట్లతో



అగ్రస్థానంలో ఉన్న ఝు జినర్‌తో చేరింది. అలాగే ద్రోణవల్లి హారిక (6/8) 2వ రోజు తర్వాత అజేయంగా నిలిచింది. అయితే దివ్య దేశ్‌ముఖ్ (5.5/8) 8వ రౌండ్‌లో తన మొదటి ఓటమిని ఎదుర్కొంది. ఇక ఓపెన్ విభాగంలో అర్జున్-గుకేష్ వరుసగా ఆరవ, తొమ్మిదవ రౌండ్లలో తమ తొలి ఓటమిని ఎదుర్కొన్నారు. అర్జున్ రష్యాకు చెందిన వ్లాడిస్లావ్ ఆర్టెమియేవ్ చేతిలో తెల్లటి పావులతో ఓడిపోయాడు. గుకేష్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ చేతిలో తలవంచాడు. వారిద్దరూ ఇప్పుడు 9 ఆటల్లో 6.5 పాయింట్లను కలిగి ఉన్నారు. అలాగే భారత్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్లు నిహాల్ సరిన్, రమేష్‌బాబు ప్రజ్ఞానంద, ప్రణవ్ ఆనంద్ 9 ఆటల్లో 6 పాయింట్లు సాధించారు.

## వాణిజ్యం





## టాప్ ఏడు కంపెనీల్లో రూ.35,439.56

# కోట్లు పతనం

## మార్కెట్ విలువల్లో టాప్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

**ముంబయి, డిసెంబరు 28:** భారత్‌లోని టాప్ పది కంపెనీల్లో ఏడు కంపెనీల మార్కెట్ విలువలు రూ.35,439.56 కోట్లు క్షీణించాయి. వీటిలో బజాజ్ ఫైనాన్స్ సింహభాగంలో ఉంది. మార్కెట్ విలువలు బజాజ్‌ఫైనాన్స్ పరంగా రూ.5102.43 కోట్లు క్షీణించి రూ.6,22,124.01 కోట్లకు చేరింది. టాప్ పది జాబితాలో భారతీయ స్టేట్‌బ్యాంకు భారీ నష్టం చవిచూసింది. మార్కెట్ విలువలు రూ.12,692.1 కోటు క్షీణించి రూ.8,92,046.88 కోట్లకు చేరింది. ఇతర సంస్థలు లార్సెన్ అండ్ టూబ్రో మార్కెట్ విలువలు రూ.4002.94 కోట్లు క్షీణించి రూ.5,56,436.22కోట్లకు చేరితే ఐసిఐసిఐబ్యాంకు రూ.2571.39 కోట్లుక్షీణించి రూ.9,65,669.15కోట్లకు చేరినట్లు తేలింది.జీవితబీమా సంస్థ కూడా రూ.1802.62 కోట్లు క్షీణించి రూ.5,37,403.43కోట్లకు చేరితే టిసిఎస్ రూ.1013.07 కోట్లు క్షీణించి 11,86,660.34కోట్లకు చేరుకుంది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మాత్రం మార్కెట్ విలువలు పెంచుకోగలిగింది. రూ.10,126.81 కోట్లు పెరిగి రూ.15,26,765.44కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ రూ.6,626.62 కోట్లుపెరిగి మార్కెట్ విలువలు రూ.6,87,818.84కోట్లకు చేరినట్లుమార్కెట్ గణాంకాలు చెపుతున్నాయి. అలాగే భారతీ ఎయిర్‌టెల్ కూడా 5359.98కోట్లు పెంచుకోగలిగింది. మొత్తం మార్కెట్ విలువలు 12,00,692.32 కోట్లకు చేరాయి. వారంరోజుల్లో హెచ్చు తగ్గులు నెలకొన్నా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐ బ్యాంకు, భారతీయ స్టేట్‌బ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఎల్‌ఐసి సంస్థలు వరుసస్థానాల్లో నిలిచాయి.

# రియాల్టీ రంగానికి 3.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## నైట్‌ఫ్రాంక్ సర్వే నివేదిక వెల్లడి

**ముంబయి, డిసెంబరు 28:** భారత రియల్‌ఎస్టేట్‌రంగంలో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు ఈ ఏడాది ఇప్పటివరకూ 3.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు నైట్‌ఫ్రాంక్ నివేదిక స్పష్టంచేసింది. దీనితో రియల్ ఎస్టేట్‌రంగంపై ఇన్వెస్టర్ల ఆసక్తి స్థిరంగా ఉందని, తక్కువ రిస్క్, స్థిరమైన రాబడులు వస్తుండటంతో ఇన్వెస్టర్లు రియాల్టీవైపు మొగ్గుచూపిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది. ప్రైవేటు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్ ఇండియా హెచ్2 2025 అన్న శీర్షికన పొందుపరిచిన నివేదికలో ప్రైవేటు పెట్టుబడులు భారీగా పెరుగుతున్నట్లు అంచనావేసింది. మొత్తం పెట్టుబడుల్లో 58శాతం ఆఫీస్ రియల్ ఎస్టేట్ వాటాగా ఉంది. మొత్తం 200 కోట్ల డాలర్లుగా ఉన్నట్లు అంచనావేసింది.రియాల్టీరంగంలో ఇన్వెస్టర్లకు నమ్మకం మరింతపెరుగుతున్నట్లు సంస్థాగత డిమాండ్‌తోపాటు లీజు స్థిరత్వం కూడా పెరుగుతూ వస్తోంది. మూడేళ్ల సగటున చూస్తే ఆఫీస్ రియాల్టీలో మరింత విస్తృతం అవుతున్నాయి. ఇక రెసిడెన్షియల్ రియల్‌ఎస్టేట్ రంగంలో రెండో అతిపెద్ద వాటాతో ఉంది. ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 17శాతంగా ఉన్నట్లు తేల్చింది. ఇన్వెస్టర్లు ఎక్కువగా నిర్మాణం పూర్తిచేసిన, రుణ ఆధారిత డీల్స్‌వైపు ఆసక్తి పెంచుతున్నారు. ఇన్వెస్టర్ల ఫోకస్ కూడా రిటర్నులు, పెట్టుబడులకు రక్షణ ఉండేటట్లు చూసుకుంటున్నారు. తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులవైపు ఫోకస్ పెడుతున్నారు. జిడిపి వృద్ధి, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు వంటివి కొంత మెరుగుదలను నమోదుచేసినా పెట్టుబడులను పెంచలేకుండా ఉన్నాయి. దీనివల్ల ఇన్వెస్టర్లు ఎంపికచేసిన రంగాల్లో అప్రమత్తంగా ఉంటున్నారు. గోదాములరంగంమూడో స్థానంలో ఉంది. 15శాతం మొత్తంప్రైవేటు ఈక్విటీపెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక లాజిస్టిక్స్ రంగంపరంగా కూడా స్థిరంగా ఉన్నాయి. ఈకామర్స్, ఉత్పత్తిరంగం, సరఫరా రంగాల్లో వృద్ధి ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులకు ఆసరా ఇస్తున్నాయి. మొత్తంప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల్లోనే రియాల్టీరంగం 11శాతం పెట్టుబడులను ఆకర్షించింది. హైక్వాలిటీ రిటైల్ ఆస్తులు, పటిష్టమైన పనితీరు ఉండటంతో వాటిపైనే ఎక్కువ దృష్టిసారిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ వెల్లడించారు.







**ముంబయి, డిసెంబరు 28:** ప్రభుత్వరంగంలోనిపంజాబ్‌నేషనల్‌బ్యాంకు తమ పరంగా శ్రేయీ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్, శ్రేయి ఇన్‌ఫ్రా ఫైనాన్స్‌లకు ఇచ్చిన రుణాల్లో మోసం జరిగిందని రిజర్వుబ్యాంకుకు తెలిపింది. మొత్తం రూ.2434 కోట్ల మేర మోసం జరిగినట్లు పీఎన్బీ ఆర్‌బిఐకి నివేదించింది. పంజాబ్ సింధ్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు కూడా గతంలో ఈ మోసంపై ఆర్బీఐకి నివేదికలు ఇచ్చాయి. అలాగే పీఎన్బీ స్టాక్ ఎక్స్ఛేంజిల ఫైలింగ్‌లోకూడా ఈసమాచారం తెలిపింది. శ్రేయి ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్‌లో రూ.1240.94 కోట్లమేర ఉన్నాయని,

## 'శ్రేయీ' రుణాల్లో బకాయిలపై

# ఆర్బీఐకి పిఎన్బీ నివేదిక

మిగిలిన మొత్తం 1193.06 కోట్లు శ్రేయి ఇన్‌ఫ్రా ఫైనాన్స్‌పరంగా ఉన్నట్లు వెల్లడించింది. ఈరుణాలకోసమేప్రభుత్వరంగంలో మూడో అతిపెద్ద బ్యాంకు పిఎన్బీ 100శాతం కేటాయింపులు జరిపింది.

ఈ రెండుఖాతాలు మోసాలతో ఉన్న ఖాతాలని కెపిఎంజి ఫోరెన్సిక్ ఆడిటనివేదిక కూడా ఇచ్చిందని వెల్లడించింది. అయితే కెపిఎంజినివేదికను శ్రేయి వ్యవస్థాపకుడు హేమంత్ కనోరియా సవాల్‌చేసారు. శ్రేయిగ్రూప్‌ప్రస్తుతం దివాలా ప్రక్రియలో ఉంది. 2021నుంచి కొనసాగుతున్నది. జాతీయ కంపెనీ లాట్రిబ్యునల్ కంపెనీ దివాలా ప్రక్రియ ప్లాన్‌ను ఆమోదించింది. నేషనల్ అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ అందించిన దివాలాప్రక్రియకు ఎన్సీఎల్టీ ఆమోదం తెలిపింది. శ్రేయీ కంపెనీలు కొనుగోలుకు ఎన్ఎఆర్‌సిఎల్ బిడ్లువేసింది. రూ.32,750 కోట్లు రుణాలు చెల్లించాల్సి ఉంటుందని కూడా తేల్చారు. 2023 ఫిబ్రవరిలో కంపెనీ బిడ్ ఆమోదం లభించింది. 2024 జనవరికల్లా సమీకరణపూర్తిచేసుకోవాలి. సుమారు రూ.14,301 కోట్లు చెల్లించింది. బానయంకర్లకు రూ.3180 కోట్లు అప్‌ఫ్రంట్‌గా చెల్లించింది. డిబెంచర్లరూపంలో రూ.8వేల కోట్లు చెల్లింపులకు కూడా కంపెనీ ముందుకువచ్చింది.

# భారత్ విదేశీ కరెన్సీ ఖజానా కళకళ!

## 693.32 బిలియన్ డాలర్లకు పెరిగిన నిల్వలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** రిజర్వుబ్యాంకులో ఉన్న భారత విదేశీ కరెన్సీ నిల్వలు 4.37 బిలియన్ డాలర్లుపెరిగి 693.32 బిలియన్ డాలర్లమేర రికార్డుస్థాయికి పెరిగాయి. అంతకుముందు వారంలో 688.95 బిలియన్ డాలర్లతోపోలిస్తే 4.37 బిలియన్ డాలర్లుపెరిగినట్లు వెల్లడించింది. గత ఏడాది సెప్టెంబరులో ఒకపర్యాయం 704.89 బిలియన్ డాలర్లమేర నిల్వలు పెరిగాయి. విదేశీ కరెన్సీ ఆస్తులపరంగాచూస్తే బంగారం, స్పెషల్‌డ్రాయింగ్ రైట్స్, ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి వంటివి కీలకంగా పరిగణిస్తారు. ఆర్‌బిఐ విదేశీ కరెన్సీ ఆస్తులు 1.65 బిలియన్ డాలర్లుపెరిగి 559.43 బిలియన్ డాలర్లకు చేరాయి.

అదే అంతకుముందు వారంలో 557.78 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఇక బంగారం పరంగాచూస్తే ఆర్బీఐ వద్ద పసిడి నిల్వలు 2.62 బిలియన్ డాలర్లు పెరిగి 110.36 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద ఆర్బీఐ స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్ స్థాయి 10 మిలియన్ డాలర్లుపెరిగి 18.74 బిలియన్ డాలర్లుగా ఉంది. అదే అంతకుముందు వారంలో అయితే 18.73 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ



వెల్లడించింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి కూడా 96 మిలియన్ డాలర్లుపెరిగి 4.782 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతకుముందు వారంలో అంటే డిసెంబరు 12తోముగిసిన వారంలో 4.686 బిలియన్ డాలర్లుగా నిలిచింది.





## ఫెడ్‌రిజర్వు, డాలర్ రూపీ

# కదలికలే కీలకం!

## ఈ వారంలో బిఎస్ఇ సెన్సెక్స్‌లపై ఇన్వెస్టర్ల అంచనాలు

**ముంబయి, డిసెంబరు 28:** మార్కెట్లు ఆసాంతం ఈ వారంలో కొంతమేర నీరసిస్తే వచ్చేవారంలో మాత్రం గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులు, దేశీయ గణాంకాలు కీలకం కానున్నాయి. వీటికితోడు అమెరికా ఫెడ్ రిజర్వు సమీక్ష నిర్ణయాలు, డాలర్ రూపాయి కరెన్సీ కదలికలు, విదేశీ పెట్టుబడుల లావాదేవీలు కూడా మార్కెట్లకు దిశా నిర్దేశంచేస్తాయి. వారాంతంలో మార్కెట్లు నష్టాల్లోనే ముగిసాయి. గ్లోబల్ మార్కెట్ల పరిస్థితులు మిశ్రమంగా కనిపించడం, ఇన్వెస్టర్ల అప్రమత్తత ఒత్తిడిని మరింతపెంచాయి. వచ్చే వారంలో భారత పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు కీలకం అవుతాయి. ఇన్వెస్టర్లు ఎక్కువగా నవంబరునెల పారిశ్రామిక ఉత్పత్తి డేటాపై దృష్టిసారిస్తారు. సోమవారం ఈ డేటా విడులవుతుంది. అలాగే అమెరికా ఫెడ్ రిజర్వు గణాంకాలుకూడా మార్కెట్లను ప్రభావితంచేస్తాయి. ఈనెల 31వ తేదీ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ పాలసీ నిర్ణయాలు ఛైర్మన్‌జెరోమ్‌పావెల్ వెల్లడిస్తారు. ఫెడ్‌రిజర్వు తన వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.75శాతానికి తీసుకువస్తుందన్న అంచనాలున్నాయి. ఫెడ్ రిజర్వు నిర్ణయాలు మెరుగుపడితే మార్కెట్లనుంచి పెట్టుబడులన్నీ అటువైపు మళ్లుతాయి. ఇక డాలర్ రూపాయి మారకం విలువలు కూడా కీలకం అవుతున్నాయి. వారాంతంలో 19 పైసలు క్షీణించి 89.90 రూపాయలకు చేరుకుంది. మార్కెట్‌లపరంగా దేశీయంగా ప్రభుత్వపరమైన విధాన నిర్ణయాలేమీ లేకపోవడంతో ట్రేడింగ్‌లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉంటారని తెలుస్తోంది. ఆర్థిక గణాంకాలు, గ్లోబల్ సంకేతాలు, విదేశీ ఫండ్‌ల రాక వంటివే ఈ వారం మార్కెట్లలో కీలకం అవుతాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps